ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 3 ఆగస్టు 2026 | సంపుటి: 22 | సంచిక: 300 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

### భవిష్యత్ కార్యాచరణపై

## సీజేపీ దృష్టి

### ఆగస్టు 5న కీలక సమావేశం



కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నివాసంలో (మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్) ఈ నెల 5న కోర్ కమిటీ సమావేశం జరగనుంది. వాలంటీర్లు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమావేశానికి రావాలని సభ్యులు నిర్ణయించుకున్నారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నినాదం)

2



### కర్ణాటక-తమిళనాడు మధ్య

## మరోసారి కావేరి వివాదం

ఆగస్టు 13న బంద్!

ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం విజ్ఞప్తి

2

# వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

### అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

సికింద్రాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన లష్కర్ బోనాలు

ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు



సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సీఎంకు నిర్వాహకులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. సీఎంతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు ఉన్నారు. కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు.

- హైదరాబాద్, ఆగస్టు 2 (నినాదం)

2



### మేం కన్నెర్రజేసి ఏడిస్తే

## రాష్ట్రానికే అరిష్టం

### ప్రభుత్వంపై జోగిని శ్యామల ఫైర్

మేం కన్నెర్రజేసి ఏడిస్తే తెలంగాణ రాష్ట్రానికే అరిష్టమని, మంచిది కాదని జోగిని శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరైన ఆమె ప్రభుత్వ ఏర్పాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి, తమలో ఊపిరి ఉన్నంత వరకు ఇదే వృత్తిలో ఉండి అమ్మవారి సేవకు అంకితం అవుతామని అన్నారు. గత ప్రభుత్వంలో కొంతైనా సాధారణ భక్తులకు, జోగినిలకు ప్రయారిటీ ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల అతి దారుణంగా వ్యవహరిస్తోందని జోగిని శ్యామల కామెంట్ చేశారు.

- హైదరాబాద్, ఆగస్టు 2 (నినాదం)

2



## క్షమించరాని తప్పు చేశాను

### నన్ను క్షమించండి... బాలిక ఆవేదన



**ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలిక క్షమాపణ**

**తన వయసు 15 ఏళ్లేనని, క్షమించాలంటూ వీడియో విడుదల చేసిన బాలిక**

**ఇతరుల ప్రోద్బలంతోనే తప్పు చేశానని, దేశ ప్రజలందరూ క్షమించాలని విజ్ఞప్తి**

2

జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర అభ్యంతరకర పదజాలం ఉపయోగించిన కేసులో నిందితురాలిగా ఉన్న బాలిక సోషల్ మీడియా వేదికగా బహిరంగ క్షమాపణలు చెప్పింది. చేతులు జోడించి నమస్కరిస్తూ.. మాట్లాడిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతోంది. ఇతరుల ప్రోద్బలంతోనే తాను ప్రధానిపై ఆ తరహా అనుచిత వ్యాఖ్యలు చేశానని, తన ప్రవర్తన పట్ల తీవ్రంగా నామూషిగా భావిస్తున్నానని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ప్రస్తుతం తన వయసు కేవలం 15 ఏళ్లేనని చెప్పుకొచ్చింది.

- న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నినాదం)


### ప్రధాని నిర్ణయంతో

## నా కుమార్తెకు పునర్జన్మ

"ప్రధాని క్షమించడంతో నా కుమార్తెకు కొత్త జీవితం లభించింది. అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించినా.. క్షమించి ఆయన గొప్ప మనసును చాటుకున్నారు. ఇవాళ నా కుమార్తె పుట్టినరోజు. ఆమెకు ప్రధాని అత్యంత గొప్ప కానుకగా కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఈరోజు ఆమెకు పునర్జన్మ లభించింది" – బాలిక తల్లి

## మ్యారేజ్ డే అకేషన్...

# పోలీస్ స్టేషన్ల డొనేషన్




*అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ఆ పోలీస్ అధికారి అవినీతికి ఊతమిస్తున్నాడు. తన పరిధిలో ఎస్సై, సీఐ అధికారులు చేయాల్సిన పనులు సైతం తానే చేస్తూ, వారిని చిన్నచూపు చూడడమే కాకుండా, టేబుల్ పైన.., కింద చేతులు పెడుతున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఏకంగా తన 25వ రోజు మ్యారేజ్ డే వేడుకలకు తన పరిధిలోని పోలీస్ స్టేషన్ల నుండి అరలక్ష చొప్పున వసూలు చేశాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతం నుండి కూడా ఈ అధికారి ఉన్న డివిజన్ పరిధిలో అవినీతికి తనే చేయూతనందించాడని, రాజకీయ నాయకులకు ఇతగానికి ఉన్న అవినాభావ సంబంధం వల్లనే ఇంతలా చెలరేగుతున్నాడని డివిజన్ ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారట.*

(స్టేట్ క్రైమ్ బ్యూరో - నినాదం)

## పెండ్లి వేడుకలకు బాస్ హుకుం

### ఘనంగా జరిపిన డివిజన్ పోలీస్

### అన్నింటిలో వేలు పెడుతున్న పెద్దాయన

### అవినీతికి ఊతమిస్తున్న వైనం

### డిఎస్ఆర్ కూడా లీక్..?

### ఉమ్మడి కరీంనగర్‌లోని ఓ సబ్ డివిజన్ భాగోతం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ సబ్ డివిజన్ పోలీస్ అధికారి పై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాను పనిచేస్తున్న ప్రాంతంలో కిందిస్థాయి అధికారులకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా, సరైన విధంగా కేసులు కట్టనివ్వకుండా, అన్నిట్లో వేలు పెడుతూ ఓ దశలో అక్రమ వసూళ్లకు సైతం తెగబడుతున్నాడని వాదన నెలకొంది.డివిజన్ స్థాయి అధికారి కావడంతో కిందిస్థాయి అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో అన్నీ సర్దుతున్నట్లు సమాచారం.

**పెళ్లి వేడుకలకు స్టేషన్ నుంచి నిధులు**

అన్నిటికీ మించి ఇటీవల జరిగిన ఆ అధికారి పెళ్లి వేడుకలకు డివిజన్ పరిధిలోని ఒక్కో పోలీస్ స్టేషన్ నుంచి 50 వేల రూపాయల వరకు వసూలు చేసినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. తమ పై అధికారి వివాహ వేడుకలు కావడం, తమకు హుకుం జారీ చేయడం, తప్పని పరిస్థితిలో చేయడం తప్ప మరేమి చేస్తాం అని ఎస్ హెచ్ ఓ లు వాపోతున్నారట. స్టేషన్ ఖర్చులకే ఫండ్స్ లేని పరిస్థితిలో, తామే స్టేషన్ ను కింద మీద పడి నడుపుతున్నామని, అలాంటి సమయంలో ఇలాంటి బరువులు వేస్తే తామేమి చేయగలమంటూ వారు ప్రశ్నించుకుంటున్నారట. ఇదిలా ఉండగా పలు కేసులలో సైతం ఉద్దేశపూర్వకంగా ఎస్ఐ, సిఐ స్థాయి కేసులలో సైతం ప్రజలను తన దగ్గరకే పిలిపించుకొని ఆలస్యం చేస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

2

## బోనాల ఏర్పాట్లపై బండి అసంతృప్తి



సికింద్రాబాద్ మహాకాళి అమ్మవారిని కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. బోనాల ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్సవాల నిర్వహణ కోసం బిచ్చమెత్తుకోవాలా?అని ప్రశ్నించారు. జంటనగరాల్లో 3 వేలకు పైగా ఆలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతాయని, అందుకు రూ.20 కోట్లు సరిపోతాయా? అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం బోనాలకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన పండుగలు, ఉత్సవాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- హైదరాబాద్, ఆగస్టు 2 (నినాదం)

### పదవీ విరమణ వేడుకలో

## 'కొండమల్లు' నవల బహుకరణ

**ఎస్ఐ ముత్తయ్య దంపతులకు బహుమతిగా ఇచ్చిన తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. గోపీరెడ్డి**

ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పూసపల్లి ముత్తయ్య పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని ఏఎన్ఆర్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. పోలీసు అధికారులు, సహచరులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ముత్తయ్యను శాలువాతో సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

2

- హైదరాబాద్, ఆగస్టు 2 (నినాదం)



పోలీసు రిటైర్డ్ అధికారికి కొండమల్లు నవల బహుకరిస్తున్న తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు వై గోపిరెడ్డి. పక్కన డాక్యుమెంటరీ ఫిలిం మేకర్ చరణ్

# ఇంటింటికీ టీడీపీ

### 7 రోజుల్లో 17.61 లక్షల కుటుంబాలను కలిసిన కూటమి శ్రేణులు

**ఆదివారం సెలవు రోజైనా 3 లక్షలకు పైగా గృహాలను సందర్శించిన నేతలు**

**టెలీకాన్ఫరెన్స్ ద్వారా పురోగతిని సమీక్షించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

**టెక్నాలజీతో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నారా లోకేశ్**



లోకేశ్ సమక్షంలో..

ఏపీ ప్రభుత్వం-ఆస్ట్రేలియా మధ్య

## కీలక ఒప్పందాలు

2



ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ – 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి–సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఏడు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,61,197 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు.

- అమరావతి, ఆగస్టు 2 (నినాదం)




### ఎన్‌టీఏ పరీక్షల భద్రత

## మరింత కట్టుదిట్టం

### రూ.7.5 కోట్లతో టెండర్ ఆహ్వానం

నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లు స్వీకరించనుంది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.

- న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నినాదం)

### జంతర్‌మంతర్ విద్యార్థుల

## ఆందోళనల్లో ఉగ్రకుట్ర

2

**పోలీసు యూనిఫాంలో చొరబడేందుకు యత్నం**

**బంగాల్ సీఎం సువేందు అధికారిని లక్ష్యంగా చేసుకోవాలని నిందితులు ప్రణాళికలు రచించినట్లు గుర్తించిన అధికారులు**



బంగాల్‌లో రెండ్రోజుల క్రితం పట్టుబడ్డ అనుమానిత ఉగ్రవాది హమీమ్ మోండల్ పోలీసుల విచారణలో కీలక విషయాలు వెల్లడించాడు. ఇటీవల దిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల చేపట్టిన ఆందోళనల్లోకి చొరబడి, అల్లర్లు సృష్టించేందుకు అతడు ప్లాన్ చేసినట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని సైతం లక్ష్యంగా చేసుకున్నాడని వెల్లడించారు. అతడికి సహకరించిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నినాదం)

# జంతర్‌మంతర్ విద్యార్థుల ఆందోళనల్లో ఉగ్రకుట్ర

**బంగాల్ సీఎం లక్ష్యంగా ప్రణాళికలు**

బంగాల్లోని తూర్పు బర్ధమాన్ జిల్లాలో హమీమ్ మోండల్ అనే అనుమానిత ఉగ్రవాదిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. ఉగ్రసంస్థ జైషే మహ్మద్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు అతడు పనిచేస్తున్నట్లు ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి కదలికలపై నిఘా ఉంచి, ఆయనకు ఎక్కడ భద్రత తక్కువగా ఉంటుందో సమాచారం సేకరించాలని పాకిస్థానీ హ్యాండ్లర్లు హమీమ్‌ను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. పోలీసు యూనిఫాంలో దిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల్లోకి చొరబడి, విధ్వంసం సృష్టించేందుకు కూడా అతడు ప్లాన్ చేశాడని చెప్పారు.

**పోలీసుల అదుపులో ఝార్ఖండ్ యువతి**

అయితే అతడు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లాడా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఉగ్ర హ్యాండ్లర్‌లతో వారు చేసిన చాట్‌లను పరిశీలిస్తున్నామని ఐజీ గౌరవ్ శర్మ వివరించారు. హమీమ్‌కు సహకరించిన ఝార్ఖండ్



యువతి అర్పితా సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనీట్రాప్ ద్వారా రాజకీయ నాయకులు, ప్రముఖుల నుంచి సమాచారం సేకరించి వాటిని హమీమ్‌కు పంపుతోందని పోలీసులు తెలిపారు.
యువతి అర్పిత సర్కార్ హమీమ్‌కు ప్రియురాలని అధికారులు వెల్లడించారు.
బంగాల్ మంత్రి ఉమేష్ రాయ్ కుమారుడిని హనీట్రాప్ ద్వారా కిడ్నాప్ చేసి, భారీగా డబ్బు వసూలు చేసేందుకు వీరిద్దరూ ప్లాన్ చేసినట్లు విచారణలో వెల్లడైంది.

చిన్నస్థాయి నేతలను పరిచయం చేసుకొని వారి ద్వారా ప్రముఖ నేతలపై నిఘా పెట్టడం, తమ వారిని రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా నియమించడం వంటి పనులకు హమీమ్ ఆమెను వినియోగించుకునేవాడు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు**

పాకిస్థాన్‌కు చెందిన షెహజాద్ భట్టి గ్యాంగ్‌తో వీరికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రానా, ఉజైర్, అబిద్ జట్, అనే పేర్లతో ఉన్న పాక్ హ్యాండ్లర్ల ద్వారా వీరికి ఆదేశాలు వచ్చినట్లు గుర్తించారు. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా నిందితులిద్దరూ సమాచారాన్ని పంచుకునేవారని కనుగొన్నారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఈ ఇద్దరూ, తర్వాత పాకిస్థాన్ ఆపరేటర్ల వలలో పడి తీవ్రవాద భావజాలాన్ని అలవర్చుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరు ఎస్‌టీఎఫ్ కస్టడీలో ఉన్నారు. ఈ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.
అహ్మదాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఈ ముఠా ప్రయత్నించినట్లు ఏటీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఈ మాడ్యూల్ గుజరాత్‌కే పరిమితం కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే ప్రయత్నం చేసినట్లు అనుమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. నిందితులను అహ్మద్, ఇబ్రహీం, ముదస్సిర్, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్, మహమ్మద్ అమీన్ షేరా, మహమ్మద్ అబ్దుల్, బిలాల్ మహమ్మద్‌గా ఏటీఎస్ అధికారులు గుర్తించారు.

> పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు గతంలో అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా గుర్తించారు.

# మ్యారేజ్ డే అకేషన్... పోలీస్ స్టేషన్ల డొనేషన్

**ఎస్సై సస్పెండ్..?**

కాగా సదరు అధికారి చేసిన ఉద్దేశపూర్వ నిర్లక్ష్యం ఓ ఎస్సై సస్పెండ్ కు కూడా దారితీసిందన్న అపవాదు నెలకొని ఉంది. ఓ కేసులో 'తనయుడు' విషయమై తాత్సారం చేయడం, కౌన్సిలింగ్ పేరిట సమయం తీసుకోవడం వల్ల చిన్న కేసుగా కోర్టుకెళ్లి, తిరిగి వచ్చి ఆ నిందితుడు ఓ మర్డర్ చేసినట్లుగా ప్రచారంలో ఉంది. ఆ విషయంలో ఎస్ఐ స్థాయి అధికారి నిర్లక్ష్యం అంటూ ఆ అధికారిపై తోసేయడం వల్ల సస్పెండ్ అయినట్లుగా తెలిసింది.

**డిఎస్ఆర్ లీక్**

డివిజన్స్ స్థాయిలో ప్రధానమైన డి ఎస్ ఆర్ (డైలీ సిచ్యుయేషన్ రిపోర్ట్) ను సైతం జిల్లా బాస్ కు అందించడం కంటే ముందే ఓ ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రముఖునికి అందిస్తున్నట్లుగా తీవ్రమైన ఆరోపణ వినవస్తున్నది. డి ఎస్ ఆర్ లో అత్యంత కీలకమైన సమాచారం ఉంటుంది.ఆ డివిజన్ పరిధిలో రాజకీయ, నేర తదితర అంశాలపై వివరణ ఉంటుంది.
దాన్ని ఎస్పీల కంటే ముందే ఓ పార్టీ నాయకులకి చేరవేయడం వెనుక ఎంతటి 'క్విడ్ ప్రో' ఉందోనని చర్చ జరుగుతున్నది.

**ఎస్పీ చేతులు కట్టేసారా..?**

పోలీసు శాఖలో అత్యంత కీలకమైన 'ఎస్బీ' పనితీరును క్రమంగా నిర్వీర్యం చేయడం వల్లనే ఇట్లాంటి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తున్నది.జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఉంటే ఎస్బీ.., పోలీస్ స్టేషన్ పనితీరును, సిబ్బంది పనితీరును సమీక్షిస్తూ రిపోర్టులు తయారు చేసి ఉన్నతాధికారులకు ఇస్తుంది. ఈ విషయంలో కూడా ఎస్బీ తన పనితీరును చూపించాల్సిన అవసరం ఉందని ప్రజల భావిస్తున్నారు.

**డిజిపి పై పోలీసుల ఆశలు**

తెలంగాణ డిజిపి సివి ఆనంద్ పై ఆ సబ్ డివిజన్ పోలీసులు ఆశలు పెట్టుకున్నట్టు తెలుస్తున్నది.అధికారులు తప్పు చేస్తే కఠినంగా వ్యవహరిస్తున్న డీజీపీ ఈ డివిజన్ పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని డివిజన్ ప్రజలు, ప్రముఖులు అంటున్నారు.చాలామంది ప్రజలలో కూడా ఈ డివిజన్ వ్యవహారంపై పలు భిన్నాభిప్రాయాలు న్నాయి. డిజిపి ఆనంద్ వెంటనే సబ్ డివిజన్లో విచారణ చేస్తే నిజానిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. నిజంగానే సబ్ డివిజన్ స్థాయి అధికారి అలా చేసి ఉంటే ఖచ్చితంగా డిజిపి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## భవిష్యత్ కార్యాచరణపై సీజేపీ దృష్టి

ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. అనంతరం విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి దీప్కే ఆదివారం వేడుకలు నిర్వహించారు

## హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం

**హైదరాబాద్, ఆగస్టు 2 (నినాదం)**

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, బోరబండ, యూసుఫ్‌గూడ, ముషీరాబాద్, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, దోమలగూడ, కవాడిగూడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. పలుచోట్ల ట్రాఫిక్‌జామ్ అయ్యింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా, మాన్‌సూన్ టీమ్స్ రంగంలోకి దిగాయి. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాయి.




## మేం కన్నెర్రజేసి ఏడిస్తే రాష్ట్రానికే అరిష్టం

వేలాదిగా ఉన్న శివశక్తుల్లో కేవలం తమకు 5 పాస్‌లు ఇస్తామని చెప్పారని అన్నారు. ఆ ఐదుగురిలో బాగా ఫేమస్ అయిన వాళ్లకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని వేడుకున్నామని, పోలీసులు మాత్రం తమ రిక్వెస్ట్‌ను పట్టించుకోలేదని ఆరోపించారు. అమ్మవారిని దర్శించుకునే సమయంలో ఆలయానికి వస్తుండగా.. భక్తుల రద్దీ మధ్య తాము తీవ్ర అసౌకర్యానికి లోనయ్యామని జోగిని శ్యామల అన్నారు. జోగినిలు ఏడిస్తే.. రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టమని పేర్కొన్నారు. బోనాలకు ముందు మమ్మల్ని ప్రభుత్వం మీటింగ్‌కి రావాలని చెబితే వెళ్లామని.. వాళ్లకు సహకరించామని అన్నారు. తీరా చూస్తే సెక్యూరిటీ కల్పించకుండా, పాస్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సమంజసమేనా అని ప్రశ్నించారు. జోగినిల్లో అంతా చదువుకున్న వాళ్లమే ఉన్నామని, తమకు ఆలయ బోర్డులలో ఎందుకు అవకాశం కల్పించరని అన్నారు. రాష్ట్రంలో బోనాల పండుగను రాజకీయ నాయకులు, పోలీసులే చేసుకోండని సెటైర్లు వేశారు. మహంకాళి అమ్మవారి బోనాలు ఇవాళ కాదని.. జోగినులమైన తాము ఎప్పుడు బోనాలు ఎక్కిస్తామో ఆనాడు పండుగని జోగిని శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు.

# వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు





అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన పొన్నం : అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు పడాలని వేడుకున్నట్లు వివరించారు. భక్తులకు మహంకాళి అమ్మవారు దేదీప్యమానంగా దర్శనం ఇస్తున్నారు.
భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు : తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించేందుకు ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరు క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. బోనంతో వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 2,500 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశారు. 500 మంది ప్రత్యేక వాలంటీర్లు సేవలందిస్తున్నారు. బోనాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.
భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన, అమ్మవారికి పట్టు వస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మీడియాతో మాట్లాడుతూ భాగ్యనగరంలో ఆషాఢ బోనాల పండుగకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా ఉత్సవాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల జాతరలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని వివరించారు. భక్తుల భద్రత, రక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.
తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ : ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకలకు దాదాపు 2,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. ఉత్సవాల్లో ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను మహంకాళి ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక ఏఐ వ్యవస్థ ద్వారా ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలతో ముఖాలను విశ్లేషించే 'ఫేషియల్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. దీనివల్ల పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను తక్షణమే గుర్తించి అప్రమత్తమయ్యే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.
తొక్కిసలాటలు జరగకుండా చర్యలు : అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను క్యూ మేనేజ్‌మెంట్ ద్వారా కచ్చితంగా లెక్కిస్తామని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. ఆలయం లోపల వివిధ విభాగాలు, క్యూ లైన్లలో భక్తుల రద్దీ సాంద్రతను 'థ్రెషోల్డ్ మ్యాపింగ్' ద్వారా నిరంతరం విశ్లేషిస్తూ, పరిమితికి మించి రద్దీ పెరిగితే ముందస్తు చర్యల ద్వారా తొక్కిసలాటలు జరగకుండా నివారిస్తామని స్పష్టం చేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా దేవాదాయ శాఖ, జీహెచ్‌ఎంసీ, తదితర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నామని వివరించారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని, జాతర విజయవంతంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు

## అలా హామీ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ..

**లేకుంటే తప్పుకుంటా..**
**మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**నల్లగొండ, ఆగస్టు 2 (నినాదం)**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు మాట ఇస్తేనే తాను బరిలో ఉంటానని, లేదంటే తప్పుకుంటానని మంత్రి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నామినేషన్ వేసిన తర్వాత ప్రచారానికి రాకపోయినా.. నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో తన ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తన సొంత నియోజకవర్గం నల్లగొండలోని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన నియోజకవర్గ ఓటర్లకు ఓ కండిషన్ పెట్టారు. వచ్చే ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మాట ఇస్తేనే తాను పోటీలో ఉంటానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ స్పష్టమైన హామీ రాకుంటే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుంటానని ప్రకటించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీశారు. స్వయంగా తాను ఎన్నికల ప్రచారానికి రాకపోయినా, ఇప్పటి వరకు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రమంలో తన రాజకీయ జీవితం, సొంత ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, పలుసార్లు మంత్రిగా ఉన్నపటికీ తనకు సొంత ఇల్లు, భారీగా ఆస్తులు లేవని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నానని, తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తుల తప్ప తాను సొంతంగా సంపాదించుకున్నవి లేవని పేర్కొన్నారు. నల్లగొండ అభివృద్ధే తన ధ్యేయమని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తానని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# ఇంటింటికీ టీడీపీ

ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం విరామం తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను గణాంకాలతో సహా తెలియజేశారు. ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర



అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మరోవైపు, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఆదివారం కూడా విశేష ఉత్సాహంతో పాల్గొనడం, ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని లోకేశ్ అన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## లోకేశ్ సమక్షంలో.. ఏపీ ప్రభుత్వం-ఆస్ట్రేలియా మధ్య కీలక ఒప్పందాలు

**అమరావతి, ఆగస్టు 2 (నినాదం)**

ఏపీ ప్రభుత్వం, ఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్యా, పరిశోధన, పారిశ్రామిక సంస్థల మధ్య క్లీన్ ఎనర్జీ, సమ్మిళిత విద్య, మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నాలుగు ఒప్పందాలు కుదిరాయి. విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఇటీవల జరిపిన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా అక్కడి ప్రతినిధులను ఆహ్వానించి, ఏపీలో ఉన్న రాయితీలను వివరించిన ఫలితంగా ఈ చరిత్రాత్మక భాగస్వామ్యం సాధ్యమైంది. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఈ ఎంవోయూలపై ఇరుపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలలో భాగంగా విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, ఐఐటీ తిరుపతి, సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ సంయుక్తంగా ఐఐటీ తిరుపతిలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి.



**కర్ణాటక-తమిళనాడు మధ్య**

## మరోసారి కావేరి వివాదం

కావేరి నదీ జలాల పంపకాలపై కర్ణాటక-తమిళనాడు మధ్య మరోసారి వివాదం తీవ్రరూపం దాల్చింది. కావేరి జలాలను విడుదల చేయాలని కోరుతూ తాజాగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సమయంలో కావేరి జలాల నిర్వహణ అథారిటీ రోజుకు 3,500 క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆదివారం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రానికి తాగునీరు, ఇతర అవసరాల కోసం సుమారు 40 టీఎంసీల నీరు అవసరమని శివకుమార్ తెలిపారు. అయితే దేశ చట్టాలను గౌరవిస్తూ, తమిళనాడుపై ఉన్న చట్టబద్ధ బాధ్యతలను కూడా కర్ణాటక పాటిస్తుందని స్పష్టం చేశారు.

**ఆగస్టు 13 బంద్‌కు పిలుపు**

ఆగస్టు 13న ప్రతిపాదించిన బంద్‌ను రైతులు, ప్రతిపక్షాలు, కన్నడ సంఘాలు విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బంద్ వల్ల ప్రజలకు, వ్యాపారాలకు, విద్యాసంస్థలకు ఇబ్బందులు తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగం ఉండదని అన్నారు. కావేరి జలాల వివాదాన్ని రాజకీయాలకు అతీతంగా చర్చల ద్వారా పరిష్కరించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది.

## పదవీ విరమణ వేడుకలో 'కొండమల్లు' నవల బహుకరణ

ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సాహితీకారుడు వై. గోపీరెడ్డి ముత్తయ్య దంపతులకు రచయిత వర్దెల్లి వెంకటేశ్వర్లు రచించిన చారిత్రక నవల 'కొండమల్లు'ను బహుకరించారు.
పదవీ విరమణ అనంతరం తీరిక సమయాల్లో తప్పకుండా ఈ నవలను చదవాలని సూచించిన గోపీరెడ్డి, పాలనాటి సీమ చారిత్రక నేపథ్యంపై రచించబడిన 'కొండమల్లు' తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం పొందిన రచన అని పరిచయం చేశారు. వీరయోధుల శౌర్యం, త్యాగం, ప్రేమ, విశ్వాసం, స్వాభిమానాన్ని ఆవిష్కరించిన ఈ నవల పాఠకులను చారిత్రక యుగంలోకి తీసుకెళ్తుందని, పాలనాటి చరిత్ర, సంస్కృతిని జీవంతంగా ప్రతిబింబించే రచనగా నిలిచిందని పేర్కొన్నారు.
పోలీసు సేవలో విశిష్ట సేవలందించిన ముత్తయ్యకు పదవీ విరమణ సందర్భంగా అందించిన ఈ చారిత్రక నవల కార్యక్రమానికి సాహిత్యపరమైన ప్రత్యేకతను తీసుకొచ్చింది. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, మిత్రులు, సాహితీ అభిమానులు పాల్గొని ముత్తయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్షమించరాని తప్పే చేశాను

వైరల్ అవుతున్న వీడియోలో టీషర్టు ధరించిన ఆ బాలిక.. తీవ్ర పశ్చాత్తాపంతో తన పొరపాటును అంగీకరించింది. పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నిందితురాలి వయస్సును 25 ఏళ్లుగా పేర్కొన్నప్పటికీ.. ఆ వీడియోలో తాను "కేవలం 15 ఏళ్ల వయసు కల్గిన చిన్న పిల్లను" అని చెప్పడం గమనార్హం."నేను చేసిన పని ఏమాత్రం క్షమించరానిది. ప్రధానిపై చాలా చెడు వ్యాఖ్యలు చేశాను. దేశ ప్రజలందరికీ నమస్కరించి క్షమాపణలు కోరుతున్నాను. నా చర్యల పట్ల నాకు చాలా సిగ్గుగా ఉంది. నన్ను నేనే చూసుకోలేకపోతున్నాను. ఇది నా మొదటి, చివరి తప్పుగా భావించి నన్ను క్షమించండి" అని చేతులు జోడించి విజ్ఞప్తి చేసింది. అయితే ఈ వీడియో చేసింది నిజంగా ఆ బాలికేనా కాదా అనేది ఇంకా ధ్రువీకరణ కాలేదు.

**అసలేం జరిగిందంటే..?**

నీట్ పేపర్ లీకేజీలపై జూలై 23వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో ఓ యువతి ప్రధానిపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. పోలీసులు సదరు యువతిపై కేసు నమోదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజల్లో అశాంతి రేకెత్తించడం, మానసస్థానికి పాల్పడటం వంటి భారతీయ న్యాయ్ సంహితలోని సెక్షన్లు 352, 353(1), 356(1) కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కోసం ఈ కేసును ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

**వాళ్లంతా మన పిల్లలే క్షమిస్తున్నా.. ప్రధాని మోదీ ఎమోషనల్ వీడియో**

క్షమించేద్దామన్న ప్రధాని.. వెంటనే సారీ చెప్పిన బాలిక జంతర్ మంతర్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రి సోషల్ మీడియా ద్వారా ఓ వీడియో విడుదల చేశారు. తనపై, తన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువతను తాను క్షమిస్తున్నానని.. అలాగే ప్రజలు కూడా వారిని క్షమించాలని ఆ వీడియోలో కోరారు. తప్పుగా మాట్లాడినప్పటికీ ఆ పిల్లలంతా మన వాళ్లేనని చెప్పుకొచ్చారు. ఈ వీడియో వైరల్ అయిన కాసేపటికే సదరు బాలిక కూడా వీడియో చేసి పెట్టడం గమనార్హంగా మారింది.



## ఆధార్ తరహాలో 'భూధార్'

**ప్రతీ సర్వే నంబర్‌కు కేటాయిస్తామన్న పొంగులేటి**
**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధుల కొరత ఉండదని హామీ**

**హైదరాబాద్, ఆగస్టు 2 (నినాదం)**

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. పేదల భూములను అక్రమంగా చేజిక్కించుకున్న వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై త్వరలోనే ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోని ధరణి వ్యవస్థ నుంచి ప్రస్తుత 'భూ భారతి' వరకు జరిగిన ప్రతి లావాదేవీని క్షుణ్ణంగా పరిశీలిస్తామని మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చలేదని, గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన జాబితాపై ప్రస్తుతం సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 276 గ్రామాల్లో భూముల రీ-సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో విశిష్ట 'భూధార్' నంబర్‌ను కేటాయించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. అసైన్డ్ భూముల సమస్యల శాశ్వత పరిష్కారానికి త్వరలోనే స్పష్టమైన, సమగ్రమైన విధానాన్ని తీసుకువస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీపడబోదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల విడుదల ఆలస్యమైనప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు క్రమం తప్పకుండా చెల్లింపులు జరుపుతామని ఆయన భరోసా ఇచ్చారు. భూముల విలువ సవరణ అనంతరం రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం 10 నుంచి 20 శాతం మేర పెరిగిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా సుమారు రూ.18 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# స్పారోకాన్ ఆర్కిటెక్ట్స్‌లో ఇంటర్న్ షిప్ పూర్తిచేసిన ఆర్కిటెక్చర్ విద్యార్థులు



**పటాన్చెరు, ఆగస్టు 02 ( నినాదం):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కు చెందిన ముగ్గురు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, స్పారోకాన్ ఆర్కిటెక్ట్స్ లో తమ వేసవి ఇంటర్న్ షిప్ ను విజయవంతంగా పూర్తిచేసినట్టు ఆదివారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. పరిశ్రమతో అనుసంధానించిన అభ్యాసం, అనుభవపూర్వక విద్య పట్ల విశ్వవిద్యాలయ నిబద్ధతలో ఇది మరో ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించారు. స్పారోకాన్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ ఆర్. జబ్బర్ షేక్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు– మోసిన్, శ్రియా, మరియా తమ ఇంటర్న్‌షిప్ ను పూర్తిచేశారని, తద్వారా వారు ఒక చైతన్యవంతమైన పారిశ్రామిక వాతావరణంలో వృత్తిపరమైన ఆర్కిటెక్చరల్ పద్ధతులు, డిజైన్ విధానాలు, ప్రాజెక్టు అమలుపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందినట్టు పేర్కొన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ), విశ్వవిద్యాలయ ఇండస్ట్రీ సెల్ (యూఐసీ)ల సమన్వయంతో ఈ ఇంటర్న్ షిప్ అవకాశం లభించిందన్నారు. జీసీజీసీ సమన్వయకర్త ఆర్. స్నిగ్ధరాయ్ ఈ ముగ్గురినీ సిఫారసు చేయగా, యూఐసీ సభ్యుడు ఆర్. అభిషేక్ కుమార్ సింగ్ ఈ ప్రక్రియను సమన్వయం చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు వారి విద్యా ప్రస్థానం ప్రారంభ దశలోనే అ–ర్థవంతమైన పరిశ్రమ అనుభవాన్ని అందించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో భాగంగా, ఆర్కిటెక్చర్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బందన్ కుమార్ మిశ్రా ఈ కార్యక్రమానికి మద్దతిచ్చి, ప్రోత్సహించినట్టు వివరించారు. ఇంటర్న్ షిప్ సమయంలో, విద్యార్థులు వృత్తిపరమైన పని విధానాలు, సమకాలీన ఆర్కిటెక్చరల్ డిజైన్ పద్ధతులు, ప్రాజెక్టు సమన్వయం, కార్యాలయ సహకారంపై ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందినట్టు తెలియజేశారు. ఈ అనుభవం వారి సాంకేతిక, వృత్తిపరమైన సామర్థ్యాలను మెరుగుపరుస్తూ, తరగతి గది అభ్యాసానికి, వాస్తవ ప్రపంచ ఆర్కిటెక్చరల్ ఆచరణకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి వారికి వీలు కల్పించిందన్నారు. విద్యార్థుల పనితీరును ప్రశంసిస్తూ, ఆర్కిటెక్ట్ జబ్బర్ షేక్, ఆర్కిటెక్చరల్ సాఫ్ట్ వేర్ లో విద్యార్థులకున్న పటిష్టమైన పునాదిని, సమర్థవంతమైన భావ ప్రకటనా నైపుణ్యాలను, నేర్చుకోవాలనే ఆసక్తిని, వృత్తిపరమైన వాతావరణంలో కలిసికట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని అభినందించినట్టు తెలిపారు. విద్యార్థులు ప్రశంసనీయమైన వృత్తి నైపుణ్యాలను, సానుకూలతను ప్రదర్శించినట్టు ఆయన ప్రశంసించారన్నారు. ఈ ముగ్గురి అంకితభావం, సామర్థ్యాలకు ముగ్ధుడైన జబ్బర్ షేక్, ముఖ్యంగా విద్యార్థుల ఇంటర్న్ షిప్, ప్లేస్ మెంట్లు, భవిష్యత్ పరిశ్రమ భాగస్వామ్య కార్యక్రమాలలో, విశ్వవిద్యాలయ ఇండస్ట్రీ సెల్ ద్వారా గీతంతో పరిశ్రమ–విద్యా సంస్థల సహకారాన్ని బలోపేతం చేయడానికి ఆసక్తిని వ్యక్తపరిచనట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# డిజిటైజేషన్‌లో అనంతగిరి మండలానికి తొలిస్థానం

**కోదాడ,ఆగస్టు 2(నినాదం):** కోదాడ నియోజకవర్గంలో 93.90 శాతం డిజిటైజేషన్ పూర్తి చేసి తొలి స్థానంలో నిలిచిన అనంతగిరి మండలంలోని బీఎల్‌ఏలు, బూత్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ప్రతి గ్రామంలో సమన్వయంతో పనిచేసిన ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఇదే ఉత్సాహంతో మిగిలిన డిజిటైజేషన్ ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసి అనంతగిరి మండలాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి బీఎల్‌ఏ, బూత్ ఏజెంట్, గ్రామ నాయకత్వానికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



# కళలు సంస్కృతిక నిలయాలు

### ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పూసపాటి పరమేష్



**మిర్యాలగూడ, ఆగస్టు 2(నినాదం):** కళలు సాంస్కృతిక నిలయాలు అని ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ అధ్యక్షులు పూసపాటి రమేష్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడలోని శ్రీనివాస కల్చరల్ స్టూడియోలో "స్వర రాగ స్రవంతి" తొలి సంచిక సంగీత విభావరి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్టూడియో అధినేతలు వై. శ్రీనివాసరావు, వై. విఘ్నేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కందుకూరి సుదర్శన్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మిర్యాలగూడ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పూసపాటి పరమేష్ ని నిర్వాహకులు, గాయనీ గాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూసపాటి పరమేష్ మాట్లాడుతూ, కళలు సంస్కృతి కి నిలయాలని,మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు శారీరక ఆరోగ్యానికీ దోహదపడుతుందని అన్నారు. ఇలాంటి సంగీత కార్యక్రమాలు సమాజంలో సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు శైలజ, నాగమణి, సరస్వతి, మౌనిక, ముడుంబై దామోదరాచార్యులు, నందిగామ అరవిందశర్మ, రవి, వంగూరి శ్రీనివాస, కందుకూరి సుదర్శన్, ఏలె సత్యనారాయణ తదితరులు తమ మధుర గానాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలోస్టూడియో అధినేత వై. విఘ్నేష్,అడ్వకేట్ నేతి సత్యనారాయణ పునీత్, పబ్బతి గంగాధర్, శేఖర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

### నాలాపై బ్రిడ్జి నిర్మాణంతో

# తీరిన ప్రజల కష్టాలు

### న్యూ షాపూర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన నాలా బ్రిడ్జిని ప్రారంభించిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 2 (నినాదం) :** గాజులరామారం సర్కిల్ న్యూ షాపూర్ నగర్ లో నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో వర్షాకాలంలో ప్రజలకు కలిగే వరద ఇబ్బందులు కష్టాలు తొలగిపోయాయని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేందర్ గౌడ్ సొంత నిధులతో పాటు కాలనీ వాసుల సౌజన్యంతో సుమారు రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన నాల బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టిన శుభ పరిణామం అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కాలనీవాసులు నాలా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు చాలా కష్టాలు పడేవారని తెలిపారు, గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని విమర్శించారు, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రజల అవసరాలను గాలికి వదిలేశారని విమర్శించారు.. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం లభించిందని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించినట్లైందని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.. నాలా బ్రిడ్జ్ నిర్మాణానికి సొంత నిధులను వెచ్చించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు కూన రాఘవేందర్ గౌడ్ ను మాజీ ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో, ప్రజాసేవలో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన రాఘవేందర్ గౌడ్, నాగిళ్ల శ్రీనివాస్, చౌద శ్రీనివాస్, నారాయణ గౌడ్, మక్బుల్ కాలనీవాసులు ఫెరోజ్, అలీముద్దీన్, మహమ్మద్ మైన్, అజ్జు పటేల్, ఆరిఫ్, షకీల్, నయీమ్, ఖలీమ్, మోహన్, బాలమణి తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అస్పత్రిపై పట్టింపు కరువు

> రోగులకు శాపంగా మారిన పెద్దాసుపత్రి
>
> ఉన్న రోగం పోతదని వస్తే..
>
> కొత్త రోగాలు వచ్చేలా ఆసుపత్రి తీరు
>
> ఇటీవలే ప్రారంభించిన ఎమ్మారై స్కాన్,
>
> నిత్యం మూతబడి ఉండటమేంటి.?
>
> మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 02(నినాదం):** భూపాలపల్లి జిల్లా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన జిల్లా జనరల్ ఆసుపత్రి నేడు సమస్యల నిలయంగా మారిందని పాలకులకు, అధికారులకు పట్టింపు ఎందుకు లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆదివారం సందర్శించారు. ఆసుపత్రిని కలియ తిరిగి సమస్యలను పరిశీలించారు. వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో తాగునీటి సమస్య, అపరిశుభ్రమైన వాతావరణం, రోగులకు కనీస సౌకర్యాల లేమి, వైద్య సేవలపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలకి రెండు సార్లు విజిట్ చేశామని నిత్యం సమీక్షలు నిర్వహించి జిల్లా ఆసుపత్రి అంటే ప్రజలకు భరోసా, నాణ్యమైన వైద్యం అందించి వారికీ నమ్మకాన్ని కల్పించామని పేర్కొన్నారు. కరోనా కష్ట సమయంలో ఈ ఆసుపత్రి ద్వారా ఎంతో మందికి చికిత్స అందించామని కానీ ప్రస్తుతం చిన్న సమస్య వచ్చినా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది జిల్లా జనరల్ ఆసుపత్రా లేక రిఫరల్ సెంటరా అని ప్రశ్నించారు. ఆదివారం వస్తే ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండవా? అత్యవసర పరిస్థితుల్లో వచ్చే పేద ప్రజలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని . తాగునీటి కోసం బయట నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారని తెలిపారు. టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కొన్ని టాయిలెట్ గదులకు తాళాలు వేసి ఉండటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు తరచూ వెలుగులోకి వస్తున్నా ప్రభుత్వం కానీ సంబంధిత అధికారులు కానీ పక్కనే కూత వేటు దూరంలో ఉన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు కూడా స్పందించడం లేదని విమర్శించారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో కూర్చొని ప్రారంభించిన ఎంఆర్ఐ స్కాన్ కూడా వినియోగంలోకి రావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా చూడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలు గొప్పవి అని జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేసి ప్రజల ప్రాణాలను కాపాడండి అని గండ్ర వెంకటరమణారెడ్డి ఈ సందర్భంగా కోరారు.

## మైసమ్మ తల్లిని దర్శించుకున్న మార్కెట్ చైర్ పర్సన్

**ఆమనగల్లు,ఆగస్టు 02(నినాదం):** ఫ్రెండ్షిప్ డే వేడుకల సందర్భంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలంలోని ప్రసిద్ధి చెందిన మైసిగండి మైసమ్మ తల్లిని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నరసింహ తన మిత్రులతో కలిసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ, మధుసూదన్, అరుణ, స్వాతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. స్థానిక నాయకులు, మిత్రబృందం ఈ ఆధ్యాత్మిక యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

### కాంగ్రెస్ పార్టీలో చేరిన బోడిషెట్ పల్లి సర్పంచ్, వార్డు సభ్యులు

### పార్టీ కండువా కప్పి స్వాగతించిన మంత్రి



**సంగారెడ్డి బ్యూరో, అగస్టు 2 (నినాదం):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు సంగారెడ్డి జిల్లాలో ముఖ్యంగా ఆందోల్ నియోజకవర్గం లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన బోడి షెట్ పల్లి సర్పంచ్ పి. మల్లేశ్వరి సంగన్న, వార్డు సభ్యులు అనంత శ్యామమ్మ, అనంతలక్ష్మి, శ్రీకాంత్ గార్ల ముఖ్య అనుచరులు, కార్యకర్తలు యాదుల్ల షబానా, డా. సుల్తాన్ లతో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి మంత్రి స్వాగతించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన అనంతరం రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామాలలో మహిళా సాధికారత, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, మంచినీటి సరఫరా, ఉపాధి అవకాశాల పెంపుకు కృషి చేస్తున్నామని మంత్రి దామోదర్ నరసింహ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ని నమ్ముకొని వచ్చిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సతీష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, జైనుద్దీన్ లు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

**కుత్బుల్లాపూర్, అగస్టు 2 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ దుండిగల్ తండా2 లోని శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ బోనాల ఉత్సవాల్లో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బోనాల వేడుకలు ప్రజల ఐక్యతను, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబిస్తూ, ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు, తాజా మాజీ కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఈవీల వినియోగం పెంచాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 2 (నినాదం ):** కేటో మోటార్స్ 9 మీటర్ల ఎలక్ట్రిక్ బస్సు ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వదేశీ సాంకేతికతతో భారత్ కోవిడ్ వ్యాక్సిన్ తయారు చేసి 100 దేశాలకు సరఫరా చేయడం దేశ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. యువత, శాస్త్రవేత్తలకు అవకాశాలు కల్పిస్తే ప్రపంచ స్థాయిలో రాణిస్తారని చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో 73 శాతం బొగ్గుపైనే ఆధారపడుతున్నామని, భవిష్యత్తులో సోలార్, విండ్, హైడ్రోజన్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. విదేశీ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పంచవటి కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణల తొలగింపు

**రాజేంద్రనగర్,ఆగస్టు 2 (నినాదం):** గండిపేట మండలం పంచవటి కాలనీలోని సర్వే నెంబర్ 42లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన టీన్ల ప్రహరీని రెవెన్యూ అధికారులు ఆదివారం కూల్చివేశారు. పంచవటి కాలనీ సర్వే నెంబర్ 42లోని ప్రభుత్వ భూమిపై కొందరు వ్యక్తులు కన్నువేసి, రాత్రికి రాత్రే చుట్టూ టీన్లతో ప్రహరీ గోడను నిర్మించి ఆక్రమణకు యత్నించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న గండిపేట తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది. ఆక్రమణల నిరోధక బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, ఆక్రమిత స్థలంలో నిర్మించిన టీన్ల ప్రహరీని బుల్డోజర్ల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలను రక్షించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ నిర్మాణాలపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



**ఆమనగల్లు, ఆగస్టు 02(నినాదం):** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యువతి యువకులు రక్తదానం చేయటం వల్ల ఒకరి ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా లు అన్నారు. ఆదివారం కడ్తాల్ పట్టణంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ ఆధ్వర్యంలో తల సేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన ఉప్పల వెంకటేష్ గుప్తా, గంప వెంకటేష్ గుప్తాలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి యువతి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడం వల్ల ఆపద సమయంలో ఏవైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం చాలా అవసరం అవుతుందని అన్నారు. అలాంటివారికి మీరు ఇచ్చే రక్తం ఒకరి ప్రాణాలు కాపాడవచ్చునని గుర్తు చేశారు. అదేవిధంగా తల సేమియా వ్యాధితో బాధపడే వారు వైద్యుల సూచన మేరకు 15 లేదా 20 రోజుల కోసారి రక్తం అవసరం అవుతుందని సరైన సమయానికి రక్తం అందకపోతే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. మీరు ఇచ్చే రక్తం వారి ప్రాణాన్ని నిలబెడుతుందని వారన్నారు. ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం లో స్వచ్ఛందంగా 60 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను నాయక్, రైతు సమన్వయ సమితి సభ్యులు మంగళపల్లి నరసింహ, రావిచెడు ఉపసర్పంచ్ యాదయ్య, రావిచెడు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, అమృతం పాండు, సురేష్, దాసు, ఏ సురేందర్, జి శ్రావణ్ కుమార్, విశ్రాంత్, రషీద్, శశికాంత్, గౌస్, రాకేష్, అబ్బ రమేష్, వెంకటేష్, శ్రీకాంత్, మహేష్, రాకేష్, ఒగ్గు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### యువత మాదకద్రవ్యాలకు

# దూరంగా ఉండాలి

### ప్రిన్సిపాల్ వెంకటేషులు



**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 2 (నినాదం):** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి వెంకటేశులు అన్నారు . ఆదివారం నష ముక్త యువ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాల సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ విద్యార్థులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 100 వారాల పాటు ప్రజల భాగస్వామ్యంతో వికసిద్భారత్ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. నశా యువ కార్యక్రమం కేవలం వ్యక్తుల కోసం మాత్రమే కాదని కుటుంబాలు సమాజం దేశం కోసం చేపడుతున్న ఉద్యమమని అన్నారు భారత్ ను వికసిత్ భారత్ గా మార్చే లక్ష్యంతో ఆరోగ్యవంతమైన యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు . శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆత్మవిశ్వాసంతో యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేస్తేనే మాదకద్రవ్యాల పై విజయం సాధిస్తామని అన్నారు . అనంతరం విద్యార్థిని విద్యార్థులచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు కర్నాటి కిషన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి ప్రోగ్రాం ఆఫీసర్ సింగ్ మధు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ధ్యేయం

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్– సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, ఆగస్టు 02 (నినాదం):** ప్రజలకు ప్రతి ఆపద సమయంలో అండగా నిలుస్తూ, సేవా కార్యక్రమాల ద్వారా విశ్వాసాన్ని చూరగొంటున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్– సి. ఓ. ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ని ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో నెలకొన్న సామాజిక అవసరాలు, తాగునీరు, విద్య, వైద్య సహాయంపై వినతిపత్రాలు అందజేశారు . ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న వివిధ సామాజిక అవసరాలు, పేద కుటుంబాల ఇబ్బందులు, విద్య,వైద్య సహాయం, అత్యవసర ఆర్థిక సహాయం, గ్రామాభివృద్ధికి సంబంధించిన త్రాగునీటి వాటర్ ప్లాంట్ల నిర్మాణాలు, దేవాలయాల అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి తన సహకారంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు,ప్రజల వినతులను స్వీకరించి స్పందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి , సమస్యలను తెలుసుకుని, సాధ్యమైనంత మేరకు తన సొంత నిధులతో పాటు ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహాయం అందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు చేయూత అందించడమే తన బాధ్యత అని , ప్రతి సమస్యకు సాధ్యమైన పరిష్కారం చూపడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆశాడ మాస బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 2 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129– సూరారం డివిజన్ షాపూర్ నగర్ రైతు బజార్ లోని మైసమ్మ దేవాలయంలో ఆషాడ బోనాల వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల సందర్భంగా బి ఆర్ ఎస్ ఎల్ పి విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో విరాజిల్లేలా అమ్మవారు చల్లంగా చూడాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్, రవి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహ ముదిరాజ్, వినోద్, రాముడు గౌడ్, మల్లేష్, గోపి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లికి బోనాల పండుగ



**ఖమ్మం, ఆగస్టు 2(నినాదం ):**
ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాధపాలెం మండలం బూడిదం పాడు గ్రామంలో ముదిరాజుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆషాడ మాసం బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. ఆదివారం పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో, ఆయు ఆరోగ్యాలతో జీవించాలని ఆ పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు. ఇట్టి బోనాల పండగ కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి విజయ్ కుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మాజీరూజూ చైర్మన్ తుమ్మలపల్లి మోహన్ రావు, మాజీ సర్పంచ్ షేక్ మీరా సాహెబ్, ముదిరాజుల కుల పెద్ద పోతనబోయిన బాబు గారు, ముదిరాజుల నాయకులు బరిగల కోటేశ్వరరావు , శీలం వెంకటేశ్వర్లు ,మేకనబోయిన శేఖర్ , పోతనబోయిన కోటయ్య , గుండ్లపల్లి శ్రీను , శ్రావణబోయిన వెంకన్నగారు, గ్రామంలోని గ్రామ పెద్దలు, గ్రామంలోని యూత్ సభ్యులు, గ్రామంలోని అన్నివర్గాల మహిళలు మరియు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది..

## మానవత్వం లేని
## ఏ మతమైనా సంస్కరించబడాల్సిందే
### -పీఆర్టియు తెలంగాణ జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్ సోడి




**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2 (నినాదం) :**
సమాజంలో ఐక్యత, భద్రత, పరస్పర గౌరవం పెంపొందించడమే దేశాభివృద్ధికి, శాంతికి పునాది అని, మానవత్వం, మంచితనం లేని ఏ మతమైనా సంస్కరించబడాల్సిందేనని పి.ఆర్.టి.యు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి అన్నారు. నగరంలోని అర్సపల్లి సమీపంలోని నిజాం ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో "మత సామరస్యం – సోదరభావం – ప్రస్తుత సమాజంలో" అనే అంశంపై ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వమత సమానత్వమే నిజమైన మానవత్వానికి ప్రతీక అని అన్నారు. అన్ని మతాలను గౌరవించడం, పరస్పర ప్రేమ, శాంతి, సయోధ్యతో కలిసి జీవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కుల, మత భేదాలు లేకుండా బాధితులకు ఆహారం, వస్తువులు అందించడం, ఆపదలో ఉన్న పేదలకు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయడం నిజమైన సోదరభావానికి నిదర్శనమని చెప్పారు. వృద్ధులు, చిన్నారుల పట్ల ఆప్యాయత, ఆదరణ చూపడం కూడా మానవత్వంలో భాగమేనని ఆయన అన్నారు. సమాజంలో మంచి, చెడు అనే రెండే మతాలు ఉన్నాయని పేర్కొంటూ, ఐక్యత, భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, సమాన అవకాశాలు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి వ్యక్తి కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ దిశగా ఒక అడుగు ముందుకు వేస్తే స్వేచ్ఛ, శాంతి, సౌభ్రాతృత్వంతో కూడిన నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## గ్రంథాలయంలో మొక్కలు నాటిన నాయకులు



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 2 (నినాదం ):**
బోధన్ గ్రంథాలయంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, పిసిసి డెలిగేట్ గంగా శంకర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకు దామోదర్, మాజీ అధ్యక్షులు పాషా,మునిసిపల్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు తలారి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో చిరుత కలకలం



**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 02 (నినాదం):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. గేదెలు మేస్తున్న సమయంలో చిరుత ఒక్కసారిగా దాడి చేసి ఒక గేదెను గాయపరచడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఘటన అనంతరం చిరుతతో పాటు దాని పిల్ల అడుగుజాడలు కనిపించడంతో పరిసర గ్రామాల్లో అప్రమత్తత నెలకొంది. మండలంలోని ఎర్రచెలక బీట్ పరిధిలో తుమ్మలగూడ సమీపంలోని మూతివాగు వద్ద ఆదివారం గేదెల కాపరి భోజ్యా పశువులను మేపుతున్న సమయంలో చిరుతపులి దాడి చేసింది. గేదెపై దాడి చేసిన వెంటనే కాపరి అక్కడి నుంచి తప్పించుకుని గ్రామానికి చేరుకుని విషయం తెలియజేశాడు. ఘటన స్థలంలో వాగు ఇసుకలో చిరుతతో పాటు దాని పిల్ల పాదముద్రలు స్పష్టంగా కనిపించాయి. బీట్ అధికారి హనుమంతు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పాదముద్రలను పరిశీలించి కొలతలు నమోదు చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.

## నిరుద్యోగులను నిలువునా
## మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
### -ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడికి పరామర్శ



**ఖమ్మం, ఆగస్టు 02(నినాదం ):**
అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి తదితర హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు వేణు ను ఆస్పత్రిలో పరామర్శించిన ఆయన, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువకుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం మాట్లాడుతూ, నిరుద్యోగుల ఆశలను వమ్ము చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, వారి న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

# నగరంలో భక్తి శ్రద్ధలతో ఊర పండుగ

- ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు
- బారులు తీరిన భక్తులు





**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2 (నినాదం) :**
నిజామాబాద్ నగరంలో ఊర పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడి పంటలు పండాలని సుఖ సంతోషాలతో ఉండాలని దుష్ట శక్తులు దరిచేర వద్దని వేడుకుంటూ నగర ప్రజలు గ్రామ దేవతలను పూజించారు . సికింద్రా బాద్ మహంకాళి అమ్మవారి బోనాల జాతర రోజునే పండుగ నిర్వహించడం ఆనవా యితీ. ఊర పండుగలో భాగంగా గ్రామదేవతలను ఉదయం నుంచి ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నగరం భక్తితో పులకరించి ఆధ్యాత్మిక శోభను సంతరించు కుంది. గ్రామ దేవతలకు నీరాజనాలు పలుకుతూ నగరవాసులు భక్తిశ్రద్ధలతో ఊర పండుగను జరుపుకున్నారు. ఊరంతా చల్లగా చూడు తల్లి అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని వేడుకున్నారు. ఊర పండగ నిర్వహణ కమిటీ అయిన సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఖిల్లా రఘునాథ్ ఆలయం శారదాంబా గద్దె వద్ద గ్రామదేవతలను ఉంచి పసుపు కుంకుమ చెవి పోగులు ఆభరణాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. సర్వ సమాజ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ కార్యదర్శి బంటు రాజేశ్వర్ కన్వీనర్ రామర్తి గంగాధర్ కుల సంఘాల పెద్దలు పూజలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత గ్రామదేవతల ఊరేగింపు గాజుల పేట్ చౌరస్తా మీదుగా పెద్ద బజార్ చౌరస్తా వరకు చేరుకుంది .అడుగడుగున భక్తులు తొట్టెల కింది నుంచి వెళ్లాలని బారులు తీరారు. పెద్ద బజార్ చౌరస్తా నుంచి రెండు బృందాలుగా విడిపోయి డప్పులు, పోతరాజుల విన్యాసాలు, మహిళల పూనకాలతో ఒక బృందం పౌడ లమ్మ నల్ల పోచమ్మ ఆడెల్లి పోచమ్మ పెద్దమ్మ పులి రాట్నం ఆసు తొట్లే లతో ఊరేగింపు దుబ్బ వైపు వెళ్ళింది. రెండో బృందం సిర్నాపల్లి గడి గోల్ హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయక నగర్ ఐదు చేతుల పోచమ్మ మత్తడి పోచమ్మ మహాలక్ష్మమ్మ లతో వెళ్ళింది . గాజుల్ పేట్ వివేకానంద చౌరస్తా వద్ద సరి ని పంపిణీ చేశారు. సరి కోసం భక్తులు ఎగబడ్డారు .సరిని నాలుగు గుల్లలు గా విభజించారు. ఒక గుల్ల దుబ్బ వైపు రెండవది వినాయక్ నగర్ మూడవది ఎల్లమ్మ గుట్ట నాలుగవది కంఠేశ్వర్ ప్రాంతాలకు సరి చల్లుకుంటూ వెళ్లారు. నగరం గ్రామీణ వాతావరణం గా మారింది. మహిళలు పూనకాలతో అమ్మవార్ల ప్రతిరూపమైన తొట్టెల కింద నుంచి వెళ్లేందుకు భక్తులు బారులు తీరారు. పలు వీధి చౌరస్తాలో ప్రజలు మేకలు గొర్రెలను కోళ్లను బలి ఇస్తూ కల్లు సాకలు పోస్తూ కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకుంటూ గ్రామ దేవతలను నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. వీధుల మధ్యలో గ్రామ దేవతలకు ప్రజలు నీరాజనం పలికారు. భక్తిభావంతో అమ్మవారికి పసుపు,కుంకుమ, ఒడిబియ్యం ,చీర జాకెట్ పీస్ బోనాలు సమర్పించుకున్నారు. నగరంలోని ఖిల్లా రఘునాథ్ ఆలయం వద్ద వివేకానంద చౌరస్తా గాజులపేట పెద్ద బజార్ చౌరస్తా వినాయక్ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి వీధికి ప్రజలు కొబ్బరికాయలు కొడుతూ కోళ్లు బలి ఇచ్చారు. అడుగడుగునా గ్రామ దేవతలకు పసుపు కుంకుమ పూలు కొబ్బరి కాయలు సమర్పించుకున్నారు. ఊర పండగ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ఉండాలని ఆకాంక్షించారు .

## అనారోగ్యం నుంచి కోలుకుంటున్న
## వనమా విశ్వేశ్వరరావుకు మాజీ ఎంపీ నామ పరామర్శ

**వైరాలోని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మాజీ ఎంపీ**



**వైరా, ఆగస్టు 2 (నినాదం):**
బీఆర్ఎస్ జిల్లా నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు ఆదివారం వైరాలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శిం చారు. ఈ సందర్భంగా వ-నమా విశ్వేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామా నాగేశ్వరరావు, ఆయన త్వరగా పూర్తిగా కోలుకొని, సామాజిక కార్యక్రమాల్లో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులో ఉన్న కొణతాలపల్లి సుబ్బారావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిష త్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాజీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర రావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి,మాదినేని దుర్గాప్రసాద్, వనమా చిన్ని, బాదావత్ బాలాజీ, పెరుమాళ్ల కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యంబాబు, తిరుపతి శ్రీను,నూకల వాసు, నూకల ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, కారేపల్లి రామకృష్ణ, రంగా సింహాద్రి, బాలాజీ, కొమ్మూరి కనకరత్నం, వేముల శివకృష్ణ, గుజ్జర్లపూడి దేవరాజు,ఎస్‌కే ఖాసిం, వెంకటేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, ఖాజా సైదులు, కొణతాలపల్లి సుజిత్, దారా కృష్ణ,కిషోర్, కేసా శ్రీనివాసరావు, నాళ్ల గంగాధర్, కాజా ప్రవీణ్ కుమార్, కో కొడుమూరు రవి, ఏదునూరి శ్రీనివాసరావు, మోరంపుడి ప్రసాద్,వల్లబి శ్రీనివాసరావు, నంబూరి రామారావు, మాదినేని లక్ష్మణ్, కోడుమూరు మోహన్, ఆకుల రాజు ఏలూరు నరసింహారావు, అదూరి ప్రేమ్, నార్వనేని నారాయణ, మాలోజి రాజేష్, కొలగాని దేవరాజు, తెల్లాకుల శ్రీనివాసరావు, ముచ్చింతల కృష్ణ, కొలగాని నాగేశ్వరరావు, పాగి నాగార్జున, యంద్రాతి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ భవన్‌లో ఎమ్మెల్యే
## సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు




**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2 (నినాదం) :**
బోధన్ నియోజకవర్గ ఎమ్మె ల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆదివారం కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ,నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సుదర్శన్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షులు, నగర మేయర్ ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సలహాదారుగా సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సాగు, తాగునీటి రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేశారని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధిలో భాగంగా మెడికల్ కళాశాల ఏర్పాటుకు విశేషంగా పనిచేశారని తెలిపారు. సుదర్శన్ రెడ్డి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరత్, రత్నాకర్ గౌడ్, కోశాధికారి భక్త వత్సల్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, మైనార్టీ నాయకులు జావీద్ అక్రం, రాష్ట్ర నాయకులు రామర్తి గోపి, కార్పొరేటర్లు, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు



**గుండాల, ఆగస్టు 2 (నినాదం):**
యువత స్నేహభావం, సేవా దృక్పథంతో సమాజ అభివృద్ధికి అంకితభావంతో ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. యువత చేపట్టే సేవా, చైతన్య కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని, యువశక్తి సరైన దిశలో పయనిస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని వారు పేర్కొన్నారు. గుండాల మండలంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత హాజరై విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న యువత పరస్పరం స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ సమాజ సేవకు అంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నవచైతన్య యువజన సంఘం ఏర్పడిన నాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించిందన్నారు. రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు విద్యా సహాయం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, మొక్కల నాటకం, పరిశుభ్రత కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు సహాయం, గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యువత మరింత ఐక్యంగా ఉండి ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. గ్రామాభివృద్ధి, సామాజిక చైతన్యం, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సమాజంలో ఎదురవుతున్న సమస్యలను ఐక్యంగా ఎదుర్కొని పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు యువజన సంఘాలు ముందుండాలని కోరారు. నేటి సమాజంలో యువతలో కొంతమంది డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి దురలవాట్లకు యువత పూర్తిగా దూరంగా ఉండి క్రీడలు, విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించాలన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలను సీజ్‌చేసిన
## రెవెన్యూ-పోలీస్ అధికారులు



**ఆర్మూర్ , ఆగస్టు 2 ( నినాదం) :**
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఎర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామంలో భారీగా అక్రమ ఇసుక నిల్వలు ఉన్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు చేసి, తనిఖీలు నిర్వహించారు. ఈ దాడులలో గ్రామంలో సుమారు 45 ట్రాక్టర్లకు పైగా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిలువలను గుర్తించి సీజ్ చేసినట్లు పోలీస్, రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో జీ.పీ.వో.వెంకటేష్, ఎర్గట్ల సబ్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్, తమ సిబ్బందితో కలిసి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున అక్రమ ఇసుక నిల్వలను ఉంచిన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించిన అధికారులు, వెంటనే అట్టి అక్రమ నిల్వలను గుర్తించి, సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం రెవెన్యూ శాఖకు అప్పగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక దందా కొనసాగిస్తే, చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎస్.ఐ. పడాల రాజేశ్వర్ హెచ్చరించారు. అభివృద్ధి పనుల కోసం ఇసుక అవసరమైతే, మన ఇసుక – మన వాహనంలో ప్రభుత్వం అతి చౌకకు అందిస్తున్న ఇసుక డబ్బులను చెల్లించి, దర్జాగా ప్రభుత్వ అనుమతితో ఇసుక తరలించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## జనసేన వైపు రాజకీయ వలసలు

- జనసేన వైపు రాజకీయ వలసలు
- కొత్తగూడెంలో 100 మంది చేరిక
- రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యం : డాక్టర్ గడల శ్రీనివాసరావు



**కొత్తగూడెం, ఆగస్టు 2(నినాదం):**
కొత్తగూడెం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోందని, రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించడమే లక్ష్యమని జనసేన రాష్ట్ర నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మాజీ సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు డాక్టర్ గడల శ్రీనివాసరావు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, కొత్తగూడెం నియోజకవర్గంలో జనసేనకు రోజురోజుకు ప్రజల ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని, యువత, మహిళలు పెద్ద ఎత్తున జనసేన వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు రాము యాదవ్, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మిరియాల రామకృష్ణ, కొత్తగూడెం పట్టణ నాయకులు శ్యామ్, నియోజకవర్గ నాయకులు నరేష్, జనసేన వీర మహిళలు జై శ్రీ, దివ్య, విగ్నేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరం

- ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, ఆగస్టు 02(నినాదం ):**
కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మాజీ మంత్రి శ్రీ పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ బీఆర్టీయూ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ఆటో డ్రైవర్లు నిత్యం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ ధరలు, విడిభాగాల ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, ఫైనాన్స్ ఈఎంఐలు, కుటుంబ పోషణ భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వారికి భరోసా కల్పించాల్సిన సమయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అనేక మందికి ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, ఆటో డ్రైవర్ల కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు శాశ్వత సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా అందించి ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. కార్మిక వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆటో డ్రైవర్లు కీలక పాత్ర పోషించారన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ
### -4 తులాల బంగారం.. 60 తులాల వెండి
### రూ.20 వేల నగదు అపహరణ



**బల్మూర్, ఆగస్టు 2 (నినాదం) :**
బల్మూరు: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మహదేవపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 4 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ. 20 వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. ఇంటికి తిరిగి వచ్చిన వెంకట్‌రెడ్డి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# గాదె సాయికృష్ణ కేసులో వేగం పెంచిన సిట్..

## మరో నిందితుడి కోసం ముమ్మర గాలింపు



**విజయవాడ, ఆగస్టు 2 (నినాదం):** గాదె సాయి కృష్ణ కేసులో సిట్ అధికారులు వేగం పెంచారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు సురేశ్ ఆచూకీ తెలపాలంటూ ఆయా గుర్తులతో ఓ ప్రకటన విడుదల చేశారు. పేరు: గులివిందల సురేశ్ తండ్రి పేరు: ఆదినారాయణ, చిరునా మా: సత్యనారాయణపురం, విజయవాడ, వయస్సు: 40 సంవత్సరాలు, ఎత్తు: సుమారు 5 అడుగులు 8 అంగుళాలు అని ఈ ప్రకటనలో తెలిపారు. సాయికృష్ణ కేసు నమోదైనప్పటి నుంచి నిందితుడు ఉద్దేశపూర్వకంగా పరారీలో ఉంటూ పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకుంటున్నారని సిట్ అధికారులు తెలిపారు. అతడిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను మోహరించి విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిందితుడి ప్రస్తుత ఆచూకీ, సంచార ప్రాంతాలు లేదా అతడు తలదాచుకున్న ప్రదేశానికి సంబంధించి ఏదైనా విశ్వాసనీయ సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలపాలని విజ్ఞప్తి చేశారు. చిన్న సమాచారం కూడా నిందితుడిని అరెస్టు చేయడంలో కీలకంగా మారవచ్చని అభిప్రాయపడ్డారు. పరారీలో ఉన్న నిందితుడికి తెలిసి ఆశ్రయం కల్పించడం, దాచిపెట్టడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అలాంటి వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసుల అత్యవసర సేవల నంబర్లు 100/112కు వెంటనే తెలపాలని సూచించారు. అతని సమాచారం అందించే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని సిట్ అధికారులు పేర్కొన్నారు.

# ఏపీ – ఆస్ట్రేలియా మధ్య కుదిరిన నాలుగు ఎంవోయూలు

**అమరావతి,ఆగస్టు 2 (నినాదం):** ఆంధ్రప్రదేశ్ – ఆస్ట్రేలియాల మధ్య నాలుగు ఎంవోయూలు కుదిరాయి. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ (Minister Nara Lokesh), ఆస్ట్రేలి యా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంవోయూలను కుదుర్చుకున్నా రు. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీ – ఆస్ట్రేలియా మధ్య ఈ ఒప్పందాలు జరిగినట్లు లోకేశ్ తెలిపారు. తిరుపతిలో సోలార్ తయారీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నా రు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌కి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గత సంవత్సరం తన ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా జరిగిన ఫలవంతమైన చర్చల ఫలితంగా, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల



సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశామని వెల్లడించారు. ఈ ఎంవోయూల ద్వారా తమ ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. ఈ అవగాహన ఒప్పంద ఆవిష్కరణ, ప్రతిభ, ఉమ్మడి శ్రేయస్సుపై నిర్మించిన బలమైన ఆంధ్రప్రదేశ్ – ఆస్ట్రేలియా భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

**BRANCH SHIFTING**

మా విలువైన కస్టమర్ల కోసం, మా
**DHARMAJIGUDEM**
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి **02.11.2026** నుండి మార్చబడు తుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

**Muthoot Finance Ltd**
Ground Floor, D No. 5-88, Opp. SBI,
Near Police Station, Dharmajigudem,
Lingapalem, Eluru District,
Andhra Pradesh State, Pin - 534 462.
Phone No : 9567272011, 9188903544.
Email id : mgdha3874@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise

# డ్రగ్స్ రహిత ఏపీ కోసం కృషి చేస్తున్నాం

## మంత్రి నారా లోకేశ్



**అమరావతి, ఆగస్టు 2 (నినాదం):** మత్తు రహిత సమాజమే లక్ష్యంగా నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనపై దేశవ్యాప్తంగా వంద వారాల కార్యక్రమాన్ని జాతీయ ఉద్యమంగా నిర్వహించాలని ప్రధాని పిలుపు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ జాతీయ ఉద్యమంలో అందరం భాగమవుదామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ఎన్నో చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని ప్రస్తావించారు. ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమాజ భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అలుపెరుగని కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి

## మంత్రి నారాయణ

**నెల్లూరు, ఆగస్టు 2 (నినాదం):** సీఎం నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈరోజు (ఆదివారం)నెల్లూరు జిల్లాలోని జగదీశ్‌నగర్‌లో మహా రుద్రాభిషేకం, చండీ హోమం, లలితా సహస్రనామ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మహా రుద్రాభిషేకం, చండీ హోమం, లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మహాయాగాన్ని వరుసగా 18వ



సంవత్సరం నిర్వహించడం అభినందనీయమని మంత్రి తెలిపారు. 1108 మంది మహిళలు ఏకకాలంలో లలితా సహస్రనామ పారాయణం చేయడం అరుదైన ఆధ్యాత్మిక ఘట్టమని వెల్లడించారు. సంతానం, వ్యాపారాభివృద్ధి, కుటుంబ సౌఖ్యం, లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ యాగం సమాజంలో సానుకూల శక్తిని పెంపొందిస్తుందని వివరించారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం ప్రపంచానికి ఆదర్శమని ఉద్ఘాటించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆధ్యాత్మిక విలువలు, నైతికతను పెంపొందిస్తాయని చెప్పుకొచ్చారు. భక్తి ఉన్న చోట శాంతి ఉంటుందని తెలిపారు. ధర్మం ఉన్న చోట అభివృద్ధి ఉంటుందని వెల్లడించారు. ఈ రెండు కలిసినప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పరమేశ్వరుడిని, అమ్మవారిని ప్రార్థిస్తున్నానని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# జనసేన కార్యకర్తలకు అండగా నిలుస్తాం

## శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్..

**అమరావతి, ఆగస్టు 2 (నినాదం):** జనసేన పార్టీ కార్యకర్తలకు న్యాయపరమైన అండగా నిలిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి, ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. అమరావతిలో జరిగిన జనసేన న్యాయవాదుల సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హరిప్రసాద్ మాట్లాడుతూ.. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా, వ్యక్తిగతంగా దూషించినా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదులు చేయాలని న్యాయవాదులకు సూచించారు. చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో న్యాయవాదుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. వైసీపీ హయాంలో రాజకీయ కక్ష సాధింపుతో జనసేన కార్యకర్తలపై నమోదైన కేసులను వెంటనే పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హరిప్రసాద్ హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా కార్యకర్తలపై నమోదైన కేసుల పూర్తి వివరాలను సేకరించి జనసేన కేంద్ర కార్యాలయానికి పంపించాలని ఈ సందర్భంగా న్యాయవాదు లకు ఆయన సూచించారు. అవసరమైన వారికి న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తల రక్షణ, న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని హరిప్రసాద్ కోరారు.

# దుర్గగుడిలో ఇన్‌స్టా రీల్ కలకలం

## యువతిపై పోలీసులకు ఫిర్యాదు..

**విజయవాడ, ఆగస్టు 2 (నినాదం):** ఇంద్రకీలాద్రిపై ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేసిన యువతిపై ఆలయ అధికారులు సీరియస్ అయ్యారు. దేవస్థానం ఆచారాలు, సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ యువతిపై విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల దుర్గామాత ఆలయంలోని మహామండపం ఏడో అంతస్తు రాజగోపురం వద్ద ఓ అపరిచిత యువతి డ్యాన్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్ రీల్ చిత్రీకరించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తులు, ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, ఈ విషయం ఆలయ అధికారుల దృష్టికి వెళ్లింది. దేవస్థానం ఈవో వి.కె.శీనా నాయక్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇవాళ (ఆదివారం) ఉదయం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. సదరు యువతి జులై 30న మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 1:47 గంటల మధ్య వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రెండు నిమిషాల పాటు ఆమె వీడియో చిత్రీకరించి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేసినట్లు తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలు, ఆలయ పవిత్రతకు ఇది పూర్తిగా విరుద్ధమని దేవస్థానం అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు యువతిని గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను అధికారులు కోరారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తేల్చిచెప్పారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపడతామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

# కృష్ణా, గోదావరి జలాలపై స్పష్టమైన విధానం ఉండాలి

## నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి



**రాజమండ్రి, ఆగస్టు 2 (నినాదం):** గోదావరి, కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురా వాలని ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ(ఆదివారం) రాజమండ్రిలో నిర్వహించిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడుతూ.. కూటమిలో భాగస్వామ్య పార్టీలు వేరైనా, ప్రభుత్వాల బాధ్యత రైతుల ప్రయోజనాలను కాపాడటమేనని ఉద్ఘాటించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించకపోతే విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండదని కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పోలవరం ముంపు పరిధిలోని భూసేకరణ కోసం ఏపీ ప్రభుత్వం తక్షణమే ఆ రాష్ట్రాలతో సంప్రదింపు లు ప్రారంభించాలన్నారు. 'ఒడిశాలో భూసేకరణ కోసం అవసరమైతే 10 నుంచి 15 రెట్లు పరిహారం ఇచ్చినా నష్టం లేదు. ఈ విషయాన్ని నేను స్వయంగా సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లాను' అని వెల్లడించారు. కృష్ణా జలాల విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్న ఆయన.. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమలులోకి వస్తే ఏపీ 277 టీఎంసీలు, తెలంగాణ 97 టీఎంసీల నీటిని నష్టపోతాయని హెచ్చరించారు. ఇది రెండు రాష్ట్రాలకు 'డబుల్ పంచ్' లాంటిదని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రులు కలవడంలో తప్పులేదు, కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం సాధిస్తున్నారనేదే ముఖ్యం' అని అన్నారు. గతంలో తాను కృష్ణా జలాల పరిరక్షణ కోసమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

# పింగళి వెంకయ్యకు నివాళులర్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి, ఆగస్టు 2 (నినాదం):** త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. జాతీయ పతాకాన్ని రూపుదిద్ది, అశేష భారతావనిలో దేశభక్తి ఇనుమడింపజేశారని కొనియాడారు. జాతిపిత ఆత్మీయాభిమానాలను సొంతం చేసుకున్న పింగళి వెంకయ్య చరితార్థుడని కీర్తించారు. దేశభక్తునిగా, జాతీయ పతాక రూపకర్తగా భారతజాతికి చిరస్మరణీయ సేవలు అందించారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు.





**పింగళి వెంకయ్య త్రివర్ణ పతాకాన్ని భారత్‌కు అందించారు: పవన్ కల్యాణ్**

పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (ఞా ణవజూఋఎ జఞీఖఝఖఝఅ ఖఝశ్రీఝఅ) స్మరించుకున్నారు. మన ఐక్యత, స్వేచ్ఛ, జాతీయ గర్వానికి శాశ్వత చిహ్నమైన త్రివర్ణ పతాకాన్ని భారత్‌కు అందించారని కొనియాడారు. ఆ దార్శనికుడికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా, భట్లపెనుమర్రు గ్రామంలో పింగళి వెంకయ్య జన్మించారని పవన్ కల్యాణ్ తెలిపారు. దేశానికి అత్యంత ప్రియమైన చిహ్నాన్ని ఆయన అందించడం ప్రతి తెలుగు వ్యక్తికి అపారమైన గర్వకారణమని చెప్పుకొచ్చారు. పింగళి వెంకయ్య అసాధారణ వారసత్వం మన జాతీయ పతాక గౌరవాన్ని, స్ఫూర్తిని నిలబెట్టడానికి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



# రాంపల్లి సుచిత్ర కాలనీలో బోనాల జాతర సంబరాలు

**కీసర, జూలై 3, (నినాదం) :** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, రాంపల్లి సుచిత్ర కాలనీలో బోనాల పండుగ జాతర ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సుచిత్ర కాలనీలో మహిళలు, చిన్నారులు బోనం ఎత్తుకొని రాంపల్లి మహంకాళి ఆలయాన్ని సందర్శించి తమ బోనాలు సమీర్పించుకున్నారు. అమ్మవారి బోనాల చరిత్ర విశేషత చెప్పాలంటే..తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ, ఆషాఢ మాసంలో గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించే అద్భుతమైన ఆధ్యాత్మిక వేడుక. ఇది అమ్మవారిని కన్నతల్లిలా భావించి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం. ఇందులో బోనం సమర్పణ, పోతురాజుల విన్యాసాలు రంగం కార్యక్రమాలు ప్రధానమైనవి. బోనాల విశిష్టత మరియు ఆచారాలుబోనం నైవేద్యం: కొత్త కుండలో అన్నం, బెల్లం, పాలు కలిపి వండి, వేపాకులు మరియు దీపంతో అలంకరించి మహిళలు తలపై మోసుకెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. గ్రామ దేవతల ఆరాధన: మహాకాళి, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ వంటి దేవతలను పూజించి అంటువ్యాధుల నుండి రక్షణ కోరుకుంటారు. ఈ బోనాల జాతరలో సుచిత్ర కాలనీ అధ్యక్షుడు జి. నరేష్, ప్రధాన కార్యదర్శి ఎ ప్రసాద్ గౌడ్, అలాగే కమిటీ సభ్యులు, సుచిత్ర కాలనీ సంక్షేమ సంఘం నివాసితులందరూ, కాలనీవాసులు పాల్గొన్నారు.



# నిరుపేద వృద్ధుల కండ్లలో వెలుగులు నింపుతున్నకోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి





**మునుగోడు, ఆగస్టు 2 (నినాదం):** మునుగోడు నియోజ కవర్గంలో కంటి విప్లవం కొనసాగుతోంది.. నియోజక వర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధప డొద్దని, ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చేయించి నాణ్యమైన చూపును అందించాలనే ముందు చూపుతో తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు.. దాంట్లో భాగంగానే ఆదివారం) 16 వ, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మునుగోడు లోని క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మునుగోడు నియోజకవర్గ ముఖ్యనాయకులు ఈ 16వ, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంబించారు. ఇప్పటివరకు 15 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 11654 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2490 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి 5272 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు..మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, 2వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన 3వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన 4వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన 5వ, విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చూండురు మండల ప్రజలకు చండూరు మండలం బంగారి గడ్డలో నిర్వహించిన 6వ, విడత వైద్యశిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో ఘట్టుప్పల్ మండల ప్రజలకు నిర్వహించిన 7వ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండలంలో నిర్వహించిన 8 వ, విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన 9వ, విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన 10వ, విడత వైద్య శిబిరంలో 160 మందికి, మునుగోడు లో మునుగోడు, ఘట్టుప్పల్ మండలాల ప్రజలకు నిర్వహించిన 11వ, విడత వైద్య శిబిరంలో 257 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయం ఆవరణలో చూండరు మున్సిపాలిటీ చందూరు మండల ప్రజలకు నిర్వహించిన 12 వ, విడత వైద్య శిబిరంలో 223 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో నాంపల్లి మండల ప్రజలకు నిర్వహించిన 13 వ, వైద్య శిబిరంలో 228 మందికి, మరి గూడ మండల కేంద్రంలో మర్రిగూడ మండల ప్రజలకు నిర్వహించిన 14వ విడత వైద్య శిబిరంలో 127 మందికి, చౌటుప్పల్ లో చౌటుప్పల్ మండల, పట్టణ ప్రజలకు నిర్వహించిన 15 విడత వైద్య శిబిరంలో 1210 మందికి కంటి పరీక్షలు జరిపి 165 మందికి కంటి ఆపరేషన్లను పూర్తి చేశారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నా రు... రాబోయే రోజుల్లో, నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు. దాంట్లో భాగంగానే ఆదివారం 16వ. విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.. ఈ శిబిరంలో 415 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 157 మంది ఆపరేషన్లకు ఎంపిక య్యారు.. ఆపరేషన్లకు ఎంపికైన వారి హైదరాబాద్ నానక్ రాంగూడ లోని శంకరా కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్సకు పంపించారు.. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు..

# దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా డిగ్రీ అందుకున్న డా. యన్నం భరత్ భూషణ్



**చిలుకూరు, ఆగస్టు 2 (నినాదం) :** చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన యువ అధ్యాపకుడు డా:యన్నం భరత్ భూషణ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బేతవోలు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త వాసవి కిరాణం ప్రొప్రైటర్ శ్రీ యన్నం సింహయ్య,శ్రీమతి వరలక్ష్మి దంపతుల కుమారుడు డా: యన్నం భరత్ భూషణ్ నేడు గీతం (గీతం ) విశ్వవిద్యాలయం నిర్వహించిన స్నాతకోత్సవంలో (కన్వకేషన్ ) పీహెచ్.డి లో ఒరిజినల్ డిగ్రీని అందుకున్నారు. కాన్వొకేషన్ ముఖ్య అతిథి ప్రపంచ ప్రఖ్యాత సినీ దర్శకులు శ్రీ ఎస్.ఎస్. రాజమౌళి గారి చేతుల మీదుగా గీతం విశ్వవిద్యాలయ అధ్యక్షులు శ్రీ ఎం. శ్రీభరత్ సమక్షంలో డాక్టరేట్ పట్టా అందుకోవడం జరిగింది. చిన్న గ్రామం నుంచి తన విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించిన డా:భరత్ భూషణ్ ఎన్నో కష్టనష్టాలను అధిగమిస్తూ ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ పట్టా సాధించడం ద్వారా గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలిచారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఎంత కష్టమైన విజయం సాధించవచ్చు అని మరోసారి నిరూపించింది. ఈ సందర్భంగా డా. భరత్ భూషణ్ మాట్లాడుతూ, ఈ విజయం నా తల్లిదండ్రులు, గురువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు నన్ను నమ్మి ప్రతి అడుగులో ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నానని అన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నన్ను ఈ స్థాయికి చేర్చింది వారి ఆశీస్సులు, ప్రోత్సాహమే. భవిష్యత్తులో విద్య, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా సమాజానికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తాను అని తెలిపారు. డా. భరత్ భూషణ్ డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఆకస్మిక వెనకడుగు వెనుక ఉన్న
# వ్యూహాత్మక రహస్యం!?



అడవిలో రాత్రి నిశ్శబ్దం... గాలి కదలిక కూడా ఆగిపోయినట్లు అనిపించే క్షణం. పులి రెండు మూడు అడుగులు వెనక్కి వేస్తుంది. చూసేవారికి అది భయపడి వెనుదిరిగినట్లు కనిపించవచ్చు. కానీ ప్రకృతి పరిశీలనల్లో అది ఓటమి కాదు. గరిష్ట శక్తిని కూడబెట్టుకుని, గాలి దిశను లెక్కించి, ఎర కదలికను అంచనా వేసి, సరైన క్షణం కోసం వేచి ఉండే వ్యూహాత్మక సన్నాహంగా వివరించబడింది. వన్యప్రాణి పరిశోధనల ప్రకారం పులి ప్రతి వేట ప్రయత్నంలో విజయవంతం కావడం తప్పనిసరి కాదు; అందుకే ప్రతి దాడికి ముందు పరిశీలన, ఓపిక, సమయస్ఫూర్తి కీలక పాత్ర పోషిస్తాయి. చరిత్రను పరిశీలించినా అనేక కీలక నిర్ణయాలు హఠాత్తుగా కాకుండా దీర్ఘకాలిక చర్చలు, సమీక్షలు, వ్యూహాత్మక విరామాల అనంతరమే అమలులోకి వచ్చిన ఉదాహరణలు కనిపిస్తాయి. అందువల్ల ప్రతి మౌనాన్ని బలహీనతగా, ప్రతి వెనకడుగును ఓటమిగా అర్థం చేసుకోవడం సముచితం కాదు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ నిధి, అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం, గ్లోబల్ టైగర్ ఫోరం, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ తదితర సంస్థల నివేదికలు, పరిశోధనలు, పరిరక్షణ సాహిత్యం పులి వేటలో ఓపిక, సమయస్ఫూర్తి, శక్తి నిర్వహణ ప్రాముఖ్యతను ప్రస్తావిస్తున్నాయి. ఈ పరిశీలనను ఏ ఒక్క దేశం, ప్రభుత్వం లేదా సంస్థ తీసుకునే నిర్ణయాలకు నేరుగా అన్వయించడం సముచితం కాదు. అయితే ఒక విస్తృత రూపకంగా చూస్తే, బాధ్యతాయుతమైన నిర్ణయాలు సహనం, విశ్లేషణ, సమగ్ర సమాచార సేకరణ, సమయోచిత ఆలోచనలపై ఆధారపడతాయని అర్థమవుతుంది. ప్రజాస్వామ్యంలోనూ, పరిపాలనలోనూ, అంతర్జాతీయ వ్యవహారాల్లోనూ తొందరపాటు తీర్పుల కంటే వాస్తవ నిర్ధారణ, శాస్త్రీయ దృక్పథం, చారిత్రక సందర్భం, బహుముఖ విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ఇలాంటి దృక్పథం ఆధారాలతో కూడిన ప్రజా చర్చలను ప్రోత్సహించి, ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

మారుతున్న వ్యూహాల భాష
21వ శతాబ్దం మూడవ దశాబ్దంలో ప్రపంచ భద్రతా, ఆర్థిక, సాంకేతిక సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. సంప్రదాయ సైనిక ఘర్షణలతో పాటు సైబర్ దాడులు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సమాచార యుద్ధం, ఆర్థిక ఆంక్షలు, సరఫరా గొలుసుల అంతరాయం, ఇంధన భద్రత, వాతావరణ మార్పు వంటి అంశాలు ప్రభుత్వాల విధాన నిర్ణయాలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన ప్రపంచ ప్రమాదాల నివేదికలో భౌగోళిక–ఆర్థిక ఉద్రిక్తతలు, వాతావరణ ప్రమాదాలు, తప్పుడు సమాచార వ్యాప్తి, సాంకేతిక పరిణామాలు వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా ప్రస్తావించబడ్డాయి. అదే సమయంలో ప్రపంచీకరణ నేపథ్యంలో కొన్ని విధాన నిర్ణయాలు లేదా అంతర్జాతీయ పరిణామాలు ఇతర ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సరఫరా, ఆహార భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలు అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల చర్చలు, దౌత్య ప్రయత్నాలు, తాత్కాలిక విధాన మార్పులు లేదా వ్యూహాత్మక విరామాలను ఒకే కోణంలో అర్థం చేసుకోవడం కంటే, వాటి వెనుక ఉన్న భద్రతా, ఆర్థిక, చట్టపరమైన, మానవతా అంశాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం. బాధ్యతాయుతమైన జర్నలిజం లక్ష్యం సంచలనం సృష్టించడం కాదు; వాస్తవాలను, వాటి నేపథ్యాన్ని, సాధ్యమైన ప్రభావాలను సమతుల్యంగా ప్రజలకు అందించడం.

సమాచార యుగంలో నిజమైన శక్తి
డిజిటల్ యుగంలో సమాచారం క్షణాల్లో ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తోంది. అదే సమయంలో అసంపూర్ణ సమాచారం, సందర్భం లేని వ్యాఖ్యలు, నిర్ధారణ లేని ప్రచారం కూడా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తిని సంపాదించాయి. ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన సమాచార సమగ్రత సూత్రాలు సమాచార నాణ్యత, పారదర్శకత, సామాజిక విశ్వాసం, పరిశోధన, బాధ్యతాయుతమైన డిజిటల్ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించిన ప్రధాన సూత్రాలను ప్రతిపాదించాయి. అలాగే యునెస్కో డిజిటల్ వేదికల పాలనా మార్గదర్శకాలు వాస్తవ నిర్ధారణ, పారదర్శకత, మానవ హక్కుల ఆధారిత విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి నిర్ణయాన్ని ప్రశ్నించే హక్కు ఎంత ముఖ్యమో, ఆ నిర్ణయానికి సంబంధించిన పూర్తి నేపథ్యం, చట్టపరమైన కోణాలు, విభిన్న అభిప్రాయాలు, విశ్వసనీయ ఆధారాలను ప్రజలకు అందించడం కూడా అంతే ముఖ్యమైన మీడియా బాధ్యత. భావోద్వేగాలకు బదులుగా వాస్తవాలు, వైరల్ ప్రచారాలకు బదులుగా పరిశోధన, పక్షపాతానికి బదులుగా సమతుల్యతను ఎంచుకోవడం ప్రజల విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో వాస్తవ నిర్ధారణ, బాధ్యతాయుతమైన సమాచార ప్రసారం, సమాచారంపై విమర్శనాత్మక అవగాహన ప్రజా చర్చలను మరింత బలోపేతం చేస్తాయని అనేక అంతర్జాతీయ సంస్థలు సూచిస్తున్నాయి.

నిర్ణయం మనదే
ప్రకృతి శబ్దం చేయదు; కానీ స్పష్టమైన సంకేతాలు ఇస్తుంది. ఆ సంకేతాలను అర్థం చేసుకుని శాస్త్రీయ అవగాహనతో స్పందించిన సమాజాలు దీర్ఘకాలంలో స్థిరత్వాన్ని సాధించిన ఉదాహరణలు చరిత్రలో కనిపిస్తాయి. పులి మనకు నేర్పేది ఘర్షణ కాదు; శక్తిని వివేకంతో వినియోగించడం, సరైన సమయాన్ని గుర్తించడం, పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి అవసరమైనప్పుడు మాత్రమే చర్య తీసుకోవడం. ఈ సూత్రాలు వ్యక్తిగత జీవితం, పరిపాలన, ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ సంబంధాలు, విధాన రూపకల్పన వంటి అనేక రంగాల్లో ఆలోచించదగినవే. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ మానవతా చట్టాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు కూడా సంభాషణ, శాంతి, సహకారం, మానవ భద్రత, స్థిరమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాయి. అందువల్ల ప్రతి వెనకడుగును బలహీనతగా లేదా ప్రతి ముందడుగును విజయానికి హామీగా నిర్ధారించడం సముచితం కాదు. పులి వేసే వ్యూహాత్మక వెనకడుగు భయానికి ప్రతీక కాదు; బాధ్యతతో కూడిన దూరదృష్టికి ఒక రూపకంగా చూడవచ్చు. అదే విధంగా విధానాలు, నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాలను కూడా భావోద్వేగాల కంటే వాస్తవాల వెలుగులో విశ్లేషించడం ప్రజాస్వామ్య సమాజానికి మరింత ప్రయోజనకరం. వేగంగా మారుతున్న ప్రపంచంలో భావోద్వేగాల కంటే వాస్తవాలు, ఊహాగానాల కంటే పరిశోధన, తొందరపాటు తీర్పుల కంటే సమగ్ర విశ్లేషణ ఆధారంగా తీసుకునే బాధ్యతాయుతమైన నిర్ణయాలు దీర్ఘకాలిక స్థిరత్వానికి మరింత అనుకూలంగా ఉండవచ్చని చరిత్ర, శాస్త్రీయ అధ్యయనాలు, అంతర్జాతీయ అనుభవాలు కూడా ఇదే విషయాన్ని సూచిస్తున్నాయి.




**ఉక్కల్కర్ రాజేందర్ నాథ్**
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170


# సంగీత సాధనలో సిద్ధి పొందిన తాపసి పినాక పాణి

## గురువులకే గురువు శ్రీపాద పినాక పాణి

### ఆగస్టు 3...శ్రీపాద పినాక పాణి జయంతి

**కర్ణాటక సంగీతం అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చే పేర్లు అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య తదితరులు. శాస్త్రీయ కర్ణాటక సంగీతం నేటికీ సంప్రదాయ రీతిలో కొన సాగుతున్న దంటే ఇలాంటి కారణ జన్ములైన సంగీతజ్ఞులు తమ సర్వస్వాన్నీ సంగీతానికి ధారపోసిన ఫలితమే. అయితే నిరాడంబరంగా, నిశ్శబ్దంగా, నిర్విరామంగా సంగీతానికి తొంభయ్యేళ్ళకి పైగా కృషి చేసిన ఒక గొప్ప సంగీత విద్వాంసుని సేవల గురించి చాలా మందికి తెలియక పోవచ్చు. శత వత్సర జీవన యానంలో సంగీతమే ప్రపంచంగా జీవించిన సంగీత తపస్వి ఆయన. వృత్తి రీత్యా వైద్యుడేయినా, సంగీతజ్ఞుడినని చెప్పు కోవడానికే ఇష్టపడిన అరుదైన వ్యక్తిత్వం ఆయనకే సొంతం. ఆయన కేవలం గాయకుడే కాదు, కేవలం వైణికుడే కాదు. సంగీత శాస్త్రాన్ని ఆసాంతం అవగాహన చేసుకున్న వాగ్గేయకారుడు కూడా. వందలాది వాగ్గేయకారుల కృతులకు స్వర రచన చేసి ఒక చోట పుస్తకంగా అచ్చు వేయడానికి తన జీవితకాలాన్ని వెచ్చించిన కళా పిపాసి, సిద్ధి పొందిన తాపసి ఆయన.**





నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం, మల్లాది సూరిబాబు, నేతి శ్రీరామశర్మ, ఓలేటి వేంకటేశ్వర్లు, సినీ నేపథ్య గాయని ఎస్. జానకి, ఎందరో లబ్ధ ప్రతిష్ఠులైన గాయకులకు సంగీతం నేర్పి, గురువులకే గురువుని పేరు ప్రఖ్యాతులు గడించిన సంగీత కళా నిధి ఆయన. ఆయనే డాక్టర్ శ్రీపాద పినాక పాణి. ఈ శతాబ్దపు అద్భుత సంగీత విద్వాంసుడు, మధుర గాయకుడు, సంగీత కళానిధి, పద్మ భూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. సంగీత కళాభివృద్ధికి విశిష్ట కృషిచేసి, భావి తరాలకు అందించాలన్న కుతూహలంతో అనేక సంగీత రచనలు చేసి, తన శిష్య, ప్రశిష్యులకు సంగీతంలోని మెళకువలు నేర్పించిన సంగీత శాస్త్ర విశారదుడు. నిరంతర పరిశ్రమతో, సంక్లిష్టమైన, విషయాలను సమన్వయించి నిశితంగా పరిశీలించి, విశ్లేషించి రాగ యుక్తంగా శిష్యులకు నేర్పేవారు.

ఒకవైపు రోగాలను, మరోవైపు రాగాలను సరిచేసిన సవ్యసాచి డాక్టర్ శ్రీపాద పినాక పాణి (ఆగష్టు 3, 1913 – మార్చి 11, 2013) వైద్య, సంగీత రంగాలలో నిష్ణాతులు. శాస్త్రీయ సంగీతం తెలుగు నేలపై అంతంత మాత్రంగా ఆదరణ ఉన్నరోజులు. నాటక పద్యాలలోనో, హరికథలలోనో తప్ప శాస్త్రీయ సంగీతం అంతగా వినబడని ఆ రోజులలో, తమిళ నాట లాగే శాస్త్రీయ సంగీతం తెలుగునాట వర్ధిల్లాలని నిరంతరం తపన పడ్డారు. శాస్త్రీయ సంగీత వైభవాన్ని ఆకాంక్షించారు. ఆ దిశగా ఎందరో సంగీత శిఖామణులను తెలుగు వారికి అందచేశారు.
శ్రీపాద పినాక పాణి శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారంలో 1913, ఆగష్టు 3 వ తేదిన కామేశ్వరరావు, జోగమ్మ దంపతులకు జన్మించారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు గారి వద్ద తొలి సంగీత పాఠాలకు శ్రీకారం చుట్టారు. 1939వ సంవత్సరంలో విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల నుండి ఎం.బి.బి.ఎస్. పట్టా తీసుకున్నారు.1945వ సంవత్సరంలో జనరల్ మెడిసన్ ఎం.డి. పూర్తి చేసారు. తర్వాత రాజమండ్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా ప్రభుత్వ సర్వీసులో చేరారు.1951 నుండి 1954 వరకు విశాఖలో వైద్య కళాశాలలో సివిల్ సర్జన్ గా పనిచేసారు. 1957లో కర్నూలు వైద్య కళాశాలకు బదిలీ అయి, అక్కడే కళాశాల ప్రిన్సిపాల్ గా, సూపరింటెండ్ గా పనిచేసి 1968 లో పదవీ విరమణ చేసారు. కర్నూలులో స్థిర పడ్డారు. సంగీతం వింటూనే నొటోషన్స్ రాయగల నైపుణ్యం ఆయనకు దేవుడిచ్చిన వరం. పదవీ విరమణానంతరం, త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, గీతాలు, స్వరజతులు, స్వరపల్లవులు, తాన పద వర్ణములు, కృతులు, జావళీలు మొదలైన సంగీత రచనలు ఏరి కూర్చి, పుస్తక రచనకు శ్రీ కారం చుట్టారు. సంగీత సౌరభం పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన నాలుగు సంపుటాలలో శ్రీపాద స్వర పరచిన అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజాది వాగ్గేయ కారుల కృతులు 607, ముత్తు స్వామి దీక్షితుల కృతులు 173, పదములు 44, జావళీలు 40, తానవర్ణములు 56, తిల్లనాలు 10, మొత్తం 1088 సంగీత అంశాలు ఉన్నాయి. పాణినీయం, ప్రపత్తి, స్వరరామమ్, అభ్యాసమ్, నా సంగీత యాత్ర పుస్తకాలు ఆయన విరచితాలు.

సంగీతకళా శిఖామణి, సప్తగిరి సంగీత విద్వాన్ మణి, సంగీత కళానిధి, గానకళా సాగర, కళాప్రపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పురస్కారం, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకొన్నారు. ఆయన సంగీతాన్ని కేంద్ర నాటక అకాడమీ రికార్డ్ చేసి ఆర్కైవ్స్ లో పొందు పరచింది. 1977 లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 1978 లో ఆంధ్ర విశ్వ విద్యాలయంచే కళాప్రపూర్ణ బిరుదు, 1984 లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2011 లో సంగీత నాటక అకాడమీ ఠాగూర్ ఫెలో గౌరవాన్ని పొందారు. 2012, ఆగష్టు 3 న తన 99 వ జన్మదినాన తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే "జ్ఞాన విద్యా వారధి" బిరుదు పొందడం జరిగింది.

అనేకమంది వాగ్గేయకారులు రచించిన పాటలకు స్వరాలతో, అనుస్వర, గమక సహితంగా స్వరరచన చేసి పినాకపాణి సంగీత సౌరభంలో పొందు పరిచారు. సంగీత సౌరభం అనే పుస్తకంలో అన్నమయ్య కీర్తనలూ, క్షేత్రయ్య పదాలూ, జావళీలూ, వర్ణాలూ ఇలా దాదాపు రెండు వేలకు పైగా పాటలకు స్వర రచన అందించారు. స్వతహాగా వైద్యులు కావడం వలన రోగానికి కారణం వెతికినట్లే, సంగీతం ఎలా నేర్పాలి, ఎలా నేర్పితే సులభతరం అవుతుంది అనే విషయాలపై లోతుగా అధ్యయనం చేసి గ్రంథస్థం చేశారు. సంగీతాభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# అవయవ దానం పట్ల అపోహలు వద్దు

## (03 ఆగష్టు "భారతీయ అవయవ దాన దినం" సందర్భంగా)

భారత్‌లో ప్రతి రోజు 20 మంది రోగులు అవయవ దాతలు దొరక్క చనిపోవడం జరుగుతోంది. ప్రతి 10 నిమిషాలకు ఒక రోగి అవయవ దాన జాబితాలోకి చేరుతున్నారు. ఒక ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా తన అవయవాలను మరొకరి ప్రాణాలు నిలపడానికి చట్టబద్ధంగా ముందుకు రావడం, దాత అవయవాలను రోగికి ఒక ప్రత్యేక వైద్య విధానం ద్వారా అమర్చడాన్ని "అవయవ దానం" లేదా "ఆర్గాన్ డొనేషన్" అని అంటున్నాం. రోగుల మరణాలకు ఒక పెద్ద కారణంగా అవయవ వైఫల్యం నిలుస్తూ, సరైన సమయంలో అవయవ దాతలు ముందుకు రాకపోవడంతో ప్రాణాలు కూడా పోతున్నాయి. ఒక వ్యక్తి శరీరంలోంచి గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమము లేదా పాంక్రియాస్, ప్రేగులు, చేతులు, ముఖం, కణజాలం, ఎముకల మజ్జ లేదా బోన్ మ్యారో, స్టెమ్ సెల్స్ లాంటి పలు రకాల అవయవాలు తొలగించి, రోగి శరీరంలో అమర్చడంతో ఆ రోగి ప్రాణాపాయం నుంచి బయట పడతాడు.

**అవయవ దానం పట్ల అపోహలు వద్దు :**

ప్రపంచవ్యాప్తంగా అవయవ దాతలకు, అవయవ అవసర రోగులకు మధ్య అంతరాలు అధికంగా ఉన్నాయి. అవయవ దానం పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడం, అపార్థాలు చుట్టు ముట్టడంతో దాతలు ముందుకు రావడం లేదు. ఈ గంభీర సమస్యను గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం అవయవ దానం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి భారత ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ చొరవతో "నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్" వేదికగా ప్రతి ఏట 03 ఆగష్టు రోజున "భారతీయ అవయవ దాన దినం" లేదా "ఇండియన్ ఆర్గాన్ డొనేషన్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. భారతీయ అవయవ దాన దినం వేదికగా అవయవ దానం పట్ల పూర్తి అవగాహన కల్పించడం,



అవయవ దానానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అనబడే అంశాలను తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2021లో 1,44,302 అవయవ దానాలు జరిగాయి. భారత్‌లో 12,259 అవయవ దానాలు జరిగాయని, ప్రపంచ అవయవ దానాల్లో 8 శాతం ఇండియాలోనే జరుగుతున్నట్లు తేలింది.

**తొలి అవయవ దాత, గ్రహీత, మార్పిడి ప్రక్రియ పూర్తి చేసిన వైద్యులు:**

అవయవ దానం రెండు రకాలుగా వర్గీకరించబడింది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి చేసే అవయవ దానంతో పాటు చనిపోయిన వ్యక్తి శరీరం నుంచి సేకరించే అవయవ దానం అనబడు రెండు రకాల అవయవ దానాలు ఉన్నాయి. 1954లో "రోనాల్డ్ లీ హెరిక్" అను వ్యక్తి తొలిసారి తన మూత్రపిండాన్ని దానం చేయడంతో ఆయన సోదరుడి ప్రాణాలు నిలిచాయి. ఈ తొలి అవయవ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసిన వైద్యుడిగా "డా: జోసెఫ్ ముర్రే" అవయవ దాన చరిత్ర పుటల్లో సుస్థిరంగా నిలిచిపోయారు. ఈ విప్లవాత్మక వైద్య ప్రక్రియను సుసాధ్యం చేసిన ముర్రేకా నోబెల్ బహుమతి కూడా వరించడం జరిగింది. ప్రాణాల మీద ఆశ కోల్పోయిన రోగికి అవయవ దానం ద్వారా ప్రాణాలను పోయడమనే దైవ కార్యంగా అవయవ దానాన్ని గుర్తించారు. 18 ఏండ్లు దాటిన ఆరోగ్యవంతులు ఎవరైనా అవయవ దానం చేయవచ్చు. అవయవ దాతల కొరత విపరీతంగా ఉన్నది. కేవలం 10 శాతం రోగులు మాత్రమే సకాలంలో అవయవ మార్పిడితో బాగుపడుతున్నారు. ఒక మిలియన్ జనాల్లో ఒక్కరు మాత్రమే దానానికి ముందుకు రావడం చూస్తున్నాం.
భారతీయ అవయవ దాన దినం వేదికగా అవయవ దాతలను గుర్తించడం, వారి అనుభవాలను ప్రచారం చేయడం, దాతలుగా ముందుకు రావడాన్ని ప్రోత్సహించడం, పౌర సమాజాన్ని జాగృత పర్చడం లాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలి. అవయవ దాతల కొరత లేకుండా జాగ్రత్త పడాలి. అవయవ మార్పిడి అందక ప్రాణాలు కోల్పోవడాన్ని వ్యతిరేకించాలి.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత ప్రియంవద

## ఆగస్టు 3...దాయం ప్రియంవద వర్ధంతి

***హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా. కూడా పిలుస్తారు. నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్థాయి నుంచి గ్రామాల్లోని దొరల వరకూ సాగిన అణచివేత విధానాలకు నిరసనగా తెలంగాణ సాయుధ పోరాటం పురుడు పోసుకుంది. వెట్టి చాకిరి, భావ వ్యక్తీకరణపై తీవ్ర ఆంక్షలు, మాతృ భాషలపై అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు వంటి ఎన్నో పరిణామాలు పోరాటానికి నేపథ్యంగా నిలిచాయి.***

రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం దక్షిణాసియాలో, భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి సాయుధ రైతాంగ తిరుగు బాటుగా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించింది. ఆ విధంగా అది ఎన్నో సాయుధ పోరాటాలకు, ఉద్యమాలకు ఈ పోరాటం స్ఫూర్తి దాయకంగా నిలిచింది. నిజాం నిరంకుశ పాలనకు, దొరల, భూస్వాముల, దేశముఖ్ దోపిడీకి, అణిచివేతకు, హింసకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటమిది. దేశంలోనే తొలిసారిగా భూ సమస్యను బలంగా ముందుకు తెచ్చి భూ సంస్కరణల చట్టానికి నాంది పలికిన పోరాటమిది. తెలంగాణలో ముఖ్యంగా నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో ప్రతిపల్లె, ప్రతి గడప సాయుధ పోరులో మమేకమైనవే. దొడ్డి కొమరయ్య అమరత్వం నుంచి ప్రారంభమైన పోరులో వేలాదిమంది పోరాట యోధులను నిజాం పోలీసులు, రజకార్లు, భూస్వాములు, గుండాలు హత మార్చిన హృదయ విదారక నేపథ్యం.
ఈ పోరాటం మామూలు వ్యక్తి నుండి మేధావుల వరకు ఆడమగ తేడా లేకుండా ఎందరినో కదనరంగం లోకి ఆకర్షించింది. అలాంటి వారిలో దాయం ప్రియంవద ఒకరు.
దాయం ప్రియంవద (1928 – ఆగస్టు 3, 2013) తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన మహిళ. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాయం రాజిరెడ్డి సోదరి. భీమిరెడ్డి నరసింహారెడ్డి, శశిరేఖ, మల్లు స్వరాజ్యం తదితర ఉద్యమ కారులంతా ప్రియంవద సమీప బంధువులు. నల్గొండ జిల్లా, తుంగతుర్తి మండలం వెంపటి సమీపంలోని తూర్పుగూడెంలో 1928లో లక్ష్మమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. ప్రియంవదది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. రష్యన్ సాహిత్యం, గోర్కి నవలలు, రెండో ప్రపంచ యుద్ధం గురించి వెలువడిన పుస్తకాల పట్ల ఆసక్తిని కలిగి చదవడం వల్ల నాటి సమకాలీన పరిస్థితిని ఒంట పట్టించు కున్నారు.
సుశిక్షితురాలైన గెరిల్లా సైనికురాలు ప్రియంవద తెలంగాణ సాయుధ పోరాటంలో కాలూనారు. 1943 సంవత్సరంలో 15ఏళ్ళ వయసు లోనే అన్న రాజిరెడ్డితో కలిసి ఖమ్మం ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దాయం రాజిరెడ్డిలతో కలిసి సూర్యాపేట ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. గెరిల్లా సైనికురాలిగా ఆయుధం పట్టడానికి ముందు ఆమె విజయవాడలో ఆత్మరక్షణ, ఆయుధశిక్షణ పొందారు. సాయుధ పోరాటంలో గాయపడ్డ యోధులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యసేవిక (నర్సింగ్) ట్రైనింగ్ పొందారామె.
పదిహేనేళ్ల ప్రాయంలో ఆమె ఉద్యమం పట్ల ప్రభావిత మైనారు. స్త్రీల సమస్యలపై, రైతు కూలీల సమస్యలపై అన్నతో కలిసి ఉద్యమ బాట పట్టారు. 1952లో జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. మహిళా హక్కుల సాధన, బాల్య వివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టారు. మహిళల కూలీరేట్ల పెంపు కోసం ఆమె రాజీలేని పోరాటం సాగించి, పెద్ద రైతు కుటుంబ నేపథ్యం కలిగిఉన్న అర్ధశేరు వడ్లు మాత్రమే ఉండే రోజు కూలీని, రెండుశేర్ల వడ్లు కూలీగా ఇప్పించారు.



ఆంధ్రమహాసభలు వరంగల్, ఖమ్మంలో జరిగిన తర్వాత అన్న రాజిరెడ్డిను భువనగిరి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్‌గా నియమించారు. ఇబ్బందుల్లో ఉన్న రాజిరెడ్డికి తోడుగా కొలనుపాక జైన మందిరంలో నడిపే స్కూలులో యాభై రూపాయల జీతంతో టీచర్‌గా చేరారు. అక్కడ ఒక సంవత్సరంపాటు పనిచేశారు. ఆసమయంలో వీరి కుటుంబంపై ప్రభుత్వం నిషేధం విధించడంతో 1944లో విజయవాడ వెళ్లారు. అక్కడ జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభకు వలంటీర్‌గా పనిచేశారు. ఆ తర్వాత వివిధ గ్రామాలకు వెళ్లి తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఆడవాళ్లలో చైతన్యం కలిగించారు.

**నల్గొండ జిల్లాలో పలు గ్రామాల్లో**

తిరిగి, పోరాట వ్యూహాల గురించి సమాజంలో స్త్రీలకుండే ఇబ్బందులు, వాటిని ఎదుర్కొనే పద్ధతులను గురించి, ఉత్తేజ ప్రసంగాల ద్వారా వివరించే ప్రయత్నాలు చేశారు. చదువు విషయంలో ఎవరైనా ముందుకొస్తే వాళ్ళకు పాఠాలు చెప్పారు. ఊళ్ళల్ల రజాకార్ల ఒత్తిడి ఎక్కువగా ఉన్న సమయంలో అమ్మను, నాన్నను చూసేందుకు సొంతూరుకు వెళ్ళిన విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి సమయంలో స్టేషనుకు, ఆపై తుంగతుర్తి క్యాంపుకు, తర్వాత సూర్యాపేటకు, చివరకు హైదరాబాద్ తరలించి, చంచల్‌గూడ జైల్లో బంధించారు.

**మూడు నెలల తర్వాత బయటికి**

జైలు నుంచి వచ్చిన ఆమె ఆయుధాలు పట్టి కాల్చడం నేర్చుకున్నారు. దళంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా పరోక్షంగా మాత్రమే సహాయం అందించారు. మరోసారి స్వంత ఇంటిలో అరెస్టయి సికింద్రాబాద్ కంటోన్మెంట్ జైలుకు, ఆనంతరం వరంగల్ జైలుకు పంపబడ్డారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జైళ్ళలోనూ ఆమె జైలు జీవితం గడిచింది. ఎంచుకున్న లక్ష్య సాధన కోసం ఆమె వివాహం చేసుకోక
ఒంటరిగానే బతికారు. ఉద్యమ రోజుల్లో ప్రజలకు అత్యంత దగ్గరగా గడిపిన ఆమె చివరి రోజుల్లో ప్రజా జీవితానికి దూరంగా జీవిస్తూ 2013, ఆగస్టు 3 న తుది శ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ఖబ్రస్తాన్‌లో యూ కాంప్లెక్స్..

# సమంజసమేనా?

- సమాధులపై నిర్మాణాలా..?
- ఇప్పుడున్న షాపుల ఆదాయంతో ఎంతమందికి ఉపాధి
- మరో కాంప్లెక్స్‌తో ప్రయోజనం ఏమిటి ?
- యూ కాంప్లెక్స్ ప్రతిపాదనపై రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకత




**నాగర్ కర్నూల్, ఆగస్టు 02 (నినాదం) :** వక్ఫ్‌కు చెందిన ఖబ్రస్తాన్ (స్మశాన వాటిక) స్థలంలో యూకాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదన నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. పవిత్రమైన సమాధుల స్థలాన్ని వాణిజ్య అవసరాల కోసం వినియోగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న స్థానిక ముస్లిం సమాజంలో వినిపిస్తోంది. ఇప్పటికే పట్టణంలో ఉన్న సుమారు 160 షాపుల ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి ఉపయోగపడుతోందో స్పష్టత లేకపోయినప్పుడు, మరో యూకాంప్లెక్స్ పేరుతో పది దుకాణాలు నిర్మించడం వల్ల యువతకు లేదా సమాజానికి ఎలాంటి శాశ్వత ప్రయోజనం కలుగుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మత విశ్వాసాల ప్రకారం ఖబ్రస్తాన్ పవిత్ర స్థలం అని, అక్కడ సమాధులను తొలగించి నిర్మాణాలు చేపట్టడం మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాధులపై నిర్మాణాలు చేపట్టడం పూర్వీకుల పట్ల అవమానకరమని, ఇటువంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ముస్లిం సమాజం కోరుతుంది. ఈ నేపథ్యంలో ఖబ్రస్తాన్‌లో యూ కాంప్లెక్స్ నిర్మాణ ఆలోచనలను విరమించి, ఆ పవిత్ర స్థలాన్ని యథాతథంగా పరిరక్షించాలని స్థానిక యువకులు మేధావులు ప్రజలు, సామాజికవేత్తలు ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తి చేయనున్నారు.

## వక్ఫ్ ఆస్తి అల్లాహ్ అమానత్ (పవిత్ర బాధ్యత)



ఈ ఆస్తిలో అక్రమాలు చేయడం ఎంతవరకు సమంజసం ఈ ఆస్తుల ను కాపాడాల్సిన బాధ్యత ఉన్నవారు తమ బాధ్యతను విస్మరించి, ఖబ్రస్థాన్ (శ్మశాన వాటిక) స్థలాన్ని ఆక్రమించేందుకు కుట్రలు జరుగుతున్నా యని, స్థలాన్ని కుదించే ప్రయత్నాలు కూడా జరుగు తున్నాయని సమాచారం ఉంది. కాలక్రమేపి శవాలు పెరుగుతాయి గాని భూమి పెరగదు కాబట్టి ఖబ్రస్థాన్ స్థలాన్ని కమర్షియల్ కాంప్లెక్స్ కట్టడం సరైన పద్ధతి కాదు ఈ ఆలోచన విరమించుకోవాలి. నాగర్‌కర్నూల్ ముస్లిం సోదరులారా. మేల్కొనండి. ఈరోజు వక్ఫ్ ఆస్తులు, ఖబర్‌స్తాన్‌ను రక్షించకపోతే, రేపు మనకే ఈ ఖబర్‌స్తాన్‌లో సమాధి స్థలం దొరకడం కష్టమయ్యే పరిస్థితి రావచ్చు. కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండి వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు ముందుకు రావాలి.

-మహమ్మద్ పాషా నాగర్ కర్నూల్

## యు కాంప్లెక్స్ నిర్మాణం చేయడం తగదు




రాబోయే కాలానికి స్మశాన వాటిక (కబ్రిస్తాన్)లో ఖననం చేయడానికి స్థలం దొరకక తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇప్పుడున్న వక్ఫ్ బోర్డు కాంప్లెక్స్ లోని దాదాపు 200 షాపుల ద్వారా వచ్చే నిధుల నుండి ఎంతమంది యువతకు ఉపాధి కల్పించారు వీళ్ళు చెప్పాలి.. కులం అభివృద్ధి కోరుకునే వాళ్లు యువతను ఉపాధి చూపి ప్రోత్సహించే వారైతే వెంటనే ఆటోనగర్ పనులు ప్రారంభించి ఎంతో మంది యువకులు మెకానికులుగా టైర్ పంచర్ మొదలగు వృత్తులు నేర్చుకొని షాపుల అద్దె కట్టలేక ఖాళీగా ఉన్నారు. అలాంటివారికి ఆటోనగర్ నిర్మాణం పూర్తయి తే ఉపాధి కలుగు తుంది. సమాధు లను పెక్కిలించి దా దాపు 10 షాపుల ను నిర్మిస్తే ఆ 10 షాపుల ద్వారా వచ్చే ఆదాయం ఎందుకు సరిపోతుందో యు కాంప్లెక్స్ నిర్మించే ఆలోచన ఉన్నవారు చెప్పాలి చనిపోయిన వారి ఆత్మ శాంతించాలంటే యూ కాంప్లెక్స్ నిర్మాణం అనే ఆలోచనను విరమించుకోవాలి భూముల ధరలు ఆకాశాన్నంటిన ఈ పరిస్థితులలో స్మశాన వాటిక కోసం స్థలం కొనే పరిస్థితి ముస్లిం సమాజానికి లేనందున స్మశాన వాటిక (ఖబ్రాస్థాన్) స్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ముస్లిం పైన ఉంది..

-14వ వార్డు మాజీ కౌన్సిలర్ ఖాజా ఖాన్

# మెరిసే చర్మం, పట్టులాంటి జుట్టు కోసం...

## మనం వేస్ట్‌గా పడేసే బంగాళదుంపల తొక్కలు!

**కొన్నిసార్లు మనం పనికిరావు అనేవే మనకు అనేక ప్రయోజనాలు చేకూరుస్తూ ఉంటాయి. అలాంటిదే వంటగదిలో వ్యర్థంగా భావించి చెత్తబుట్టలో పడేసే బంగాళాదుంప తొక్కల్లో కూడా చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడే కొన్ని విలువైన పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్ జ, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు మన సౌంద్యాన్ని సంరక్షిండానికి సహాయపడతాయి. మరి బంగాళాదుంప తొక్కలను అందం కోసం ఎలా ఉపయోగిస్తారు? వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఈ స్టోరీలో తెలుసుకుందాం..**



వంట చేసే సమయంలో బంగాళాదుంప తొక్కలను తీసి చెత్తబుట్టలో వేసేస్తుంటాం. అయితే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే.. ఈ తొక్కల్లో కూడా చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడే కొన్ని రకాల పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయని IJCRT అధ్యయనం పేర్కొంది. అందుకే కొందరు సహజ సౌందర్య చిట్కాల్లో బంగాళాదుంప తొక్కలను ఉపయోగిస్తుంటారు. బంగాళదుంప తొక్కల్లో విటమిన్ సీ, ఐరన్, జింక్, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు కాంతిహీనంగా మారిన చర్మానికి సహజ కాంతిని ఇవ్వడానికి సహాయపడతాయి. డార్క్ సర్కిల్స్, టానింగ్, కళ్ల కింద ఉబ్బును తగ్గించడానికి తోడ్పడతాయి. జుట్టు విషయానికొస్తే మెరుపును జోడించడానికి తోడ్పడుతుంది. మన సౌందర్య సంరక్షణకు మనం చెత్తగా భావించే బంగాళదుంప తొక్క ఎలా సహాయపడుతుందో వివరంగా తెలుసుకుందాం..

**చర్మానికి సహజకాంతిని అందిస్తుంది**

బంగాళాదుంప తొక్కల్లో విటమిన్ జ, యాంటీఆక్సిడెంట్లు, కొన్ని వృక్ష సమ్మేళనాలు ఉంటాయి. ఇవి చర్మ కణాలను ఫ్రీ రాడికల్స్ ప్రభావం నుంచి రక్షిస్తాయి. తాజాగా శుభ్రం చేసిన బంగాళాదుంప తొక్కలను ఓ గుప్పెడు తీసుకుని ఒక చెంచా కలబంద గుజ్జును యాడ్ చేయండి. దీనిలో కొంచెం పాలు వేసి మెత్తటి పేస్ట్‌లా చేయండి. ఈ పేస్ట్‌ను దీనిని మీ ముఖానికి రాసుకుని సుమారు 15 - 20 నిమిషాల పాటు అలాగే ఆరనివ్వండి. ఆ తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేయండి. ఇది ట్యాన్‌ను తొలగించి మీ చర్మపు రంగును ప్రకాశవంతం చేయడానికి సహాయపడుతుంది.

**డార్క్‌సర్కిల్స్ తగ్గిస్తుంది**

బంగాళాదుంపలో ఉండే కూలింగ్ ఎఫెక్ట్ వల్ల కళ్ల కింద వచ్చే డార్క్‌సర్కిల్స్‌ను తగ్గిస్తుంది. తాజా బంగాళాదుంప తొక్కలను 15-20 నిమిషాల పాటు మీ కళ్ల కింద నేరుగా ఉంచండి. వాటిలోని పిండిపదార్థం, విటమిన్ సీ వాపును తగ్గించి నల్లటి మచ్చలను తగ్గిస్తుంది. అంతేకాకుండా ఒత్తిడి కారణంగా వచ్చే కంటి కింద ఉబ్బు కూడా తగ్గుతుంది.

**హెయిర్ కేర్‌లో కూడా..**

బంగాళాదుంప తొక్కలను నీటిలో మరిగించి ఆ నీటిని వడకట్టి చల్లార్చండి. ఆ నీటిని షాంపూ తర్వాత చివరిగా తలస్నానం కోసం ఉపయోగించండి. దీనిని తరచుగా వాడితే జుట్టు మృదువుగా మారుతుంది. జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఈ హెయిర్ ప్యాక్‌తో జుట్టు మెరుస్తుంది

మూడు టేబుల్ స్పూన్ల బంగాళా దుంపల తొక్కల రసం, 3 స్పూన్ల కలబంద గుజ్జు, 2 స్పూన్ల తేనె కలిపి బాగా మిక్స్ చేయండి. ఈ పేస్ట్‌ను జుట్టు కుదుళ్లకు పట్టించి గంటపాటు ఆరనివ్వండి. ఆ తర్వాత తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే హెయిర్ ఫాల్ కంట్రోల్ అవుతుంది. జుట్టు సిల్కీగా మారుతుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

బంగాళాదుంప తొక్కలను ఉపయోగించే ముందు వాటిని బాగా కడగాలి. ఎందుకంటే వాటిపై మట్టి లేదా పురుగుమందుల అవశేషాలు ఉండే అవకాశం ఉంది. ముఖానికి లేదా తలకు ఉపయోగించే ముందు చేతి లోపలి భాగంలో చిన్న ప్యాచ్ టెస్ట్ చేయాలి. దురద, మంట, ఎర్రదనం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వాడకుండా ఉండాలి.

# విటమిన్ బి12 లోపం ఉంటే శరీరంలో కనిపించే లక్షణాలు

**నిర్లక్ష్యం చేస్తే నరాల బలహీనత తప్పదు! విటమిన్ బి12 శరీరానికి ఒక ముఖ్యమైన పోషకం. కానీ దీని లోపాన్ని తరచుగా కేవలం అలసట లేదా రక్తహీనతతో మాత్రమే ముడిపెడతారు. వాస్తవానికి ఈ విటమిన్ మెదడు, నరాలు, ఎర్రరక్త కణాల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో విటమిన్ బి12 లోపించినప్పుడు, అది శారీరక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.**




మన శరీరం ఫిట్‌గా ఉండాలంటే ఎన్నో పోషకాలు అవసరం. ఏ పోషకం తగ్గినా శరీరం అనేక బాధలు పడుతుంది. ఈ రోజుల్లో చాలా మంది విటమిన్ల లోపంతో బాధపడుతున్నారు. అలాంటి వాటిలో విటమిన్ బి12 లోపం ఒకటి. చాలామంది తరచుగా అలసటగా అనిపించినా, మతిమరుపు వచ్చినా లేదా పనిపై దృష్టి పెట్టలేకపోయినా దానికి కారణం 'స్ట్రెస్' (ఒత్తిడి) మాత్రమేనని అనుకుంటారు. కానీ, ఇవి విటమిన్ దీ12 (ఎఖుఎఆఅ దీ12) లోపం వల్ల కూడా కావచ్చు. విటమిన్ బి12 అనేది మన మెదడు, నరాలు, రక్త కణాల్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించే అత్యంత ముఖ్యమైన పోషకం. ఈ విటమిన్ లోపిస్తే జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత లోపించడం, మూడ్ మారడం, మెదడు పనితీరు మందగించడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా, నరాల రక్షణకు ఈ విటమిన్ చాలా అవసరం. కాబట్టి, ఇది తగ్గినప్పుడు చేతులు, కాళ్లలో తిమ్మిర్లు లేదా సూదులతో గుచ్చినట్లు అనిపిస్తుంది.

విటమిన్ బి12 లోపం లక్షణాలేంటి, ఎవరికి ప్రమాదం ఎక్కువ వంటి పూర్తి వివరాల్ని డాక్టర్ పూజా పిళ్ళై (కన్సల్టెంట్ - ఇంటర్నల్ మెడిసిన్, ఆస్టర్ సిఎంఐ హాస్పిటల్, బెంగళూరు) అందించారు.

విటమిన్ బి12 లోపం ప్రధాన లక్షణాలు

విటమిన్ బి12 లోపం ప్రధాన లక్షణాలు

విపరీతమై న అలసట, నీరసం తలతిరగడం, తలనొప్పిశరీరం సమతుల్యత (బ్యాలెన్స్) కోల్పోవడంతీవ్రమైన మతిమరుపు, ఏకాగ్రత లేకపోవడంసకాలంలో చికిత్స తీసుకోకపోతే తీవ్రమైన నరాల బలహీనత, మానసిక ఆందోళన, అయోమయం వంటి సమస్యలకు దారితీస్తుంది. వయోవృద్ధులు, శాకాహారులు, జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారు విటమిన్ దీ12 లోపానికి గురయ్యే అవకాశం ఎక్కువ. అలాగే, అసిడిటీ తగ్గడానికి దీర్ఘకాలంగా మందులు వాడేవారు, మధుమేహం (షుగర్) కోసం 'మెట్‌ఫార్మిన్' వాడేవారిలో కూడా దీ12 స్థాయిలు తగ్గే ప్రమాదం ఉంది.

నినాదం **మార్కెట్**

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

# చేసేవారికి గుడ్‌న్యూస్




బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే, బ్యాంకులను బట్టి, బ్యాంచీల వారీగా కస్టమర్లకు వడ్డీ రేట్లను వేరు వేరుగా ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఇస్తుంటారు. అయితే ఇకపై అలాంటి ఆందోళన అవసరం లేదు. అందరికీ ఒకే విధమైన వడ్డీ రేట్లు అమలులోకి రానున్నాయి. వడ్డీ రేట్లలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలులోకి రానున్నాయి. ఎలాంటి రిస్క్ లేకుండా స్థిరమైన రాబడి కావాలంటే ముందుగా గుర్తుకు వచ్చేంది బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు. అయితే, వడ్డీ రేట్ల విషయంలో బ్యాంకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటాయి. ఒక్కో డిపాజిటర్‌కు ఒక్కో విధంగా ఇస్తుంటాయి. దీంతో ఎక్కడ డిపాజిట్ చేయాలో తెల్చుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారు. అయితే, ఇకపై అలాంటి సమస్యలకు చెక్ పడనుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై లభించే వడ్డీ రేట్ల ప్రకటన, నిర్ణయంలో మరింత పారదర్శకతను పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను సవరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లపై వడ్డీ రేట్లు సవరణ ఆదేశాలు 2026 జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. అక్టోబర్ 1 నుంచి వచ్చే కొత్త నిబంధనలు వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకుల, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులకు ఈ నూతన మార్గదర్శకాలు వర్తిస్తాయని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఇకపై ఒకే బ్యాంకుకు చెందిన విభిన్న శాఖాల్లో ఒకే మొత్తానికి, ఒకే రోజు ఓపెన్ చేసే డిపాజిట్లకు వేరు వేరు వడ్డీ రేట్లు ఇవ్వడానికి వీలు లేదు. అన్ని బ్రాంచులలోనూ ఒకే రోజు ఆమోదించిన సమాన డిపాజిట్లకు సమాన వడ్డీ రేటు వర్తింపజేయాల్సి ఉంటుంది. బ్యాంకులు తమ డిపాజిట్ వడ్డీ రేట్ల వివరాలను ముందుగానే వెబ్‌సైట్లో ప్రచురించాల్సి ఉంటుంది. పబ్లిష్ చేసిన సంవరించిన షెడ్యూల్ ప్రకారమే కస్టమర్లకు వడ్డీ చెల్లించాలి తప్ప, ఇష్టారాజ్యంగా వ్యత్యాసాలు చూపడానికి వీలు లేదు. ఇక రూ. 3 కోట్లు అంత కంటే ఎక్కువ మొత్తం ఉండే బల్క్ డిపాజిట్లపై వేరు వేరు వడ్డీ రేట్లను అందించడానికి బ్యాంకులకు ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించింది. లిక్విడిటీ కవరేజ్ నిష్పత్తి ఆధారంగా బ్యాంకులు బల్క్ డిపాజిట్ల రేట్లను నిర్దేశించవచ్చు. అయితే, బల్క్ డిపాజిట్ల రేట్లను ప్రతి పనిదినం ఉదయం 10 గంటల కల్లా వెబ్‌సైట్లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 10 నిమిషాలు అదనపు సమయం ఇచ్చారు.

**నిర్ణయంతో వడ్డీ పెరుగుతుందా?**

కొత్త నిబంధనలు అమలులోకి రావడం వల్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ల రేట్లు ఒక్కసారిగా పెరగడం కానీ, తగ్గడం కానీ జరగదు. బ్యాంకులు తమ ద్రవ్య లభ్యత, మార్కెట్ పరిస్థితులను బట్టి వడ్డీ రేట్లను స్వయంగా నిర్ణయించుకునే హక్కును కలిగి ఉంటాయి. ఈ కొత్త చట్టం కేవలం డిపాజిట్ రేట్ల ప్రకటన, ప్రదర్శన పారదర్శకతలో మార్పులను మాత్రమే తీసుకువస్తోంది.



104వ వార్షిక బోనాల మహోత్సవం


# ఘనంగా ప్రారంభం

**అమ్మవారికి స్వాగతం పలికిన ఏనుగు లక్ష్మి ప్రత్యేక ఆకర్షణ**

**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 2 (నినాదం) :** సబ్జిమండిలోని శ్రీ నల్లపోచమ్మ--మహంకాళి ఆలయంలో 104వ వార్షిక బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమ య్యాయి. ఉమ్మడి బోనాల పూజా కమిటీ అధ్యక్షుడు కట్ట లింగం ఆధ్వర్యంలో మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఘటాలను టప్పాచబుత్ర, లోధ్ క్షత్రియనగర్, మల్లెమెట్, నట రాజ్ నగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల మీదు గా వైభవంగా ఊరేగించారు. ఊరేగింపునకు స్థానికులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ఘటం ముందుగా నడిచిన ఏనుగు లక్ష్మి ప్రత్యే క ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఉమ్మడి బోనాల పూజా కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లె రాంకుమార్, సలహాదారులు కట్ట రాజయ్య, సేనాపతి చంద్రశేఖర్, గూడబోయిన శివరత్నం, జలగరి వేణు, కట్ట శివరాజ్, బుర్ర వేణుకుమార్, కట్ట నర్సింగ్రావు, అవుశెట్టి శ్యామ్‌సుందర్, గుడుమని అశోక్‌కుమార్, గాండ్ల నిరంజన్‌బాబు, ప్యాట నందకిషోర్, దొర్తుల శ్రీనివాస్, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్‌లో ఘనంగా ఇంటర్నేషనల్ హ్యాపీ పెట్స్ డే




**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 2 (నినాదం):** జూబ్లీహిల్స్‌లోని జిగ్లీ పెట్ కేర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో జిగ్లీ పెట్ కేర్ ఆధ్వర్యంలో మూడో ఇంటర్నేషనల్ హ్యాపీ పెట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, వెటర్నరీ వైద్యుల సలహాలు, వెల్‌నెస్ కన్సల్టేషన్లు, పెట్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 15 నగరాల్లోని 35 కేంద్రాల్లో జరిగిన ఈ వేడుకల్లో 2,500కు పైగా పెంపుడు జంతువులు, 3,500 మందికి పైగా పెట్ పేరెంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెట్ ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఆవిష్కరించారు. జిగ్లీ పెట్ కేర్ సీఈఓ సౌరభ్ జైన్ మాట్లాడుతూ ముందస్తు ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచడం, నాణ్యమైన వెటర్నరీ సేవలను మరింత విస్తరించడమే సంస్థ లక్ష్యమన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా టికెట్ విక్రయాల ద్వారా సమీకరించిన రూ. 6 లక్షలను జిగ్లీ ఫౌండేషన్‌కు అందజేసి, వీధి జంతువుల సంక్షేమానికి వినియోగించను న్నట్లు తెలిపారు.

## వైద్య నిపుణులకు 'ఈజీ ఫార్మసీ' యాప్ పరిచయం



**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 2 (నినాదం) :** అడ్రోటెక్ సొల్యూషన్స్ రూపొందించిన 'ఈజీ ఫార్మసీ' డిజిటల్ హెల్త్‌కేర్ యాప్‌ను హైదరాబాద్ లోని కంట్రీ క్లబ్‌లో ఎన్ ఐ ఎం ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికో-లీగల్ & ప్రాక్టీస్ ప్రొటెక్షన్ ఫోరం వర్క్‌షాప్‌లో వైద్య నిపుణులకు పరిచయం చేశారు. వాట్సాప్ ద్వారా మందులను ఆర్డర్ చేసి సమీపంలోని విశ్వసనీయ మెడికల్ షాపుల నుంచి వేగంగా పొందేలా ఈ ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించారు. దీంతో రోగులకు సమయానికి అసలైన మం దులు అందడంతో పాటు స్థానిక ఫార్మసీలకు వ్యాపార అవకాశాలు పెరుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అడ్రోటెక్ సొల్యూషన్స్ సీఈఓ చల్లా చిరంజీవి మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో రోగులు మందుల కోసం ఇబ్బందులు పడకుండా ఈ యాప్ ఉపయోగపడుతుందని తెలి పారు. కో-ఫౌండర్ పూరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, భాగస్వామ్య ఫార్మసీలకు ఎలాంటి ప్రారంభ పెట్టుబడి అవసరం లేదని, వైద్యులు, ఫార్మసీలు, ఆసుపత్రుల సూచనలతో ప్లాట్‌ఫారమ్‌ను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ ఐ ఎం ఏ సభ్యులు, వైద్యులు, అడ్రోటెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విశ్వశాంతి యాగానికి రూ.25 వేల విరాళం



**కల్వకుర్తి, ఆగస్టు 2 (నినాదం):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న 91వ శ్రీకృష్ణ కాలచక్ర విశ్వశాంతి మహా యాగం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వెల్దండ మాజీ మండల అధ్యక్షుడు కనుగుల జోగయ్య, యాగ నిర్వాహకులకు 25 వేల రూపాయల విరాళాన్ని నిర్వాహకులకు అందజేసి తన ఆధ్యాత్మిక సేవాభావాన్ని పెంపొందించారు. వారు మాట్లాడుతూ, ప్రపంచ శాంతి, ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఈ మహాయాగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యాగ నిర్వాహకులు కనుగుల జంగయ్య కికృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సేవా దృక్పథాన్ని అభినందించారు. నిర్వాహకులు మురళి, సతీష్, దారమోని గణేష్, సురేష్, భక్తులు యాగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా స్నేహితుల దినోత్సవం

**స్నేహితులుంటేనే ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రాప్తి**



**నాగర్ కర్నూల్, ఆగస్టు 2 (నినాదం):** జై గౌడ జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జై గౌడ మహిళా జిల్లా అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ నేటి కాలంలో స్నేహితులు తక్కువ సంఖ్యలో ఉంటున్నారని అన్నారు. పూర్వకాలంలో కనీసం వంద మంది మిత్రులు ఉండేవారని, నేటి సంఖ్య పదులకు చేరిందని అన్నారు. స్నేహితులతో మెహంది కార్యక్రమాన్ని జరిపారు. ఏ సందర్భాన్నికైనా స్నేహితులుంటేనే కార్యం ముందుకు వెళుతుందని, స్నేహితుల సహకారం తోడ్పాటు ప్రతి ఒకరికి అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్ర మంలో మహిళలు జ్యోతి, నిర్మల, దివ్యా , కవిత, హేమలత, పద్మ, స్రవంతి, జయశ్రీ, సరస్వతి, శోభ, లక్ష్మి, గీత, గౌడ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ అనివార్యం


**డీఎస్పీ అంజయ్య**





**వికారాబాద్, ఆగస్టు 2(నినాదం):** పోలీస్ శాఖలో ఎన్నో సంవత్సరాల పాటు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ ఇర్షద్ అలీ కి ఆదివారం పదవి విరమణ విడుకోలు సమావేశం డి.ఎస్.పి. అంజయ్య ఆధ్వర్యంలో నవాబు పేట పి ఎస్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీ ఎస్పీ తో పాటు సి.ఐ. వెంకట్, ఎస్.ఐ. గిరి ఆధ్వర్యంలో పదవి విరమణ పొందుతున్న ఇర్షద్ అలీ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి. మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ శాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని, వారి కర్తవ్యనిర్వహణ కొత్త తరానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. సి.ఐ, ఎస్.ఐ, సహితం ఆయన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ కు బహుమతిని అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా సర్ కార్యక్రమం

- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి
- శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు





**పటాన్చెరు, ఆగస్టు 02 (నినాదం):** ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా సర్ కార్యక్రమం చేపట్టుతుందని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని జేపీ కాలనీలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (అసెంబ్లీ ప్రవాస్) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు–చేర్పులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరి ఓటు అత్యంత బలమైన ఆయుధమని, దేశ భవిష్యత్తును మరియు సముచిత నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రతి ఓటు కీలకపాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీయువకులు ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో ఏవైనా సవరణలు, తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దుకోవడానికి ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు జేపీ కాలనీలోని ప్రసిద్ధ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆంజనేయ స్వామివారి కృప ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదేవతల ఉత్సవాలకు లక్ష విరాళం

**దేవాలయ కమిటీకి అందజేసిన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



**జిన్నారం / గుమ్మడిదల, ఆగస్టు 02 (నినాదం):** గుమ్మడిదలలో నిర్వహించనున్న ఆషాడ మాస బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గ్రామదేవతల ఉత్సవాల నిర్వహణ కోసం 1,00,000 (లక్ష రూపాయల) విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్ రెడ్డి గారికి విరాళం అందించి, బోనాల ఉత్సవాలు ఘన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సి హెచ్. కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్స్ కత్తుల రమేష్, సరెడ్డిగారిపద్మ, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు పడమటి లక్ష్మారెడ్డి, నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి,వెంకట్ రామ్ రెడ్డి, సత్యనారాయణ, పొన్నాలశ్రీనివాస్ రెడ్డి, సదానంద రెడ్డి నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు, జయపాల్ రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణ మహోత్సవం



**వికారాబాద్, ఆగస్టు 2(నినాదం):** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వైభవలక్ష్మి ఆలయంలో గీతా వాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న భగవద్గీత పారాయణ మహోత్సవం ఆదివారం తొమ్మిదవ రోజుతో ఘనంగా ముగిసింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన ఈ పారాయణ కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిం చాయి. గీతా వాహిని సంస్థ గత తొమ్మిది సంవత్సరాలుగా నిరంతరంగా భగవద్గీత ప్రచారం నిర్వహిస్తూ, భగవద్గీతలోని జీవన విలువలు, ధర్మబోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను సమాజానికి చేరవేస్తూ విశేష సేవలు అందిస్తోంది. ఈ ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ, భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శిని అని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన గీతా సందేశం నేటి సమాజానికీ ఎంతో అవసరమని తెలిపారు. మహేశ్వర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ, మహిళలు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని పేర్కొంటూ, వారి జీవన విధానం, దైవారాధనలో పాటించాల్సిన నియమాలు, పూజా విధానాలు, వివిధ వ్రతాలను శాస్త్రోక్తంగా ఎలా ఆచరించాలి, సనాతన ధర్మ సంప్రదాయాలను ఎలా పరిరక్షించాలి అనే అంశాలను సులభంగా వివరించారు. భక్తి, సేవ, ధర్మం, సత్సంకల్పం, నిత్య పారాయణం ద్వారా కుటుంబాల్లో శాంతి, సౌభాగ్యం, ఆధ్యాత్మిక వికాసం కలుగుతాయని ఆయన తెలిపారు. ఆయన ప్రసంగం భక్తులను విశేషంగా ఆకట్టుకుని ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు, కాలనీవాసులు, వికారాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా గీతా పారాయణం, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గీతావాహిని అధ్యక్షురాలు శ్రీదేవి , ప్రధాన కార్యదర్శి జై శ్రీ కమిటీ సభ్యులు మాధురి విజయలక్ష్మి ఝాన్సీ రాణి, నీరజ, సంజీవరాణి, కరుణ, సునీత, సరిత, లక్ష్మి, సరళ,వరలక్ష్మి, నాగరాణి, సరిత, అనిత, స్వాతి, ఆలయ నిర్వాహకురాలు స్వరూప రమేష్, ఆలయ అర్చకులు విక్రమ్, మాజీ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్, డాక్టర్ దీప భక్తవత్సలం, మాజీ జిల్లా అధ్యక్షులు సదానంద రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ గౌడ్, అమరేందర్ రెడ్డి, నర్సింలు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, ఆగస్టు 02 ( నినాదం):** పటాన్చెరు మండలం భానురు గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ ధనమైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో అమ్మ వారిని దర్శించుకుని..ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పండుగలు... ఐక్యమత్యానికి భక్తికి చిహ్నాలు

- ఈనెల 16న ఘనంగా బోనాల ఉత్సవాలు
- ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు చిన్నం బాల నరసింహ



**జవహర్ నగర్, ఆగస్టు 2(నినాదం):** పండుగలు ఐక్యమత్యానికి, భక్తి భావానికి చిహ్నాలని ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు చిన్నం బాల నరసింహ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని ప్రగతి నగర్ లో ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సమావేశం ఆదివారం నల్ల పోచమ్మ గుడి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిటీ అధ్యక్షులు చిన్నం బాల నరసింహ హాజరై మాట్లాడుతూ మాట్లాడుతూ పండుగలు ఐక్యమత్యానికి చిహ్నాలని సోదర భావానికి భక్తికి ఆనవాళ్ళని తెలిపారు. ప్రగతి నగర్ లో ఈనెల 16వ తేదీన తెలంగాణలో ఘనమైన పండుగగా పేరుగాంచిన బోనాల ఉత్సవాలను 16వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పండుగ తేదీలను ఏకగ్రీవంగా కమిటీ సభ్యులచే నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆనందదాస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కాటా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బి. లక్ష్మీబాయి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి చుక్కా యాదగిరి, కడారి గణేష్, వెంకటేష్, జోజి కుమార్, శివప్రసాద్, వీరభద్రరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నం

- నీలం మధు ముదిరాజ్
- మహేశ్వరంలో ఘనంగా బోనాల పండుగ పాల్గొన్న నీలం



**పటాన్చెరు, ఆగస్టు 02 (నినాదం):** తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉంది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు..ఆదివారం ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా ఆయన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరంలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికి సత్కరించారు, ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆ అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానికులు మహేందర్, ఈశ్వర్, మల్లేష్, హరికృష్ణ, ఎట్టయ్యా, జంగయ్య, యాదయ్య, కుమార్, పరమేశ్, నరేష్, శ్రీను, కావలి జంగయ్య, మహేష్, శివరామకృష్ణ, జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా నారాయణ హైస్కూల్ క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం



**అల్వాల్, ఆగస్టు 2 (నినాదం) :** అల్వాల్ సర్కిల్ నారాయణ హైస్కూల్, వెస్ట్ మారేడ్పల్లిలో శనివారం క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల తరపున వివిధ కార్యక్రమాలకు నాయకత్వం వహించేందుకు ఎన్నికైన విద్యార్థి నాయకులను ఈ కార్యక్రమంలో నియమించారు. నూతనంగా ఎన్నికైన క్యాబినెట్ సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రముఖుల సమక్షంలో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతన క్యాబినెట్ సభ్యులను అభినందించి, క్రమశిక్షణ, అంకితభావం నాయకత్వ లక్షణాలతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులలో నాయకత్వ నైపుణ్యాలు, బృంద సహకారం బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని ప్రధాన ఉపాధ్యాయు లు పేర్కొన్నారు.

# అంబేద్కర్ నగర్ బోనాల ఉత్సవ కమిటీ ఎన్నిక

**ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రాజ్ కుమార్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక**



**జవహర్ నగర్, ఆగస్టు 2 (నినాదం):** ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలని శాంతి సౌభ్రాతృత్వానికి వేదికలని అంబేద్కర్ నగర్ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాజ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ అంబేద్కర్ నగర్లో బోనాల పండుగ ఉత్సవాలకు ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బోనాల పండుగ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షులుగా రాజకుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జవహర్ నగర్ ప్రాంతం చల్లగా ఉండాలని అమ్మవార్ల దయ జవహర్ నగర్ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్టు ఈ ఉత్సవాలను ఈ ఏడు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులందరి ఆమోదంతో నిర్ణయించామని తెలిపారు. ఈ బోనాల ఉత్సవ కమిటీకి ఉపాధ్యక్షులుగా ఎర్ర రాము, పొలాస అశోక్, కర్ణాకర్, సునీల్, స్వామి యాదవ్, నరేందర్, గూడెల్లి సురేష్, వెంకటేష్, పలాస కిరణ్ కుమార్, చేపూరి యాకయ్య, పొలాస సాయికుమార్, జడల బాలకృష్ణ, భాస్కరాచారి, యాకేష్, దుర్గేష్, బూరుగు కృష్ణ యాదవ్, నరేష్ యాదవ్, సోమరాజు బైరపాక, మహేందర్, వేణు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులుగా శాంతి కోటేష్ గౌడ్, మారగాని వెంకటేష్ గౌడ్, బల్లి శ్రీను, ఆర్కే బాబు, శివాజీ, కుతాడి సాయికుమార్, విజయకుమార్, సిద్ధులు యాదవ్, సలహాదారులుగా రాజయ్య, ముక్క నరసింహులు, మంద ఆనంద్, మేడ స్వామి, పెద్దాపురం వెంకట్ నర్సు, కాగితా రాజు, జనార్ధన్ తదితరులు ఎన్నికయ్యారు.


# ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు ప్రారంభం



**వికారాబాద్, ఆగస్టు 2(నినాదం ):** గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సింగితం మన్మోహన్ గౌడ్. ఈ నేపథ్యంలో టేకులపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన సుద్దోడ్కతాండలో ఇచ్చిన హామీ మేరకు ఫార్మేషన్ రోడ్డు పనులను సొంత నిధులతో టేకులపల్లి గ్రామము నుండి సుద్దోడ్కా తాండకు వెళ్లే దారి లో అర కిలోమీటర్ రోడ్డు పనులను ఆదివారం నాయకులు సింగితం మన్మోహన్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి సుద్దోడ్కా తాండా ప్రజలు, రైతులు, విద్యార్థులు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతూ టేకులపల్లి గ్రామానికి ప్రతినిత్యం వస్తుండేవారు. కొన్ని సందర్భాల్లో అనారోగ్యానికి గురైన వ్యక్తి మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయని ,ఈలాంటి సంఘటనలు తమ దృష్టికి రాగా చలించిన ఆయన ఎట్టి పరిస్థితుల్లో తాండ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు రోడ్డు సౌకర్యము కల్పిస్తానని తాండవాసులకు ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. రోడ్డు వేసేందుకు దళిత పట్టదారులకు, ప్రత్యామ్నాయంగా దళిత రైతులకు రాజు, చంద్రయ్య, నాగేష్, దప్పు మల్లేష్ లకు మిగతావారికి భూమి ఇప్పిస్తామని తెలంగాణ రాష్ట్ర శాసనసభా పతి,గడ్డం ప్రసాద్ కుమార్ తో ప్రత్యేకంగా దళిత రైతులతో మాట్లాడించి వారికి ప్రత్యామ్నాయంగా భూమి ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో, మోమిన్ పేట తాహసిల్దార్ మునీరుద్దీన్ తో స్పీకర్ మాట్లాడగా భూమి ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని తాహసిల్దార్ అన్నారు. దీంతో దళిత రైతులు సంతోషించి పట్టా భూమి ని రోడ్డుకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో మన్మోహన్ గౌడ్ ముందుకు వచ్చి తాండావాసుల ప్రజల చిరకాల వాంఛ నెర వేర్చారు. దీని ద్వారా తండావాస ప్రజలు టేకులపల్లి గ్రామానికి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్గం సుగమన మైయింది. తాండ ప్రజలు, విద్యార్థులు మహిళలు పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఓటమిని అంగీకరించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని తూచ తప్పకుండా నెరవేర్చడం పై పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నే వెంకటేశం యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నరేందర్ గౌడ్, పాండు, ఫయాజ్, సద్దాం, ఫిరోజ్, సీనియర్ నాయకులు కొండాపురం మహబూబ్అలి,ఎగ్బాల్ జలీల్ ,ఆర్ శ్రీనివాస్, బి అశోక్, టి ప్రభోప్, బాబు నాయక్, దీప్లా నాయక్, ప్రశాంత్, బబ్లు, రామావత్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పార్టీ నాయకులు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి నుండి బయటకు వెళ్లిన దివ్యాంగుడు అదృశ్యం

**పిఎస్‌లో ఫిర్యాదు చేసిన తండ్రి**



**జవహర్ నగర్, ఆగస్టు 2 ( నినాదం):** ఇంటి నుండి బయటకు వెళ్లిన ఓ దివ్యాంగుడు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్ననాటి నుండి మానసిక వైకల్యంతో బాధపడుతున్న అఖిల్ (24) జవహర్ నగర్ పరిధిలోని అంబేద్కర్ నగర్ వాటర్ ట్యాంకు వద్ద తన తల్లిదండ్రులతో నివసిస్తున్నాడు. కాగా తన నివాసం నుండి గత ఆదివారం ఉదయం 11 గంటలకు బయటికి వెళ్లాడని ఇంతవరకు అతని ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు అఖిల్ గురించి బంధువుల వద్ద వెతికినా స్నేహితుల ఇళ్లలో వెతికినా ఎంతకీ సమాచారం లభించకపోవడంతో అఖిల్ తండ్రి రామాచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దివ్యాంగుడైన అఖిల్ కు సరిగ్గా మాటలు రావని కనీసం తన అడ్రస్ గానీ తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ గాని ఎవరికి చెప్పలేదని ఈ యువకుడి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే సమీపంలోనే పోలీస్ స్టేషన్లకు తెలియజేయాలని లేదా 9866784848 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మనిషి ప్రాణాన్ని కాపాడే అత్యంత విలువైన దానం రక్తదానం

- లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్లు





**ఆమనగల్లు, ఆగస్టు 02(నినాదం):** తలకొండపల్లి మండలం రామకృష్ణపురంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ (డిస్ట్రిక్ట్ 320ఏ ) ఆధ్వర్యంలో జి. అంజి రెడ్డి స్మారకార్థం ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని లింగారావుపల్లి సర్పంచ్ లయన్ కాసు శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, గట్ల కేశవ రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ లయన్ మిట్టపల్లి సునంద అంజయ్య, లయన్ జూలూరి రమేష్ , లయన్ బండెల రామచంద్ర రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తదానం అత్యున్నత మానవ సేవ అని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరమైన వారికి ప్రాణదాతగా నిలవాలని పిలుపునిచ్చారు. దివంగత జి. అంజి రెడ్డి గారు జీవితకాలంలో ఎన్నోసార్లు రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారని, వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు మాట్లాడుతూ, "రక్తదానం -- మహాదానం... ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలకు జీవదానం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పారు. ప్రతి ఆరోగ్యవంతుడు ఏడాదికి కనీసం రెండు సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజ సేవలో భాగస్వామి కావాలని కోరారు. శిబిరంలో యువత, స్వచ్ఛంద రక్తదాతలు విశేషంగా స్పందించి 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి క్యాంప్ చైర్మన్ లయన్ పి. అంజి రెడ్డి నాయకత్వం వహించగా, లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, కోటి రెడ్డి యువత, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్తదానం చేసిన ప్రతి వ్యక్తి ఒక ప్రాణాన్ని మాత్రమే కాదు... ఒక కుటుంబానికి కొత్త ఆశను అందిస్తాడు" అని పి ఆర్ ఓ పాషా తెలిపారు.

# ఓటరు ఫారాలు త్వరగా అందజేయండి

**ఎస్ఐఆర్ గడువు సమీపంలో ఉంది**

**ఓటర్లకు కాంగ్రెస్ నాయకుల పిలుపు**



**అల్వాల్, ఆగస్టు 2 (నినాదం):** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమము గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఎన్యూమినేషన్ ఫారాలు త్వరగా బిఎల్వోలకు అందజేయాలని భూదేవి నగర్ డివిజన్ అధ్యక్షుడు మల్లెల శివ సీనియర్ నాయకుడు నిమ్మ అశోక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక ఓటర్ నమోదు (సర్) ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ ఓ లకు అవగాహన కల్పించిన కాంగ్రెస్ నాయకులు. నిర్ణీత గడువు లోపు అట్టి పనులను సమర్థంగా పూర్తి చేయాలని కోరారు. భూదేవి నగర్ పార్కు వద్ద జరుగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూదేవి నగర్ డివిజన్ అధ్యక్షుడు మల్లెల శివ, సీనియర్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, రాజేందర్, లక్ష్మణరావు, భాస్కర్ ,సుదర్శన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మల్లేష్, జ్యోతి పాల్గొన్నారు.

# ఇందిరానగర్ నల్ల పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఏర్పాటు



**నాచారం, ఆగస్టు 2 ( నినాదం) :** హెచ్ఎంటి నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులు బొల్లం చెంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి పెంటం రమేష్ కుమార్, ట్రెజరర్ బి బాలయ్య, ఉపాధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి, కే అశోక్, ఆర్ శ్రీశైలం, పి సురేందర్ స్వామి, ఆర్ . శ్రీధర్, కే నిఖిల్ సాయి, జాయింట్ సెక్రెటరీలు ఉమామహేశ్వర చారి, శేఖర్ గుప్తా, రమేష్, అంజయ్య, విజయ్ కుమార్, సాయికుమార్, ఇంద్రసేనారెడ్డి, యాదగిరి ఆర్గనైజర్స్ కాళిదాస్, శ్యాం కుమార్, శ్రీను నాయక్, బాల సిద్ధులు, రవికుమార్, రాములు, రవి మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రభాకర్, బాలమల్లు, వెంకటేష్, సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్, రాంప్రసాద్, కృష్ణ, శ్రీనివాస్, ప్రభాకర్, రవి, సుధాకర్, శ్రీనివాస్ జన, శివ, రమేష్, రవి చారి, గోపాల్, మహేష్, ఉప్పలయ్య ఏర్పడిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలసి వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నాచారం బీజేపీ నాయకులు పోతాగాని గోపాల్ గౌడ్, మోర నరసింహారెడ్డి, మంజుల వాణి, జి కృష్ణారెడ్డి, మహేష్ యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మడేలేశ్వరస్వామి ఆలయంలో నూతనబోరు ప్రారంభించిన మేయర్

### భక్తులకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వెల్లడి

**కరీంనగర్, ఆగస్టు 2(నినాదం):** కరీంనగర్ నగరంలోని చింతకుంట మడేలేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేవాలయా నికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడేలా బోరు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, గాజ శివరాం, రాచకొండ కిట్టు, భూక్య తిరుపతి నాయక్, గంగాధర శ్రీనివాస్, రాచకొండ కొమురయ్య, పూసల సంపత్, జుట్ట వేణి రేణు, గుంజేటి



శివకుమార్, రాచకొండ శ్రీనివాస్, రజక సంఘం నాయకులు, కుల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర నిధుల కోసం నిరంతర ప్రయత్నం
- రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
- తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక బోనాలు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్, ఆగస్టు 2(నినాదం):** కరీంనగర్ నగరాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడా నికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ 24వ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల విలువైన సమగ్ర పట్టణ అభివృద్ధి నిధులతో చేపట్టనున్న సిమెంట్ కాంక్రీట్ రహదారి, కాలువ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి బండి సంజయ్ శంకు స్థాపన చేశారు. అనంతరం కిసాన్‌నగర్‌లోని పోచమ్మ ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, మున్నూరుకాపు



సంఘం ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొ న్నారు. భక్తి, శక్తి, జానపద కళలు, కుటుంబ బంధాలు, మహిళా శక్తి ప్రతిబింబించే మహోన్నత పండుగగా బోనాలను అభివర్ణిం చారు. ఆధునిక జీవనశైలిలోనూ తెలంగాణ సంప్రదాయాలను సజీవంగా నిలబెట్టే గొప్ప ఉత్సవం బోనాలని అన్నారు. "బోనం అనేది కేవలం కుండలో వండిన అన్నం కాదు.. అమ్మవారిపై భక్తికి, ప్రేమకు ప్రతీక. పోతురాజు నృత్యం వినోదం మాత్రమే కాదు.. సమాజ రక్షణ, ధైర్యసాహసాలకు చిహ్నం" అని పేర్కొం టూ, బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిం చాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో మేయర్ కోలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్ రావు, ఒంటెల సత్యనారాయణ రెడ్డి, బండారి వేణు తదితరులు పాల్గొన్నారు.

### అంబాల రజనీకాంత్‌ను సన్మానించిన

## కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్



**జమ్మికుంట, ఆగస్టు 2 (నినాదం) :** జమ్మికుంట అగ్రికల్చర్ ప్రైవేట్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీ వంగా ఎన్నికైన మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన సామా జిక కార్యకర్త అంబాల రజనీకాంత్ ను ఘనంగా సన్మానించిన కరీం నగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. శనివారం జరిగిన ఎన్నికల్లో గతంలో అధ్యక్షుడిగా పని చేసిన అంబాల రజనీకాంత్ ను సహచర ఉద్యోగులు మరొకసారి అవకాశం కల్పిస్తూ ఏకగ్రీవంగా ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నిస్వార్థంగా సేవ చేస్తూ సహ ఉద్యోగులకు అండగా నిలబడుతున్న రజనీకాంత్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పరిష్కారం చూపుతూ వారికి అండగా ఉంటూ వారి సంక్షేమమే లక్ష్యంగా తన సేవలను అందిస్తూ ఉద్యోగుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా పింగళి రమేష్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో చురు కుగా పాల్గొంటూ సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఒక మంచి వ్యక్తి అంబాల రజనీకాంత్ అని కొని యాడారు. ఒకవైపు సమాజ సేవ చేస్తూనే మరొకవైపు తను నిర్వహి స్తున్న ఉద్యోగ బాధ్యతలను విస్మరించకుండా అందరికీ అందుబా టులో ఉండే రజనీకాంత్ మరొకసారి అగ్రికల్చర్ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో రజనీకాంత్ మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహచర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక..

### కూళేశ్వరం' కాదన్న బీఆర్ఎస్ నేతలు... ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలు అవగాహనలేమికి నిదర్శనం.. మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ ... ఎత్తిపోతల వ్యవస్థను పరిశీలించిన గులాబీ నేతలు..

**కరీంనగర్, ఆగస్టు2(నినాదం):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న విమర్శలు వారి అవగాహనలేమికి నిదర్శనమని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలను తీర్చిన అద్భుత నిర్మాణమని, అది 'కూళేశ్వరం' కాదని.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన 'కాళేశ్వరం బాట' కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులతో కలిసి కోటిలింగాల సమీపంలోని ఎల్లంపల్లి వెనుకజలాలను పరిశీలిం చారు. అనంతరం మేడారం నంది, రామడుగు గాయత్రి ఎత్తిపోతల కేంద్రాలను సందర్శించి నీటి ఎత్తిపోతల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మంత్రులకు గురుత్వాకర్షణ సూత్రంపైనే అవగాహన లేదని, అయినప్పటికీ ప్రాజెక్టుపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని



మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి గాయత్రి ఎత్తిపోతల కేంద్రం వరకు గురుత్వ ప్రవాహం లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు 140 మీటర్లు, మేడారం నంది ఎత్తిపోతల కేంద్రం వరకు 230 మీటర్లు, రామడుగు గాయత్రి ఎత్తిపోతల కేంద్రం వరకు 331 మీటర్ల ఎత్తు ఉందని తెలిపారు. గాయత్రి కేంద్రంలో 115 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి, అక్కడి నుంచి గురుత్వ ప్రవాహం ద్వారా మిడ్‌మానేరు జలాశయా నికి తరలిస్తారని వివరించారు. తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించిన బీఆర్ఎస్ నేతలు, మోటార్లను నిరంతరం నడిపించి ఉత్తర తెలంగాణ జలాశయాలను పూర్తిస్థాయిలో నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### అమెరికాలో తెలుగు వైభవం...

#### ఆట మహాసభల్లో పాడి ఉదయ్ నందన్ రెడ్డికి ఘన సన్మానం



**జమ్మికుంట, ఆగస్టు 2 (నినాదం) :** ఆట మహాసభల్లో భాగంగా యాప్ టీవీ వ్యవ స్థాపకుడు పాడి ఉదయ్ నందన్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోని మేరీ ల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్ నగరం వేదికగా జరుగుతున్న 19 వ అమెరికా తెలుగు సంఘం ఆట మహాసభలు ఘనంగా నిర్వహించారు. 2026 తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు సేవా కార్యక్రమాలు వ్యాపార విజయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి వేలాది మంది తెలుగు ప్రజలు ఈ మహాసభలకు హాజరై తెలుగు భాష సాహిత్యం కలలు వ్యాపారం సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ మహాసభల్లో భాగంగా తెలంగాణ ముద్దుబిడ్డ వీణవంక గ్రామ నివాసి యాప్ టీవీ సీఈవో వ్యవస్థాపకులు పాడి ఉదయ్ నందన్ రెడ్డిని ఆట నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు ముఖ్యంగా తెలుగు ప్రజల కు తమ మాతృభాషలో 300కు పైగా టెలివిజన్ చానల్స్ ను సినిమాలు వినోద కార్యక్రమాలను ఎక్కడి నుంచైనా వీక్షించే అవకాశం కల్పించాలని లక్ష్యంతో ఉదయ్ నందన్ రెడ్డి 2007 వ సంవత్సరంలో యాప్ టీవీ ని స్థాపించి తెలుగు ప్రసారాలను అందిస్తూ తెలుగు భాష సంస్కృతిని కాపాడుతూ సేవలందిస్తున్నారు. డిజిటల్ వినోద రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ఆట నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించి ఈ సందర్భంగా గౌరవించారు. ఉదయ్ నందన్ రెడ్డిని సన్మానించ డంతో తెలుగు ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉదయ్ నందన్ రెడ్డి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆట నిర్వాహకులు కొనియాడారు.

# బిల్డ్ ఎక్స్‌పో-2026 విజయవంతం

### ఆధునిక నిర్మాణ సాంకేతికత, నాణ్యమైన నిర్మాణ సామగ్రిపై సందర్శకులకు అవగాహన

**కరీంనగర్, ఆగస్టు 2(నినాదం):** కరీంనగర్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 6వ బిల్డ్ ఎక్స్‌పో--2026 విజయవంతంగా ముగిసిం దని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ఏసీసీఈఐ) కరీంనగర్ కేంద్రం ప్రతిని ధులు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు వరంగల్, మంచిర్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి సివిల్ ఇంజనీర్లు, వాస్తుశి ల్పులు, నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆధునిక నిర్మాణ ఉత్పత్తులను పరిశీలించారు. ఏసీసీఈఐ కరీంనగర్ కేంద్రం చైర్మన్ నల్ల లక్ష్మయ్య, కార్యదర్శి సబ్బని శ్రీనివాస్, కోశాధికారి వేణుమా ధవ్, కన్వీనర్ పాత పవన్ కృష్ణ, సమన్వయకర్త జి. వెంకట కిషన్ మాట్లాడుతూ, నిర్మాణ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. పునాది నిర్మాణం నుంచి అంతర్గత అలంకరణ వరకు అవసరమైన ఉక్కు, సిమెంట్, రంగులు, హార్డ్‌వేర్, ప్లైవుడ్, లామినేట్లు, లిఫ్టులు, నీరు చొరబడకుండా





నిరోధించే రసాయనాలు, విద్యుత్, పారిశుద్ధ్య సామగ్రి, యూపీవీసీ కిటికీలు, పీటీ స్లాబ్ సాంకేతికత తదితర ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు నిపుణులు గృహ నిర్మాణంపై ఉచిత సలహాలు అందించారని తెలిపారు. నాణ్యమైన నిర్మాణ సామగ్రి ఎంపిక, ఆధునిక నిర్మాణ విధానాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషించిందన్నారు. ఎక్స్‌పో విజయవంతానికి సహక రించిన సంస్థలు, సందర్శకులు, ప్రాయోజకులు, సభ్యులందరికీ ఏసీసీఈఐ కరీంనగర్ కేంద్రం కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో నిర్మాణ రంగానికి మరింత ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గొల్లపల్లి వెంకట్, అనిల్, ప్రశాంత్, పెద్ది ప్రమోద్, ఫణి, అసోసియేషన్ ప్రతినిధులు, నిర్మాణదారులు పాల్గొన్నారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవం..

### డిప్యూటీ మేయర్ సునీల్‌రావుకు స్నేహబంధం గుర్తుగా బ్యాండ్లు

### భాజపా నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆత్మీయ శుభాకాంక్షలు



**కరీంనగర్, ఆగస్టు 2(నినాదం):** స్నేహితుల దినోత్సవాన్ని పురస్క రించుకుని కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ శిబిర కార్యాలయంలో ఆదివారం వేడుకలు ఉత్సాహంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావుకు డివిజన్ భాజపా నాయకులు, కార్యాలయ సిబ్బంది స్నేహబంధానికి ప్రతీకగా స్నేహబంధ బ్యాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న సునీల్‌రావుతో తమకున్న ఆత్మీయ అనుబంధాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలు, అనిల్, హమీద్, అరుణ్, శ్రీనివాస్, మహేందర్, ధనరాజ్, మహర్షి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కీర్తనకు ఘన సన్మానం

### 24వ వార్డు పద్మశాలి సంఘం అభినందనలు.. సేవాభావంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఆకాంక్ష



**మెట్ పల్లి, ఆగస్టు 2: ( నినాదం):** కష్టపడి చదివి వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి డాక్టర్ (ఎంబీబీఎస్) పట్టా సాధించిన మెట్‌పల్లి పట్టణంలోని 24వ వార్డుకు చెందిన దీకొండ రవి కుమార్తె దీకొండ కీర్తనను ఆదివారం 24వ వార్డు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానికంగా నిర్వహిం చిన కార్యక్రమంలో సంఘం నాయకులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లా డుతూ.. సాధారణ కుటుంబం నుంచి ఉన్నత విద్యను అభ్యసించి వైద్యురాలిగా ఎదగడం యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. కీర్తన సాధించిన విజయం కుటుంబ సభ్యులతో పాటు 24వ వార్డు ప్రజలకు, పద్మశాలి సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. సేవా దృక్పథంతో పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. అలాగే నేటి యువత లక్ష్యసాధన కోసం కృషి చేస్తే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహిం చవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, నిరంతర శ్రమ, పట్టుదలతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. విద్యార్థులు కీర్తనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో 24వ వార్డు పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొద్దుల నారాయణ, గౌరవ అధ్యక్షుడు గంగుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మానల రాజారామ్, ట్రెజరర్ అల్లకట్టు గోపి, సంఘ నాయకులు గుర్రం శ్రీనివాస్, బాస రుద్రయ్య, అల్లకట్టు సత్యనారాయణ, జక్కని చిన్నయ్య, ఎలిగేటి శ్రీనివాస్, గుంటుక రవి, భోగ మోహన్, సురుకుంట్ల శ్రీనివాస్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొని డాక్టర్ దీకొండ కీర్తనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మున్నూరుకాపు సంఘాలు సమాజాభివృద్ధికి వారధులుగా నిలవాలి

### గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం, వనభోజనంలో ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులు

**కరీంనగర్, ఆగస్టు 2(నినాదం):** మున్నూరుకాపు సంఘాలు సమాజ అభివృద్ధికి వారధులుగా నిలుస్తూ విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్ రోడ్డులోని లత గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం, సన్మాన కార్యక్రమం, వనభోజన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ కుల సంఘాలు సామాజిక ఐక్యతకు వేదికలుగా నిలవడంతో పాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. సంఘం చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘాలు యువతను సమాజాభివృద్ధి దిశగా నడిపిస్తూ విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పరస్పర సహకారం, సోదరభావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని, నూతన కమిటీ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంరావు, జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, విద్య, ఉపాధి, యువత సాధికారతకు సంఘాలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రజాప్రతినిధులు, కుల పెద్దల సమక్షంలో ప్రమాణస్వీకారం



చేయగా, వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పురమల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బోనాల నర్సయ్య పటేల్, అధ్యక్షుడు ఉప్పు తిరుపతి పటేల్, ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ పటేల్, కోశాధికారి ఐల రాంమోహన్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీనివాస్ పటేల్, యువజన సంఘం అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్ పటేల్, కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు, వివిధ కాలనీల ప్రతినిధులు, మహిళలు, యువజన సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు

### ఘనంగా నిర్వహించిన ఆర్యవైశ్య మహిళలు



**హుస్నాబాద్,ఆగస్టు2 (నినాదం):** పట్టణ ఆర్యవైశ్య సంఘం, మహిళా విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో హుస్నా బాద్ వైశ్య భవన్‌లో ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు గోరింటాకు చెట్టు వద్దకు వెళ్లి ఆకులు తెంపుకొని రోట్లో నూరి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ సంప్రదాయ పాటలు పాడి సంబరాలు జరుపు కున్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ, ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం అమ్మమ్మల కాలం నుంచి వస్తున్న సాంప్రదాయమని, ఇది మహిళల అందాన్ని పెంచడమే కాకు ండా ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. పెళ్లి కాని యువతులు గోరింటాకు పెట్టుకుంటే మంచి వరు డు లభిస్తాడనే నమ్మకం ఉండగా, కొత్తగా పెళ్లైన మహిళలు పుట్టింటికి వచ్చిన సమయంలో గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారని పేర్కొన్నారు. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మవ్యాధులు తగ్గడంతో పాటు శరీరంలోని వేడిని తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని 16వ వార్డులో కూడా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత, రాష్ట్ర కార్యదర్శి నార్ల విజయలక్ష్మి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, కోశాధికారి బబ్బుల రవీందర్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి యాంసాని భాగ్యలక్ష్మి, కోశాధికారి గోగుల రాధిక, యువజన విభాగం ప్రతినిధి కుంభంపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతి పొందిన సర్వేయర్‌కు సన్మానం

### డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా బాధ్యతలు స్వీకరించిన గంగనర్సయ్యకు అభినందనలు



**మెట్ పల్లి, ఆగస్టు 2: (నినాదం):** మెట్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహించి ఇటీవల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐ)గా పదోన్నతి పొందిన పాలెపు గంగనర్సయ్యకు ఆదివారం మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా మెట్‌పల్లి మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించిన గంగనర్సయ్యకు పదోన్నతి లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, జూలై 31న బైంసా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా గంగనర్సయ్య బాధ్యతలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కసాడి తిరుపతి, వీడీసీ అధ్యక్షుడు గాండ్ల సంపత్, ఉపాధ్యక్షుడు నోముల రవి, అడ్వకేట్ నేరెళ్ల శ్రీధర్, ప్రభుత్వ లైసెన్స్ సర్వేయర్ దాత్రిక రిషిత్, రైతులు, గ్రామ పెద్దలు తుమ్మల శిముడయ్య, దాత్రిక లక్ష్మీనారాయణ, దుద్దుల తిరుపతి, చిలివేరి దిలీప్, తిపిరెడ్డి జీవన్‌రెడ్డి, చౌటుపల్లి మున్నా, దేశవేని సత్యనారాయణ, చుక్క సాగర్, బండ రాజు, ఏలేటి మహిపాల్‌రెడ్డి, సంపంగి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### ఉచితంగా బీపీ షుగర్ టెస్టులు మందుల పంపిణీ

**హుస్నాబాద్ ఆగస్టు 2 (నినాదం):** హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలో బాలవికాస సమత హాస్పిటల్ ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీ సహకారంతో నిర్వ హించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలోని మహిళలు, పురుషులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోగా, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలు సంపత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాలవికాస సమత హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని, ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ సేవాభావంతో పనిచేస్తున్న బాలవికాస సమత హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ సమత మాట్లాడుతూ, శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి తగిన వైద్య సూచనలు, జాగ్రత్తలు వివరించామని తెలిపారు. గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించడం సంతోష కరమని, ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని



పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, బాలవికాస సిబ్బంది జ్యోతి, నిర్మల, వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి 24 గంటలు తాగునీటిని అందిస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 2( నినాదం):** నల్గొండ పట్టణంలోని ప్రతి డివిజన్లో సిసి రోడ్లు, డ్రైన్లతో పాటు, ప్రతి ఇంటికి 24 గంటలు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం అయన నల్గొండ తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 64 మంది లబ్ధిదారులకు 64 లక్షల 7424 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్లో ఇదివరకే సిసి రోడ్లు, మురికి కాలువలు చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా తాగునీటి వాటర్ ప్లాంట్ కు 83 కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేయించడం జరిగిందని, అంతేకాక మరో 300 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి తాగునీటి కోసం పట్టణానికి మంజూరు చేశారని చెప్పారు. నల్గొండ మునిసిపాలిటీ కార్పొరేషన్ అయినందున కేంద్రం నుండి 1000 కోట్ల రూపాయల నిధులు వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. పట్టణంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇస్తున్నామని, అంతేకాక ఇదివరకే 700 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని ,ఇల్లు రానివారు సొంత స్థలాలు ఉంటే ఈ సంవత్సరం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజా ప్రభుత్వం పేదవారిదని, అందువల్ల పేదల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, నల్గొండ పట్టణంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటితో పాటు, అన్ని రకాలుగా మంత్రి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నగర్ లో నిర్మాణంలో ఉన్న పెద్ద డ్రైన్ పనుల పురోగతిని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ -2 కింద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు మంజూరైన పనులను పబ్లిక్ హెల్త్ ఏస్ ఈ వెంకటేశ్వర్లు ద్వారా అడిగి తెలుసుకున్నారు. వెంట జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,ఎంపీడీవో యాకూబ్ నాయక్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ రఫీ ఉద్దీన్, పిఎసిఎస్ అధ్యక్షులు నాగరత్నం ,ఇతర కార్పొరేటర్లు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుండు నరేందర్ గౌడ్‌కు ఘన సన్మానం



- ప్రజల మనలను పొందాలి
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ఆగస్టు 2 (నినాదం):** గుండు నరేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి మండల ప్రజల మండల పొందాలని మిర్యాలగూడ శాసనసభ్యులు భక్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని గౌడ సంఘం భవనంలో మిర్యాలగూడ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలోనూతనంగా కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ మండల అధ్యక్షులుగా ఎన్నికైనగుండు నరేందర్ గౌడ్ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గుండు నరేందర్ గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే దిశగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ సేవలను అందజేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గౌడ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కృషి ఆత్మీయ సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు



**ఆలేరు,ఆగస్టు 2(నినాదం):** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో కృషి ఆత్మీయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు, గ్రామ పెద్దలు, యువకులు ఒకేచోట చేరి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, స్నేహం అనేది జీవితంలో అత్యంత విలువైన బంధమని, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే నిజమైన స్నేహితులను ఎల్లప్పుడూ గౌరవించాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు స్నేహితులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆరుట్ల లక్ష్మిప్రసాద్, గంగుల శ్రీనివాస్,మాధవ రెడ్డి బేధరబోయిన్ వెంకటేష్, తలారి యాదగిరి, చెవ్వ సోములు, ఆరె పాండు, కాశెట్టి శ్రవణ్, వలబోజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆసుపత్రికి పెద్ద రోగం

- రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యం
- ఎంఆర్ఐ స్కాన్ యంత్రం పనిచేయకపోవడం
- ఆస్పత్రి నిర్వహణకు ప్రత్యేక అధికారిని నియమించాలి
- జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి





**భూపాలపల్లి ఆగస్టు 02 ( నినాదం):** పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి కాదు రిఫరల్ సెంటర్ గా మారిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా ప్రధాన ఆసుపత్రిని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని వార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రస్తుతం సమస్యల కేంద్రంగా మారిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో తాగునీటి కొరత,అపరిశుభ్రత, వాష్ రూమ్ లో నీరు లేక బాటిల్స్ లలో మాత్రం పోసి కిటికీల ద్వారా బయటికి విసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి,కనీస సౌకర్యాలు లేవు రోగులకు వచ్చిన జబ్బేమో కానీ ఆసుపత్రి అపరిశుభ్రత వలన ఇంకో జబ్బు వచ్చే అవకాశం ఉందంటూ రోగులు వాపోతున్నారు. ఇటీవల ప్రారంభించిన ఎంఆర్ఐ స్కాన్ యంత్రం పనిచేయకపోవడం అవసరమైన వైద్యులు లేకపోవడం, దారుణం అన్నారు. చిన్న సమస్య వచ్చినా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడం వలన పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇది "జిల్లా ఆసుపత్రా? లేక రిఫరల్ సెంటరా "అని ప్రశ్నించారు. టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండటం కొన్ని మూసి వేయడం ఆక్సిజన్ ప్లాంట్ సమస్యలు నిరుపయోగంగా పడిన ట్రాన్స్ఫార్మర్ వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారాల్లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం పట్ల కూడా ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో జిల్లా ఆసుపత్రి పై నిరంతర సమీక్షలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించమని, ప్రస్తుతం నిర్లక్ష్య ధోరణి కొనసాగుతుందని విమర్శించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వెంటనే స్పందించి జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శిస్తే ఇక్కడి పరిస్థితులు అర్థం అవుతాయని అన్నారు. ఆసుపత్రి నిర్వహణకు ప్రత్యేక అధికారిని నియమించి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా యుద్ధ ప్రాతిపదికన తాగునీరు, పరిశుభ్రత, వైద్యులు,నర్సింగ్ సిబ్బంది, మందులు,పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా 4వ మహాసభను విజయవంతం చేయాలి

- ముత్తిరెడ్డిగూడెంలో కరపత్రాల ఆవిష్కరణ
- మండల అధ్యక్షురాలు మంచాల రాధమ్మ



**మోటకొండూరు:ఆగస్టు 02: (నినాదం):** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఐఎఫ్‌డబ్ల్యూ) యాదాద్రి భువనగిరి జిల్లా నాలుగో మహాసభను విజయవంతం చేయాలని మోటకొండూరు మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో మహిళలకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షురాలు మంచాల రాధమ్మ ఆధ్వర్యంలో ఆగస్టు 5న ఆలేరులోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించనున్న జిల్లా నాలుగో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచాల రాధమ్మ మాట్లాడుతూ, మహిళల హక్కులు,సామాజిక న్యాయం,ఆర్థిక సమానత్వం,భద్రత, స్వేచ్ఛ సాధన కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య నిరంతరం ఉద్యమాలు,పోరాటాలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా,మహిళలపై వివక్ష, దోపిడీ, వరకట్న వేధింపులు,గృహహింస, అత్యాచారాలు,బాల్య వివాహాలు,యాసిడ్ దాడులు,సైబర్ నేరాలు,భ్రూణహత్యలు వంటి ఘటనలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళలకు రాజకీయ,సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం, శాసనసభలు,పార్లమెంటులో మహిళలకు తగిన రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ,అమలులో జాప్యం,చట్టాల అమలులో లోపాల వల్ల మహిళలకు పూర్తి స్థాయి న్యాయం అందడం లేదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మహిళలు చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని,మహిళా సమస్యల పరిష్కారానికి మరింత బలమైన ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 5న ఆలేరులో జరిగే జిల్లా నాలుగో మహాసభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశువుల కలమ్మ, దూసేటి అండాలు,పంతులు లక్ష్మి, ఎరకల మమత, హేమలత,వంగరక్క అండాలు,కొప్పుల లావణ్య,గంగంపోని మంగమ్మ,ఆడెపు లక్ష్మి,పంతుల నరసమ్మ,కందుల లక్ష్మి,పంతుల జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం మొక్కలు నాటిన జననీ స్వచ్ఛంద సేవా సభ్యులు



**ఆలేరు, ఆగస్టు 2(నినాదం):** స్నేహితుల దినోత్సవ సందర్భంగా జననీ స్వచ్ఛంద సేవా సంస్థ ( జె ఎస్ ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఆలేరు పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "మొక్కలు నాటుదాం -- భవిష్యత్ తరాలకు హరిత బాట వేయుదాం" అనే నినాదంతో సంస్థ సభ్యులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. ఈ సందర్భంగా జేఎస్ఎస్ చైర్మన్, వ్యవస్థాపకుడు మైదం భాస్కర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జేఎస్ఎస్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ అధ్యక్షుడు పేరుపు ఆనంద్, కన్వీనర్ కమలాకర్ కుంతావత్, కోశాధికారి ఆలేటి శ్రీకాంత్, మహిళా కన్వీనర్ మైదం భాను, సభ్యులు చింతకింది వెంకటేష్, మైదం రాజేష్, పడాల రాజు, దీపక్ చారి, గుజ్జ ఉదయ్, పేరుపు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# డి-లిమిటేషన్‌తో సంబంధం లేకుండా ఆలేరు రెవెన్యూ డివిజన్ ప్రకటించాలి

- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు అఖిలపక్ష కమిటీ విజ్ఞప్తి



**ఆలేరు, ఆగస్టు 2(నినాదం):** డి-లిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా ఆలేరు రెవెన్యూ డివిజన్‌ను వెంటనే గెజిట్ ద్వారా ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కోరింది. ఈ మేరకు ఆదివారం ఆలేరు ఆర్యవైశ్య భవనంలో అఖిలపక్ష కమిటీ సమావేశం, అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశంపై చర్చించేందుకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అఖిలపక్ష కమిటీ సభ్యులను ఆహ్వానించగా, కమిటీ సభ్యులు ఆహ్వానాన్ని స్వాగతిస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యేతో సమావేశమై రెవెన్యూ డివిజన్ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 11 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై పరిశీలన చేస్తోందని, అయితే డి-లిమిటేషన్ అనంతరం వాటిని అమలు చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రి వద్ద ఉందని కమిటీ సభ్యులకు వివరించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన అఖిలపక్ష కమిటీ సభ్యులు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే పలుమార్లు త్వరలో డివిజన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో, డి-లిమిటేషన్‌తో సంబంధం లేకుండా వెంటనే అధికారిక గెజిట్ విడుదల చేసి హామీని అమలు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే, త్వరలోనే కమిటీ సభ్యులతో కలిసి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆలేరు రెవెన్యూ డివిజన్ అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా, ఇటీవల ఎమ్మెల్యే చేసిన "విచిత్ర పొత్తులు" అనే వ్యాఖ్యలను కమిటీ సభ్యులు ప్రస్తావిస్తూ, తమకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆలేరు ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలు, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా మాత్రమే రెవెన్యూ డివిజన్ సాధనే తమ ఏకైక లక్ష్యమని తెలిపారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ అధికారిక ప్రకటన కోసం ఎమ్మెల్యే వెంటనే చర్యలు తీసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపును వీరేశం, రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, మొరిగాడి రమేష్, రచ్చ రామ్ నరసయ్య, పంతం కృష్ణ, కర్రె అశోక్, ఎలుగల వెంకటేష్, కామిటికారి అశోక్, బేతి కృష్ణహరి, ఎలుగల కుమారస్వామి, మంచన మల్లేశం, గొట్టిపాముల వద్దేమాన్ బాలరాజ్, ఎర్రం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## వరదను వీక్షించండి.. ప్రమాదాన్ని కొని తెచ్చుకోవద్దు

సెల్ఫీల కోసం ప్రాణాలను పణంగా పెట్టొద్దు

అమరచింత ఎస్సై స్వాతి



**అమరచింత, ఆగస్టు 2, (నినాదం):** ప్రియదర్శిని జూరాల ప్రోగ్రాంకు భారీ కొనసాగుతుండడంతో అధికారులు 32 గేట్లు ఎత్తి శ్రీశైలానికి భారీగా నీటిని వదులుతున్నారు. సెలవు నేపథ్యంలో జూరాలకు భారీగా సందర్శకులు. ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు ఒక్కసారి జూరాల ప్రాజెక్టు నిర్మించింది వీక్షించేందుకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లాఎస్పీ సునీత రెడ్డి ఆదేశాలతో అమరచింత ఎస్సై స్వాతి కట్టుదిట్టమైన ప్రత్యేక ఏర్పాటు చేశారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అమరచింత ఎస్సై, స్వాతి జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, నీటి ప్రవాహానికి సమీపంలోకి వెళ్లకుండా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించారు. సందర్శకులు సురక్షిత దూరం నుంచే వరద ప్రవాహాన్ని వీక్షించేలా చర్యలు తీసుకున్నారు. వరదల సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, కేవలం వరదను చూడాలనే ఉద్దేశంతో ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని పోలీసుశాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించి, వరద ప్రవాహాన్ని సమీపం నుంచి చూడాలనే ఉత్సాహంతో ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లడం, సెల్ఫీలు లేదా వీడియోల కోసం నీటి అంచులకు చేరుకోవడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను దాటే ప్రయత్నం చేయకుండా, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిని ఒంటరిగా నీటి ప్రాంతాల వైపు వెళ్లనివ్వవద్దని సూచించారు. సందర్శకులు సురక్షిత ప్రదేశాల నుంచే వరదను వీక్షించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని అమరచింత ఎస్సై స్వాతి తెలిపారు.



# విక్రమ్-1 రాకెట్ ప్రయోగంలో గిరిజన యువకుడి కీలకపాత్ర

- బాణోతు బాలాజీకి హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఘన సన్మానం



**హుజూర్‌నగర్, ఆగస్టు 02 (నినాదం ):** పాలకీడు మండలం కురు గ్రామ పంచాయతీ పరిధిలోని దేవ్లా తండాకు చెందిన గిరిజన యువకుడు బాణోతు బాలాజీ భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చరిత్ర సృష్టించిన విక్రమ్-1 స్పేస్ రాకెట్ ప్రయోగంలో కీలక పాత్ర పోషించి తన ప్రతిభను చాటుకున్నారు. ఈ విశిష్ట విజయాన్ని గుర్తిస్తూ హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు బాలాజీని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. రైతు దంపతులు బాణోతు సేవ, బుజ్జిల కుమారుడైన బాలాజీ పదో తరగతి వరకు హుజూర్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. అనంతరం నాగార్జునసాగర్ గురుకుల వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశారు. తర్వాత దేశంలోని ప్రముఖ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్లో ఉద్యోగం పొందిన బాలాజీ, సంస్థ చేపట్టిన ఏడాది కాలం ప్రాజెక్టులో ఎంపికైన 15 మంది నిపుణుల బృందంలో ఒకరిగా పనిచేశారు. ఈ బృందం రూపొందించిన విక్రమ్-1 స్పేస్ రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో బాలాజీ తన సాంకేతిక నైపుణ్యంతో కీలక పాత్ర పోషించి తన గ్రామానికి, జిల్లాకు, గిరిజన సమాజానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా సీఐ చరమందరాజు మాట్లాడుతూ, దేశ ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చరిత్ర సృష్టించిన రాకెట్ ప్రయోగ బృందంలో మన ప్రాంతానికి చెందిన గిరిజన యువకుడు ఉండటం ఎంతో గర్వకారణమన్నారు. బాణోతు బాలాజీ సాధించిన విజయం గిరిజన యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, కష్టపడి చదివితే ఏ రంగంలోనైనా అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం బాలాజీని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, తన స్వగ్రామానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమం స్థానికంగా ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

## డిఎంఆర్ ఆసుపత్రిని పిహెచ్సిగా మార్చాలని సంతకాల సేకరణ



**అమరచింత, ఆగస్టు 2, (నినాదం):** మురళీధర్ రెడ్డి మెమోరియల్ హాస్పిటల్‌ను ప్రైమరీ హెల్త్ సెంటర్ గా పునరుద్ధరించాలని అలాగే రెగ్యులర్ డాక్టర్లను నియమించాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీ. రాఘవేంద్ర మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేష్ అమరచింతలో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్నటువంటి దేశాయి మురళీధర్ రెడ్డి హాస్పిటల్ ను పి హెచ్సిగా పునరుద్ధరించాలని రెగ్యులర్ డాక్టర్లు నియమించాలని అమరచింత మండల కేంద్రంలో డాక్టర్లు లేక ఆత్మకూర్ కి వనపర్తికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని మంత్రి వాకిటి శ్రీహరి గారు ఆరోగ్యశాఖ మంత్రిని దామోదర రాజనర్సింహ గారిని తీసుకొచ్చి శంకుస్థాపన చేసి హాస్పిటల్ నే మరిచిపోయారని వెంటనే పీహెచ్సీగా మార్చి రెగ్యులర్ డాక్టర్ నియమించి పేద ప్రజలకు వైద్యాన్ని అందించాలని చెప్పి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాఘవేంద్ర మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బి వెంకటేష్ డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హరీష్, షారుక్ ఇస్మాయిల్, వెంకటేష్,మోహన్,పోసి, రసూల్ రాము మౌలాలి అంజి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సత్యానికి, ధర్మానికి ప్రతికగా నిలిచిన మహనీయుడు సత్యహరిశ్చంద్రుడు


సత్యహరిచంద్ర' నాటకం నేటికీ సమాజానికి ఆదర్శం ఎస్సై ప్రవీణ్



**హుజుర్నగర్ (మఠంపల్లి) ఆగస్టు 02 (నినాదం):** సత్యానికి ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు సత్య హరిశ్చంద్రుడు అని మఠంపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. మఠంపల్లి గ్రామంలో జ్యోతి ప్రకాష్ నాట్య కళామండలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉచిత పౌరాణిక సత్య హరిచంద్ర నాటక ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సై ప్రవీణ్, గ్రామ సర్పంచ్ ఏసుమల్ల వీరలక్ష్మి--పాపయ్య జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి నాటకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ, సత్య హరిచంద్రుడు సత్యానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా సత్యాన్ని వీడకుండా జీవించిన హరిచంద్రుని చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నేటి సమాజంలో యువతకు ఇటువంటి పౌరాణిక నాటకాలు మంచి సందేశాన్ని అందిస్తాయని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను భావితరాలకు చేరవేయడంలో ఇలాంటి కళారూపాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. పౌరాణిక నాటకాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ఏసుమల్ల వీరలక్ష్మి--పాపయ్య మాట్లాడుతూ, గ్రామంలో ఉచితంగా పౌరాణిక నాటకాన్ని నిర్వహిస్తున్న జ్యోతి ప్రకాష్ నాట్య కళామండలిసభ్యులను అభినందించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాటకాన్ని వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, రఘునాథపాలెం సర్పంచ్ మాకం కామని నరసింహారావు, ఉపసర్పంచ్ శౌరి, జ్యోతి ప్రకాష్ నాట్య కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రకాశ్ బాబు, సంఘ సభ్యులు భక్తిని ధర్మయ్య, భద్రం రాజు, రామారావు, జాల కిరణ్, కంటూ గోపి, కళాకారులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంలో వైభవంగా జరిగింది.

## పుణ్యస్నానం ఆచరించబోయి పరలోకాలకు..

కాళేశ్వరం గోదావరిలో విషాద సంఘటన



**మహదేవపూర్ ఆగస్టు 2 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం గోదావరి నదిలో ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి వ్యక్తి మరణించిన విషాద సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే హనుమకొండ జిల్లా ప్రశాంత్ నగర్ కు చెందిన బొబ్బల శ్రీనివాసరెడ్డి తన భార్య సుధ తో కలిసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనానికి రాగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో నదిలో ప్రమాదవశాత్తు మునిగిపోగా అతని అరుపులకు స్థానికులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికి అప్పటికే అతను మృతి చెంది పరలోకాలకు వెళ్లిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

### అదనపు కలెక్టర్ చంద్రయ్య హెచ్చరిక

**చెన్నూర్, ఆగస్టు 2 (నినాదం):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరుతో లబ్ధిదారుల నుండి ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ చంద్రయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన చెన్నూర్ పట్టణంలోని 1,8 వార్డుల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల బిల్లులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అధికారులు లేదా మధ్యవర్తులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతోనే ఈ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని స్పష్టం చేశారు. కొందరు ప్రిసైడింగ్ అధికారుల పేరుతో, మరి కొందరు ఇతర కారణాలు చెప్తూ డబ్బులు ఎవరైనా వసూలు చేస్తే తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. లబ్ధిదారులు ఎవరూ రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే



ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వినయ్ కుమార్ తో సహా స్థానిక కాంగ్రెస్ నాయకులు వార్డు కౌన్సిలర్లు అధికారులు, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# గోరింటాకు సంబరాలతో ఎల్లమ్మ ఆలయం కళకళ..!

**ఆషాఢ వేడుకల్లో గౌడ మహిళల సందడి..**

**సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా గోరింటాకు వేడుక**

**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత**

**సుల్తానాబాద్, ఆగస్టు 02 (నినాదం):** ఆషాఢ మాసం సందర్భంగా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని స్థానిక ఎల్లమ్మ తల్లి దేవాలయం ఆదివారం గోరింటాకు వేడుకలతో



కళకళలాడింది. మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ఉత్సాహంగా గోరింటాకు పెట్టించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు జానపద గీతాలు ఆలపిస్తూ, నృత్యాలు చేస్తూ వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. పెద్దల ఆశీస్సులు తీసుకుంటూ ఆషాఢ మాస విశిష్టతను చాటిచెప్పే ఈ వేడుకలో పాల్గొన్న మహిళలు సనాతన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత గౌడ్ మాట్లాడుతూ, గోరింటాకు వేడుకలు మహిళల్లో ఆనందాన్ని పంచడంతో పాటు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు యువతకు భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. వేడుకల ముగింపులో పరస్పరం ఆషాఢ మాస శుభాకాంక్షలు తెలుపుకుంటూ మహిళలు ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పి అందరినీ ఆకట్టుకుంది.

# కాసిపేటలో పేకాట గుట్టురట్టు

### జూదం జోరుకు చెక్.. ఐదుగురు అరెస్ట్




**మంచిర్యాల, ఆగస్టు 2 (నినాదం):** కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై రామగుండం పోలీస్ కమిషనరేట్ నార్కోటిక్ బృందం/టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు దాడి చేపట్టగా, ఓ ఇంటిలో నగదును పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ. 1,10,630 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కాసిపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక దృష్టి సారించిందని, జూదం, గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, ఇతర నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. తమ పరిసరాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసరలో రోడ్ల నిర్మాణానికి 27 కోట్ల నిధులు

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**నిర్మల్ ప్రతినిధి/భైంసా, ఆగస్టు 2 ( నినాదం):** రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర లో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం 27 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే పవార్ రామ రావ్ పటేల్ తెలియజేశారు.. ఆదివారం భైంసా లోని తన నివాసం లో ఈ విషయాన్ని వెల్లడించారు...పంచాయత్ రాజ్ ద్వారా ఓని నుండి బాసర వరకు రోడు మరమ్మత్తులకు 2 కోట్ల 55 లక్షలు, గన్నోరా నుండి ఓని వరకు 2 కోట్లు, పి. డబ్ల్యూ. డి. రోడ్ నుండి బాసర లో మహంకాళి టెంపుల్ రోడ్ కు 1 కోటీ 20 లక్షలు, కిర్గుల్ బి నుండి బాసర వరకు రోడ్ కనెక్టివిటికి 2 కోట్ల 80 లక్షలు, బాసర రైల్వేస్టేషన్ నుండి నావేగావ్ రోడ్ వరకు 1 కోటి 35 లక్షల నిధులు, మల్కాపూర్ మీదుగా బాసర వరకు 2 కోట్ల 70 లక్షలు ట్రిపుల్ ఐటి నుండి బాలాపూర్ రోడ్ కు 45 లక్షలు, పెట్రోల్ బంక్ నుండి శాంఖరి స్కూల్ వరకు 45 లక్షలు, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో బాసర అబాది నాలుగు లేన్ల రోడ్ పుష్కరా ఘాట్ వరకు 8కోట్ల 50 లక్షలు, బిద్రెల్లి నుండి ధర్మబాద్ కు 2 లైన్స్ రోడ్ కు 4కోట్ల 65 లక్షల రూపాయల నిధులు, బాసర బస్ స్టాండ్ రహదారి మరమ్మత్తుల కు 85 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2027 లో గోదావరి పుష్కరాల సందర్భంగా ఈ పనులను వేగవంతం చేయనున్నట్లు చెప్పారు.

# భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాల మహోత్సవం

**చింతలమానేపల్లి, ఆగస్టు 2 (నినాదం ):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని బారెగుడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆషాఢ బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ దేవత పోచమ్మ తల్లికి మహిళలు సంప్రదాయ బోనాలను పట్టు వస్త్రాలు ప్రసాదాలు బెల్లం పానకాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో మహిళలు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా ఊరి పోచమ్మ ఆలయానికి చేరుకోవడంతో గ్రామంలోని చిన్నలు పెద్దలు యువతీ యువకులు అందరూ తరలి రావడంతో గ్రామంలో సందడి భక్తి వాతావరణం ఏర్పడింది. బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా అమ్మవారి కటాక్షంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించినారు . రైతులు సుభిక్షంగా ఉండాలని, గ్రామంపై పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. బోనాల పండుగ మన సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే గొప్ప ఉత్సాహంగా కనుల పండుగ జరిగింది గ్రామంలోని అన్ని వార్డుల వారు



బోనాలతో శివశక్తులతో పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు తూమోజు తిరుమలాచార్య, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మహిళలు, యువతి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముప్పై ఐదు ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన బాల్య మిత్రులు..!!

**స్నేహానికి చిరస్మరణీయ వేడుక**

**కమాన్‌పూర్‌లో 1990-91 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**ఫ్రెండ్షిప్ డే సందర్భంగా అనుబంధాలకు కొత్త ఊపు**



**కమాన్పూర్ , ఆగస్టు 2 (నినాదం):** కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఆదివారం ఆత్మీయత, ఆనందాల నడుమ పూర్వ విద్యార్థుల కలయిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కమాన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990--91 విద్యా సంవత్సరానికి చెందిన



పదో తరగతి పూర్వ విద్యార్థులు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సమావేశమై స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న బాల్య మిత్రులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాల రోజుల మధుర అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. స్నేహం అనేది కాలం, దూరం చెరపలేని బంధమని పేర్కొంటూ ఇలాంటి సమావేశాలు ప్రతి సంవత్సరం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ శ్రీనివాస్, కిషన్ రెడ్డి, ఉప్పు శ్రీనివాస్, గాదె బాలుమల్లె పల్లి స్వామి, వడ్లకొండ తిరుపతి, బూడిద శ్రీనివాస్, రావికంటి శ్రీనివాస్, వేముల శ్యామ్, మద్ది రాజబాబు, దయ్యాల రాజయ్యతో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని ఫ్రెండ్షిప్ డే వేడుకలను విజయవంతం చేశారు.

# బోనాలతో మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2(నినాదం) :** ఆషాఢ బోనాల సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో వెలసిన మహంకాళి అమ్మవారికి సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు దంపతులు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్‌సిల్క్‌లోని తమ నివాసం నుంచి సంప్రదాయబద్ధంగా బోనంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మహిళ భక్తులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఘనంగా ఆషాఢ గోరింటాకు వేడుక..**

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్‌లోని నివాసంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు సతీమణి శివాని ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు స్వయంగా గోరింటాకు పెట్టి ఆషాఢ మాస శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ మహిళలతో ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ఉత్సాహంగా గోరింటాకు వేడుకను జరుపుకున్నారు.

# స్నేహబంధమే సమాజానికి నిజమైన బలం..!!

**డీసీసీ కార్యదర్శి గాండ్ల మోహన్**

**సెంటినరీ కాలనీలో ఘనంగా ఫ్రెండ్షిప్ డే వేడుకలు**

**కమాన్‌పూర్, ఆగస్టు2 (నినాదం):** స్నేహానికి కులం, మతం, ఆర్థిక స్థితితో సంబంధం లేదన్న నాయకులు,రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీలో మారుతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్షిప్ డే వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ముఖ్య అతిథిగా హాజరై స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గంటా వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్, డాక్టర్ శరణ్య, దుంతుల సురేష్, గుండం రవి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, జీవితంలో సంపదలు, హోదాలు శాశ్వతం కాకపోయినా నిజమైన స్నేహబంధం మాత్రం జీవితాంతం నిలిచే గొప్ప సంపద అని పేర్కొన్నారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ఒకరికి ఒకరు అండగా నిలబడటమే నిజమైన



స్నేహానికి గుర్తని అన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమ, విశ్వాసం, సహకారంతో సమాజంలో ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఫ్రెండ్షిప్ డే సందర్భంగా స్నేహితులు ఒకరినొకరు అభినందించుకుని, శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయ వాతావరణంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ ముగిసింది.

# నందిగుండం దుర్గామాత ఆలయంలో బోనాల సంబరాలు

**బంగల్ పేట్ మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం**

**పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి ఏలేటి కవిత రెడ్డి**

**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 2 ( నినాదం):** నిర్మల్ జిల్లా కేంద్రంలోని నంది గుండం శ్రీ దుర్గామాత ఆలయం లో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి ఏలేటి కవిత రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంగల్ పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ



కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్



నాయకులు రావుల రాంనాథ్, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజు నరేష్, శశాంక్, సూరజ్ నాయక్, జిల్లా దీజీవీ అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, బీజేపీ నాయకులు జుట్టు దినేష్, వెంకటేష్, కందుల హరీష్, భరత్,శ్రీకాంత్ రెడ్డి, విజయ్, దీక్షిత్ రెడ్డి, ఈర్ల చరణ్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'జై శ్రీరామ్' నామస్మరణతో చిన్నారుల్లో భక్తి జ్యోతి

**500 మందికి మెడల్స్, ప్రశంసా పత్రాలు**

**యువ సంకల్ప పౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ. రాజ్ కుమార్**

**సుల్తానాబాద్, ఆగస్టు 2(నినాదం):** చిన్నారుల్లో భక్తి భావాన్ని ఎంపొందించేందుకు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని యువసంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 10సంవత్సరాల లోపు చిన్నారులు 'జై శ్రీరామ్' అని 516 సార్లు రాసి నందుకు వారికి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ, నేటిఆధునిక యుగం లోచిన్నారులకు సంస్కారం, భక్తి, భారతీయ విలువలు అలవడాలంటే ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో 15 సంవత్సరాల లోపు పిల్లలను లక్ష్యంగా చేసుకుని మరిన్ని భక్తి భావ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని, సుమారు 500 మందికి పైగా చి



న్నారులు పాల్గొన్నారని తెలిపారు. విడతల వారీగా అందరికీ ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 3వవార్డు కౌన్సిలర్ సమత కుమార్, యువసంకల్ప ఫౌండేషన్ సభ్యులు చిలగాని విశ్వనాథ్, తుమ్మని శాంత్, మెగా బ్లడ్ డోనర్ గాలిపల్లి కుమార్, రమేష్, శివ, న్యూ హరిజన్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వప్న, గుంటి రాకేష్, పలువురు తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్యవైశ్య యువజన కార్యదర్శిగా రావికంటి సతీష్ కుమార్ నియామకం

**ఆర్యవైశ్య యువజన విభాగం నూతన కార్యవర్గంలో చోటు**



**మంథని, ఆగస్టు 2 (నినాదం) :** మంథని పట్టణానికి చెందిన రావికంటి సతీష్ కుమార్ కు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం లభించింది. హైదరాబాద్ లోని లక్డికాపూల్ వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు, యువజన ప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సమాజాభివృద్ధి, యువత సంక్షేమం, సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రావికంటి సతీష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవడం పట్ల మంథని ప్రాంత ఆర్యవైశ్య సంఘ నాయకులు, వ్యాపారవేత్తలు, యువజన ప్రతినిధులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమాజ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# హామీలు అమలు చేయక పోతే ఉద్యమమే

### రాష్ట్ర ప్రభుత్వంపై మండి పడ్డ ఆటో నేతలు

### ఆటో జేఏసీ అల్టిమేటం

**సుల్తానాబాద్, ఆగస్టు2 (నినాదం):** సుల్తానాబాద్ మండల కేంద్రంలో 23 గ్రామాల అధ్యక్షుల సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ మండల సమావేశం ఘనంగా జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా ఇన్ చార్జి జేరిపోతులకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించాలన్న హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 'ఫస్ట్ టూ లాస్ట్ ఆర్టీసీ ఆటో' కార్యక్రమాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను ముఖ్య పెట్టే విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కన్వీనర్ ఎనగందుల నాంపల్లి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కమిటీ, టౌన్ కమిటీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ ఎస్.కే. జబ్బర్, మడిపెద్ద రమేష్, సురేష్, స్వామి రమేష్ తదితర నాయకులు పాల్గొనగా, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.



# ట్రాన్స్ జెండర్స్ విషయంలో అపోహ ఉండవద్దు..

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 2 (నినాదం) :** మన సమాజంలో భాగమైన ట్రాన్స్ జెండర్స్ విషయంలో అపోహలు పెట్టుకోవద్దని వారి కష్టాలను గుర్తించి మనతోపాటు సమాన గౌరవం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్ లో డాక్యుమెంటరీ 50 రోజుల విజయోత్సవ కార్యక్రమానికి మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ అద్భుతమైన సామాజిక సందేశాత్మక చిత్రాన్ని రూపొందించిన దర్శకులు శ్రీ సునీల్ రెడ్డి గారికి, నిర్మాతలకు, కళాకారులకు, సాంకేతిక నిపుణులకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రస్తుత సమాజంలో "ట్రాన్స్‌జెండర్" అనే పదం వినగానే చాలామంది సంకోచిస్తారని అపోహలతో చూస్తారని మంత్రి అన్నారు. వారి జీవితంలో ఎదురయ్యే కష్టాలను అర్థం చేసుకోవడానికి బదులుగా వారిని దూరంగా ఉంచే పరిస్థితి ఉందని అలాంటి పరిస్థితుల్లో డాక్యుమెంటరీలు సమాజంలో అవగాహన తీసుకురావడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి అడ్లూరి తెలిపారు. దర్శకులు సునీల్ రెడ్డి గారు ఒక వాణిజ్య చిత్రాన్ని ఎంచుకోకుండా, సమాజానికి అవసరమైన అంశాన్ని ఎంచుకొని ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల నిజ జీవితాన్ని ఎంతో హృద్యంగా చిత్రీకరించారని మంత్రి తెలిపారు. చిన్నప్పటి నుంచే పాఠశాలల్లో వేధింపులు, కళాశాలల్లో వివక్ష, కుటుంబ సభ్యుల నిరాకరణ, సమాజంలో అవమానాలు, విద్య, ఉద్యోగం, వైద్యం, గౌరవప్రదమైన జీవితం కోసం వారు చేసే పోరాటాన్ని ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరించిందని మంత్రి అడ్లూరి అన్నారు. ఈ చిత్రం ప్రతి ఒక్కరిలో మానవత్వాన్ని, సమానత్వాన్ని పెంపొందించే ప్రయత్నం చేసిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ సమాజ అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. ట్రాఫిక్ విభాగంలో 38 మంది, మెట్రో విభాగంలో 20 మంది, హైడ్రా హోంగార్డులుగా 16 మంది ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. కేవలం ఉద్యోగాలు మాత్రమే కాదు.. వారి ఆత్మగౌరవానికి, స్వావలంబనకు, సమాజంలో సమాన అవకాశాలకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అని మంత్రి అన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా, ట్రాన్స్‌వుమన్ బ్రెస్ట్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1.5 లక్షల విలువైన మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు గౌరవప్రదమైన వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అదేవిధంగా విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలతో పాటు అర్హులైన ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు 2బి ఎచ్ కె గృహ పథకం ద్వారా కూడా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రిగా, ఈ సమాజం అభివృద్ధి, గౌరవ ప్రదమైన జీవితం, సమాన హక్కులు, సమాన అవకాశాల కోసం తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అడ్లూరి అన్నారు. ఈ డాక్యుమెంటరీ ప్రతి పాఠశాలకు, కళాశాలకు, ప్రతి కుటుంబానికి చేరుకొని ట్రాన్స్‌జెండర్ సమాజం పట్ల అవగాహన, గౌరవం, మానవత్వాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వివక్ష లేని, సమాన అవకాశాలు కలిగిన, ప్రతి ట్రాన్స్‌జెండర్ వ్యక్తి గౌరవంగా జీవించే తెలంగాణ నిర్మాణానికి మనమందరం కలిసి కృషి చేద్దామని మంత్రి అడ్లూరి పిలుపునిచ్చారు.

# బోధన్ లో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 2 (నినాదం ) :** బోధన్ పట్టణంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా శ్రీచక్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. గ్రంథాలయంలో మొక్కలను నాటారు. అంబేద్కర్ చౌరస్తాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, పిసిసి డెలిగేట్ గంగా శంకర్, బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకు దామోదర్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# వైభవంగా దుర్గాదేవి జాతర

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**మంచిర్యాల, ఆగస్టు 2 (నినాదం):** హాజీపూర్ మండల పరిధిలోని ఎంసీసీ క్వారీ శివారులో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ దుర్గాదేవి జాతరకు ఆదివారం భక్తుల తాకిడి నెలకొంది. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జాతరకు హాజరై అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికి, అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని శ్రీ దుర్గాదేవిని ప్రార్థించినట్లు తెలిపారు. రైతులకు పంటలు బాగా పండాలని, యువతకు మంచి అవకాశాలు లభించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, జాతర ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై స్థానిక నాయకులు, నిర్వాహకులతో చర్చించారు. భక్తులు కూడా ఎమ్మెల్యేతో ఆత్మీయంగా మాట్లాడి స్థానిక సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జాతర ప్రాంగణంలో ఎమ్మెల్యే రాకతో సందడి నెలకొంది. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, వైస్ చైర్మన్ జాలే రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

### విశాల హృదయంతో మరోసారి

# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

## రూ.18 లక్షలు ఖర్చు చేసి 23 ఏళ్ల యువకున్ని బతికించిన మానవతావాది





**మునుగోడు, ఆగస్టు2 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం. నాంపల్లి మండలం,ఫకీర్ పురానికి చెందిన, ముదిగొండ యాదయ్య తండ్రి కృష్ణయ్య తీవ్ర అనారోగ్య సమస్యతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించి ప్రాణం పోసిన ప్రాణదాత, పార్టీలకతీతంగా ప్రాణాలు నిలబెడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి. రాజ్ గోపాల్ రెడ్డి చేసిన సేవను జీవితాంతం గుర్తుంచుకుంటామని కుటుంబ సభ్యులు, తెలిపారు. ఇంత మంచి మానవత్వం ఉన్న వ్యక్తి మాకు ఎమ్మెల్యేగా ఉండడం మా అదృష్టం అంటూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఊర పండుగ బందోబస్తును పరిశీలించిన సీపీ



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2 (నినాదం) :** నగరంలో ఊర పండుగ సందర్భంగా జరిగే ఊరేగింపు కార్యక్రమంలో బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్వయంగా పరిశీలించారు. ఆదివారం ఊర పండుగ జరిగే ప్రధాన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలు, రద్దీ కూడళ్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, సున్నిత ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా పోలీసు బృందాలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, అంబులెన్స్ లు, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పండుగ ప్రాంతమంతా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. పికెట్‌లు, మొబైల్ పెట్రోలింగ్ బృందాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి భక్తులకు భద్రత కల్పించాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ప్రజలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించాలని, పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఊర పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ అన్ని విధాలుగా విస్తృత బందోబస్తు చర్యలు చేపట్టిందని, ప్రజల సహకారంతో పండుగను విజయవంతంగా నిర్వహించగలమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ, సీసీఎస్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, గురు నాయుడు, శ్రీశైలం, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్‌హెచ్ఓ రఘుపతి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కదిలిన యంత్రాంగం

## 'యథేచ్ఛగా డీఏపీ ఎరువుల దందా' కథనానికి స్పందన

## అధిక ధరలకు విక్రయించిన ఇద్దరు డీలర్ల లైసెన్సుల సస్పెన్షన్


నినాదం
యదేచ్ఛగా డీఏపీ ఎరువుల దందా

**మోతే, ఆగస్టు 2(నినాదం):** 'యథేచ్ఛగా డీఏపీ ఎరువుల దందా' శీర్షికతో నినాదంలో ప్రచురితమైన కథనానికి స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే అధిక ధరలకు డీఏపీ ఎరువులు విక్రయించినట్లు తనిఖీల్లో గుర్తించి అన్నారిగూడెం గ్రామంలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, మోతె గ్రామంలోని శ్రీ వెంకట సాయి ఏజెన్సీ ఫర్టిలైజర్ లైసెన్సులను ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు--1985 ప్రకారం తక్షణమే సస్పెండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందేలా తనిఖీలు కొనసాగుతున్నాయని, అధిక ధరలకు విక్రయించినా లేదా నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత డీలర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఏడిఏ ప్రశాంతి, ఏవో అరుణ హెచ్చరించారు.

NINADAM CINEMA

### రజనీకాంత్ కోసం

# రూటు మార్చిన స్టార్ నటుడు



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'జైలర్ 2'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ అప్డేట్ బయటకు రావడంతో సినిమాపై మరింత హైప్ ఏర్పడింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉన్న పలువురు నటులు ఈ సినిమాలో క్యామియో పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ జాబితాలో మరో స్టార్ నటుడు చేరారు. కోలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కూడా 'జైలర్ 2'లో కనిపించనున్నట్లు తాజాగా స్వయంగా ధృవీకరించారు. కొంతకాలం క్రితం తాను ఇకపై హీరో పాత్రలు తప్ప ఇతర పాత్రలు చేయనని విజయ్ సేతుపతి చెప్పిన విషయం తెలిసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయన ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించడం ఆసక్తికరంగా మారింది. ఈ విషయంపై స్పందించిన విజయ్ సేతుపతి.. నాకు సాధారణంగా సినిమాల్లో ఇతర పాత్రలు చేయాలనే ఆసక్తి లేదు. కానీ ఇది రజనీకాంత్ గారి సినిమా కావడంతోనే గెస్ట్ రోల్ చేయడానికి ఒప్పుకున్నానని తెలిపారు. ఇక నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 15న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.




# రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు..

### క్యాస్టింగ్ కౌచ్‌పై శ్రీగౌరీ ప్రియ సెన్సేషనల్ కామెంట్స్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీగౌరీప్రియ ముందుగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి మంచి ఫేమ్ రాబట్టుకున్నారు. తెలుగులో తొలినాళ్లలో అనుకున్నంత అవకాశాలు రాకపోవడంతో 'లవర్' సినిమాతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చి తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఆ తర్వాత తెలుగులో 'శ్రీకారం', 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' వంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఇటీవల వచ్చిన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంతో మరో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో ఆమె చూపించిన నటనకు ప్రేక్షకులతో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు సైతం ఫిదా అయిపోయి ప్రశంసల వర్షం కురిపించారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న శ్రీగౌరీప్రియ తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "నేను నమ్మేది ఒకటే.. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి. మనిషి అన్నాక పూర్తి క్లారిటీ ఉండాలి, మనకి ఏం కావాలో సరిగ్గా తెలియాలి. అది సరిగ్గా డిసైడ్ అయితే మనల్ని దాటి ఎవరూ ఏమీ చేయలేరు. కెరీర్‌లో ధైర్యం, క్లారిటీ చాలా ముఖ్యం, నాకు ఆ రెండూ ఉన్నాయి" అని స్పష్టం చేసింది. అలాగే తన ప్రాజెక్ట్‌ల ఎంపిక, మనీ మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుతూ.. "కథ బాగుండాలి, సినిమా బాగుండాలి, అందులో నేను బాగుండాలి.. ఈ మూడు కలిసొచ్చే సినిమాలే చేస్తాను. నేను కేవలం నాలోని నటిని మాత్రమే చూపిస్తూ పోతే ఆఫర్లు ఎలా వస్తాయి? నటనతో పాటు డబ్బులు కూడా సంపాదించాలి కదా! డబ్బులు వద్దు, కేవలం మంచి సినిమాలే చేస్తానంటే కుదరదు కదా" అని అన్నారు. ఇక తన కెరీర్, పెళ్లి గురించి స్పందిస్తూ.. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ నటనపైనే ఉందని, ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన ఏదీ లేదని, కానీ భవిష్యత్తులో ఖచ్చితంగా చేసుకుంటానని చెప్పింది.

# 1జిడిఎన్' సినిమాలోకి బ్రిగిడా సగా ఎంట్రీ..

### ఫస్ట్ లుక్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్



భారతీయ గొప్ప ఆవిష్కర్త, 'ఇండియన్ ఎడిసన్'గా పేరొందిన జి.డి. నాయుడు జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ బయోపిక్ చిత్రం 'జిడి ఎన్'. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో జి.డి. నాయుడు టైటిల్ పాత్రలో వర్సటైల్ యాక్టర్ ఆర్. మాధవన్ కనిపిస్తున్నారు. ఇందులో దుషారా విజయన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సత్యరాజ్, జయరామ్, ప్రియమణి వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 7న థియేటర్లలోకి రాబోతోంది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మూవీ మేకర్స్ ప్రమోషన్లను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా చిత్రబృందం తాజాగా ఈ సినిమాలోని మరో కీలక పాత్రను ప్రేక్షకులకు పరిచయం చేసింది. కోలీవుడ్ గ్లామరస్ బ్యూటీ బ్రిగిడా సగా ఈ సినిమాలో 'దైవనై' అనే ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటిస్తూ ఒక లుక్‌ను వెల్లడించారు. ఒక గొప్ప భారతీయ ఆవిష్కర్త జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తుండటం, దానికి తోడు భారీ తారాగణం తోడవడంతో 'జిడి ఎన్' సినిమాపై సినీ ప్రియుల్లో మరియు ఇండస్ట్రీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

# పట్టు చీరలో మెరిసిన సంయుక్త మీనన్..

## ట్రెడిషనల్ లుక్‌కు ఫిదా అవుతున్న ఫ్యాన్స్



మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ సంయుక్తా మీనన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. సంయుక్త అఖరుగా బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'అఖండ 2' చిత్రంలో కనిపించింది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఈ భామ నిఖిల్ హీరోగా రూపొందుతున్న 'స్వయంభు' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సంయుక్త సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన అందమైన ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ భామ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోల్లో సంయుక్త గోల్డ్ అంచుతో కూడిన ఎరుపు రంగు పట్టు చీరను ధరించింది. దానికి లేత క్రీమ్ రంగు బ్లౌజ్‌ను జత చేసింది. మెడలో భారీ హారం, చెవులకు పెద్ద ఇయర్‌రింగ్స్, ఒక చేతికి బ్రేస్‌లెట్ ధరించి మరింత అందంగా మెరిసింది. అలాగే కురులు ముఖంపై అందంగా పడేలా స్టైల్ చేసుకోవడంతో ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణ వచ్చింది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787